- అయోధ్యలోపారిశుద్ధ్య మహిళపై గ్యాంగ్‌రేప్
- దేశవ్యాప్తంగా వైద్యులకు ఇక ప్రత్యేక ఐడీలు
- ఇన్సులిన్ నిరోధకతకు హార్మోన్ చికిత్స
- ఐదేండ్లలో 5 వేల నకిలీ వీసాలు.. ముఠా అరెస్ట్
- రోజూ స్నానం చేయట్లేదని భర్తకు విడాకులు

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

www.ntnews.com
/ntdailyonline

NAMASTE TELANGANA

సోమవారం MONDAY 16.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 102 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

సోమవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-17. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: త్రయోదశి పగలు 3-10 వరకు. నక్షత్రం: ధనిష్ఠ సాయంత్రం 4-33 వరకు. వర్జ్యం: రాత్రి 10-57 నుంచి రాత్రి 12-23 వరకు. రాహు కాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-07 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-35 నుంచి పగలు 1-23 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-01 నుంచి పగలు 3-49 వరకు. అమృతకాలం: ఉదయం 7-07 నుంచి ఉదయం 8-34 వరకు. కన్యా సంక్రమణం రాత్రి 7-42 గంటలకు.

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..



పక్షం రోజుల క్రితం మున్నేరు వరదల్లో నిండా మునిగిన ఖమ్మం పట్టణంలోని గణేశ్‌నగర్‌లో కోటయ్య రేకుల ఇల్లు; ఇన్‌సెట్‌లో దోరేపల్లి కోటయ్య(70)

గూడు చెదిరింది.. గుండె ఆగింది

వరద సాయం కోసం ఎదురుచూపులో అలసిన పేద ప్రాణం

మున్నేరు ముంచేస్తే సర్కారు చేతులెత్తేసింది.. గుండెపోటుతో కోటయ్య మృతి

ఖమ్మం గణేశ్ నగర్‌లో విషాదం.. దహన సంస్కారాలకు బీఆర్‌ఎస్ నేతల సాయం

ఏడుపదుల వయస్సు.. ఓ రేకుల ఇల్లు.. ఆ వృద్ధ దంపతుల ఆ చిన్న ప్రపంచాన్ని ఓ అర్ధరాత్రి మున్నేరు ముంచెత్తింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కట్టుబట్టలతో బయటపడ్డారు. బంధువుల ఇంట్లో తలదాచుకున్నారు. వరద శాంతించాక వచ్చిచూస్తే.. ఇల్లంతా బురద! కూలిన గోడలు వెక్కిరించాయి. వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. సాయంకోసం ఎదురుచూస్తుంటే సర్కారు చేతులెత్తేసింది. ఆదుకోవాల్సిన మంత్రులు కాలయాపన చేశారు. వారికి బతుకే భారంగా మారింది. కంటికి రెప్పలా కాపాడుకున్న గూడు కండ్లముందే చెదరడంతో.. ఇంటిపెద్ద గుండె తట్టుకోలేకపోయింది. మనోవేదనతో ఆదివారం ప్రాణం వదిలాడు. ఇదీ దోరేపల్లి కోటయ్య కథ. ఖమ్మం మున్నేరువాగు వరద బాధితుడి కన్నీటి వ్యథ. › 10



తెలంగాణ తల్లికి అపచారం

- **తెలంగాణ ఆత్మతో సర్కార్ ఆటలు**
- **సచివాలయం వద్ద రాజీవ్ విగ్రహం**
- **నేడు ఆవిష్కరణ.. హడావుడిగా ఏర్పాట్లు**
- **పొన్నం ప్రభాకర్ పేరుతో ఆహ్వానాలు**
- **తెలంగాణ ప్రజలు వద్దన్నా బేఖాతరు**
- **సమయం, సందర్భం లేకుండా ఆవిష్కరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతున్నది. కవులు, కళాకారులు, మేధావులు, బుద్ధిజీవులు సహా తెలంగాణ సమాజమే వద్దని మొత్తుకున్నా రేవంత్ సర్కారుకు చీమకుట్టినట్టు అయినా లేదు. ఎటూకాని › 2వ పేజీలో

మంత్రులదో మాట.. సీఎందీ మరో మాట



రేవంత్.. మాఫీ చేసేదాకా నీ గుండెల్లో నిద్రపోతా

- వందశాతం రుణమాఫీ అయ్యేదాకా నిన్ను వదిలిపెట్ట
- నీ ఊరు కొండారెడ్డిపల్లికే వెళ్దాం.. డేట్, టైం నువ్వే చెప్పు
- ఎంతమందికి రుణమాఫీ అయ్యిందో అక్కడే తేల్చుదాం
- నా ఎత్తు గురించి మానేసి రైతుల గురించి ఆలోచించు
- ముఖ్యమంత్రీ.. నీ బుద్ధి, నీ చరిత్ర, నీ భాష అన్నీ కురచే
- 100 రోజుల్లో చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఏమైనయ్?
- ఫోర్త్ సిటీ ఎక్కడిది? దానికి భూమి ఎక్కడున్నది?
- అరికెపూడి గాంధీ ఇప్పుడు ఏ పార్టీకీ కాకుండా పోయాడు
- నువ్వే చితక్కొట్టండి అంటే శాంతిభద్రతలు దెబ్బతినవా?
- నీ మాటలు వింటే అబద్ధమే ఆత్మహత్య చేసుకుంటది
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్ ఆగ్రహం › 2

రుణమాఫీ, గాంధీ ఘటనలపై విరుద్ధ ప్రకటనలు

పొంతన లేని వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో గందరగోళం

- **మాఫీ పూర్తి కాలేదన్న భట్టి, తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి**
- **రుణమాఫీ ఆగస్టులోనే పూర్తి చేసినట్టు చెప్పిన రేవంత్**
- **గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే అంటున్న శ్రీధర్‌బాబు, భట్టి**
- **ఆయన తమ వాడేనంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి**
- **కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసింది కాంగ్రెస్‌వాళ్లేనని వెల్లడి**

కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు మధ్య గ్యాప్ ఉన్నట్టు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్నది. అందుకు తగ్గట్టుగానే చాలా సందర్భాల్లో ఒకే అంశంపై రేవంత్, మంత్రులు పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారు. రుణమాఫీ చేశామని సీఎం అంటుంటే, త్వరలోనే పూర్తిచేస్తామని మంత్రులు చెప్తున్నారు. గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే అని మంత్రులు అంటుంటే.. తమవాడేనంటూ ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు.



అరికెపూడి గాంధీ తమ వాడేనని, తమ వాళ్లే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. అయితే, గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే అంటూ మంత్రులు శ్రీధర్‌బాబు, మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ విషయంలోనూ మంత్రులు గత నెలరోజులుగా చెప్తున్న మాటలకు, సీఎం చేస్తున్న ప్రకటనలకు ఎక్కడా పొంతన ఉండటం లేదు. ఒకే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు విరుద్ధ ప్రకటనలు చేయడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశమైంది. రేవంత్‌రెడ్డి ఇటు ప్రభుత్వ పరంగా, అటు పార్టీ పరంగా తీసుకుంటున్న నిర్ణయాలపై ఇతర మంత్రులు, నేతలతో చర్చిస్తున్నారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



మాఫీ పూర్తి చేసినం

- 2 లక్షల వరకు రుణాలమాఫీ పూర్తి
- మాట నిలబెట్టుకున్నం: సీఎం రేవంత్
- మాఫీపై సీఎం రెండు నాల్కల ధోరణి
- చేశామని, చేస్తామని విరుద్ధ ప్రకటనలు
- మాఫీ పూర్తయితే ఇంకా చేయాల్సిన 19 లక్షల మంది రైతుల సంగతేంది? › 5

కౌశిక్ ఇంటిపై దాడి చేసింది మనోళ్లే!

- **గాంధీభవన్ సాక్షిగా రేవంత్ ఒప్పుకోలు**
- **ఎట్టకేలకు కాంగ్రెస్ కుట్ర బట్టబయలు** › 5



భువనగిరిలో ఆదివారం జిట్టా బాలకృష్ణారెడ్డి సంతాప కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు

'చిట్టినాయుడు' టీడీపీలోనే ఉన్నారా?

- గాంధీపై చెప్తున్న లాజిక్ ఆయనకూ వర్తిస్తదా?
- అతి తెలివితో కోర్టును మోసం చేయలేరు
- ఓటుకు నోటు దొంగను రక్షిస్తున్నదెవరు?
- కాంగ్రెస్ పాలనలో ఎవుసానికి కౌంట్‌డౌన్
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): మంత్రి శ్రీధర్‌బాబు చెప్తున్న లాజిక్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంకా టీడీపీలోనే ఉన్నట్టేనా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'అతి తెలివి మంత్రీ.. మీ 'చిట్టినాయుడు' ఇంకా టీడీపీలోనే ఉన్నారా?' అని ఎక్స్ ద్వారా నిలదీశారు. మంత్రి దుద్దిళ్ల చెప్తున్నది నిజమే అయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరిగి కాంగ్రెస్ కండువాలు › 3వ పేజీలో

ఫార్మాసిటీ ఉన్నట్టా? లేనట్టా?

కొనసాగించకపోతే భూములు రైతులకిచ్చేయాలి

లేకపోతే పోరాటమే.. సీఎంకు లేఖలో కేటీఆర్



జూరాలపై పెనుభారం

- భీమా ఆయకట్టు ప్రశ్నార్థకం
- నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్‌తో తీవ్ర ప్రభావం
- సర్కారు అనాలోచిత నిర్ణయం
- ఉన్నవే 17 టీఎంసీలు.. అయినా కొడంగల్ లిఫ్టుకు రెడీ
- నికర జలాలను అడగకుండా భీమా జలాల్లోనే కోత › 6

కేరళలో నిఫా కలకలం › 7

మలప్పురంలో ఒకరి మృతి

16 రోజులుగా పవర్ కట్

- **సూర్యాపేట జిల్లా మామిళ్లగూడెంలో సాగుకు నిలిచిన కరెంటు సరఫరా**
- **నీళ్లు లేక ఎండిపోతున్న పొలాలు**
- **విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద రైతుల ధర్నా**

మోతె, సెప్టెంబర్ 15: 16 రోజులుగా వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం రైతులు ధర్నా చేశారు. మామిళ్లగూడెం, కొత్తగూడెం గ్రామాల రైతులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. పొలాలకు విద్యుత్తు రావడం లేదని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు › 5వ పేజీలో



కరెంటు సరఫరా లేక పంటలు ఎండిపోతుండటంతో సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

నేల విడిచిన హైడ్రా!

ఇటీవల రాంనగర్ మణెమ్మగల్లీలో ఆక్రమణల కూల్చివేత తరువాత వ్యర్థాలను అక్కడే పడేసి వెళ్లిన హైడ్రా అధికారులు



చెరువుల రక్షణ లక్ష్యం మరచి.. కూల్చివేతలపై దృష్టి

- భయోత్పాతమే తప్ప.. జలవనరుల సంరక్షణ చర్యలేవి?
- ఎఫ్‌టీఎల్ నిర్మాణాలను కూల్చేస్తే వరదలు తగ్గుతయా?
- పూడిక తీసి, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఆధునికీకరిస్తేనే ఫలితాలు

హైడ్రా తీరుపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): లేక్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణ ఈ పదేండ్లలోనే జరిగిందా? గొలుసుకట్టు చెరువులతో నిండిన ఈ నగరంలో జలవనరుల విధ్వంసం ఇటీవలే మొదలైందా? వేల సంఖ్యలో చెరువులు, కుంటలు, నాలాలు ఉన్నా హైదరాబాద్‌లో వరదలు ఎందుకు వస్తున్నాయి. జల వనరుల పరివాహక ప్రాంతాల్లో జరిగిన పట్టణీకరణే అర్బన్ ఫ్లడ్స్‌కు కారణమా? హైడ్రా పేరిట చెరువులు, కుంటల వెంబడి ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తే వరదలు తగ్గుతాయా? చెరువులకు పూర్వవైభవం వస్తుందా? కూల్చివేతలతోనే చెరువులకు పూర్వ › 6వ పేజీలో

కేజ్రీవాల్ 'ముందస్తు' వ్యూహం రెండ్రోజుల్లో రాజీనామా!



- **ఢిల్లీ ముఖ్యమంత్రి సంచలన ప్రకటన**
- **మహారాష్ట్రతో పాటే ఢిల్లీ అసెంబ్లీకీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్**
- **2, 3 రోజుల్లో పార్టీ సమావేశం**
- **కొత్త సీఎం ఎంపికపై నిర్ణయం** › 7
- **తెరపైకి ఆతిశీ, సునీత, సౌరభ్ పేర్లు**

ప్రధాని పదవికి విపక్షం ఆఫర్! నేనే తిరస్కరించా




- **ప్రధాని కావడం నా జీవితాశయం కాదు**
- **కేంద్రమంత్రి గడ్కరీ సంచలన వ్యాఖ్యలు**
- **మోదీకి సందేశం పంపేందుకే వ్యాఖ్యలు**
- **విపక్షాన్ని అడ్డుపెట్టుకొని గడ్కరీ నాటకం**
- **శివసేన నేత ప్రియాంక చతుర్వేది** › 7

మోదీ 3.0లోనే జమిలి!

- ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే అమలు › 7
- ఆ దిశగా ఆలోచిస్తున్నామన్న కేంద్ర ప్రభుత్వవర్గాలు

త్వరలోనే జనగణన

- దేశవ్యాప్త జనాభా లెక్కల ప్రక్రియపై కసరత్తు
- కులగణనపై తేల్చుకోలేకపోతున్న సర్కారు › 7
- ఇంకా నిర్ణయం తీసుకోలేదు: కేంద్ర వర్గాలు



అధినేత కేసీఆర్‌తో నేతల భేటీ

బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా సీనియర్ నేతలు, మాజీ మంత్రులు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయిన నేతలు జరుగుతున్న రాజకీయ పరిణామాలు సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ. శ్రీనివాస్‌గౌడ్, కేపీ వివేకానంద గౌడ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.9°c	23.0°c
మెదక్	34.2°c	20.5°c
ఖమ్మం	34.0°c	26.0°c
కరీంనగర్	32.0°c	24.0°c
నల్లగొండ	32.0°c	23.0°c
రంగారెడ్డి	32.0°c	20.6°c
నిజామాబాద్	31.5°c	22.9°c
హైదరాబాద్	31.3°c	23.2°c
వరంగల్	31.0°c	24.0°c
మహబూబ్‌నగర్	30.5°c	22.3°c

రుణమాఫీ చేసేదాకా నీ గుండెల్లోనే నిద్రపోతా

- అప్పటి వరకు బీఆర్‌ఎస్ వదిలిపెట్టదు
- కొండారెడ్డిపల్లికి వెళ్దాం డేట్, టైం చెప్పు
- ఎందరికి మాఫీ అయిందో తేల్చుదాం
- నా ఎత్తు గురించి మానేసి రైతుల గురించి ఆలోచించు
- నీ బుద్ధి, చరిత్ర, భాష.. అన్నీ కురచే
- 100 రోజుల్లో 6 గ్యారెంటీలేమైనయ్
- ఫోర్త్ సిటీకి భూమి ఎక్కడుంది? ఈ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- గాంధీ ఏ పార్టీకి కాకుండా పోయాడు
- సీఎం కొట్టండి.. చితక్కొట్టండి అంటే శాంతిభద్రతలు దెబ్బ తినవా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ ఆగ్రహం



తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మాట తప్పిన సన్నాసి, మోసం చేసిన సన్నాసి అని నేను కూడా వందసార్లు అనగలను. కానీ, నాకు సంస్కారం ఉన్నది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని మాట తప్పిన సన్నాసివి నువ్వు కాదా? -హరీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ జరిగే వరకు సీఎం రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతానని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ పూర్తికాలేదని, ఇంకా 22 లక్షల మందికి జరగాల్సి ఉన్నదని పేర్కొన్నారు. రుణమాఫీ జరిగినట్టు సీఎం సొంతగ్రామం కొండారెడ్డిపల్లిలో చూపించాలని, తేదీ, సమయం ప్రకటిస్తే తాను వస్తానని సవాల్ విసిరారు. రుణమాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ వదిలిపెట్టదని హెచ్చరించారు. తన ఎత్తు గురించి మాట్లాడే రేవంత్‌రెడ్డి తన ఎత్తుకు పెరగలేడని ఎద్దేవా చేశారు. రేవంత్ బుద్ధి, చరిత్ర, భాష అన్నీ కురచేనని విమర్శించారు. రేవంత్ మాటలను బట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై గాంధీతో దాడి చేయించింది ఆయనేనని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, వాసుదేవరెడ్డితో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఒకటి వానల వల్ల వచ్చేది అయితే, రెండోది సీఎం అబద్ధాల వరద అని విమర్శించారు. తన కుర్చీకైనా మర్యాద ఇవ్వాలని రేవంత్ ఇటీవల అన్నారని, అలా జరగాలంటే భాష, వ్యవహారశైలి, నడవడిక మర్యాదగా ఉండాలని స్పష్టం చేశారు. బూతులు మాట్లాడి మర్యాద రమ్మంటే ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. తనను తాటిచెట్టు అన్నందుకు.. తాను లిల్లీపుట్ అని తిరిగి అనొచ్చని, తనను సన్నాసి అంటే తాను కూడా సన్నాసి అనగలనని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బంది పడుతున్నారు. ఒకటి ప్రకృతిపరమైన వరద, రెండోది ముఖ్యమంత్రి అబద్ధాల వరద. -హరీశ్

ఎంత తండ్లాడినా ఎత్తు పెరగలేవు

తన ఎత్తు గురించి పదేపదే రేవంత్ దుర్భాషలాడుతున్నాడని, తన ఎత్తుపై ఎందుకంత ఈర్ష్య అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'నేను పొడుగే. అది దేవుడిచ్చింది. తెలంగాణ ఉద్యమం నన్ను మరింత పొడుగు చేసింది. నువ్వు ఎంత తండ్లాడినా నా అంత ఎత్తు పెరగలేవు' అని రేవంత్‌కు తేల్చి చెప్పారు. చిల్లర మాటలు బంద్‌చేసి రాష్ట్రం గురించి, రైతుల గురించి, ప్రజల గురించి ఆలోచించాలని రేవంత్‌కు హితవు పలికారు.

ఏ ఊర్లోనైనా చెప్పించు

రుణమాఫీ జరిగిందని ఏ ఊర్లో అయినా చెప్పించాలని రేవంత్‌కు హరీశ్ సవాలు విసిరారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో 122 మందిలో ఇంకా 82 మంది రైతులకు రూ. 1.05 కోట్లు ఇంకా మాఫీ కావాల్సి ఉన్నదని తెలిపారు. ఆ వివరాలు సీఎంకు పంపిస్తానని తెలిపారు. రుణమాఫీ జరిగి ఉంటే సురేందర్‌రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడని ప్రశ్నించారు. 'రైతులను మోసం చేసింది నువ్వు, మాట తప్పింది నువ్వు, రుణమాఫీ చేయంది నువ్వు, ఇంకా నా గురించి మాట్లాడుతవా?' అని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. డిసెంబర్‌లో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, రూ. 4 వేల పింఛను ఇస్తా అన్నది నువ్వు కాదా? మహిళలకు రూ.2500 ఇచ్చినవా? అని ప్రశ్నించారు. 'విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తానని మోసం చేసిన సన్నాసి నీవు కాదా? ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన సన్నాసివి నీవు కాదా?' అని సీఎంను దునుమాడారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక మంది రైతులు రూ. 2 లక్షల రుణం ఉన్నవారు పై మొత్తాన్ని చెల్లించారని, వారికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాట మీద ఉండే మనిషివి అయితే వెంటనే రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు.

ఫోర్త్ సిటీ ఎక్కడిది?

ఫోర్త్ సిటీ ఎక్కడిదని, దానికి భూమి ఎక్కడుందో చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫార్మా సిటీకి కేసీఆర్ ప్రభుత్వం 12 వేల ఎకరాలను సేకరించిందని, ఫార్మా రంగంలో ఉద్యోగాలు, పెట్టుబడులు రావాలని, మంత్రిగా కేటీఆర్ రూ.1500 కోట్లు ఖర్చు చేసి భూమిని సేకరించారని హరీశ్‌రావు తెలిపారు. ఆ భూమిని ఫార్మా సిటీకి ఇవ్వకుండా దానిని ఏదో ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీ భూములను రైతులకు వాపస్ ఇస్తామని అన్నారని, రైతులకు భూములను వాపస్ ఇవ్వాలని, లేకుంటే ఫార్మా సిటీ పెట్టాలని డిమాండ్ చేశారు.

నాడు ఉచిత కరెంట్.. నేడు ఉత్త కరెంట్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇచ్చిన ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్ అయిందని, 4, 5 గంటలు కూడా రాకపోయేదని, నిజమైన ఉచిత కరెంట్ ఇచ్చింది కేసీఆర్ హయాంలోనే అని హరీశ్‌రావు గుర్తుచేశారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చామని, కనురెప్ప కొట్టినంత సేపు కూడా పోలేదని గుర్తుచేశారు.

నీ గుండెల్లో దాక్కున్నా

'నేను ఎక్కడ దాక్కున్నా.. నీ గుండెల్లో దాక్కున్నా.. నీ గుండెల్లో నిద్రపోతున్న. నీకు నిద్ర పట్టనియ్యకుండా అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తుచేస్తూ మెడలు వంచి సగం రుణమాఫీ చేయించిన. మిగతా సగం చేయించేదాకా నీ వెంట పడుతూనే ఉంటా. రాష్ట్రంలో 42 లక్షల మంది రుణమాఫీ అయ్యే వరకు నీ గుండెల్లో నిద్ర పోతా' అని రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

నేనెక్కడా దాక్కోలే. నీ గుండెల్లో నిద్రపోతూ, నిన్ను నిద్ర పోనివ్వకుండా చేస్తున్న. అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తుచేస్తూ మీ మెడలు వంచి సగం మాఫీ చేయించా. మిగతా సగం చేసేదాకా నీ వెంటపడుతూనే ఉంటా. -హరీశ్

అవి పగటి కలలు

రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని, పదేపదే పదేండ్లు పాలిస్తామని చెప్తున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో ఐదేండ్లకే ఓడిపోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు రెండుసార్లు వచ్చేంత సీన్ లేదని తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి ఐదేండ్లు ఉండేదే ఎక్కువని, ప్రజలు ఇప్పటికే బాధ పడుతున్నారని అన్నారు.

బదిలీలే జరగలేదా..?

ఉపాధ్యాయుల బదిలీలు 18 ఏండ్ల తర్వాత చేపట్టామని రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్తున్నాడని, 2018లో కేసీఆర్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. స్కూల్స్‌కు ఇంతకుముందు ఉచిత కరెంట్ లేనట్టుగా చెప్తున్నాడని, కానీ గతంలోనే ఉచిత కరెంట్ ఉందని, దీనికి సంబంధించిన మొత్తాన్ని స్కూల్స్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ గ్రాంట్‌ను బంద్ చేసి ప్రభుత్వమే విద్యుత్తుశాఖకు బిల్లులను చెల్లిస్తుందని పేర్కొన్నారు.

సీఎం సన్నాయి నొక్కులు

అరికెపూడి గాంధీ ఇప్పుడు ఏ పార్టీకి కాకుండా పోయాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం మాటలను బట్టి తానే దాడిచేయించినట్టు అర్థమవుతున్నదని, పైగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటనా? ఒక రాష్ట్రాన్ని పరిపాలించే విధానమా ఇది? నిజంగా ఆ రోజు కేసీఆర్ ఆలోచించి ఉండి ఉంటే ఏమైతుండే అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన్ని కూడా కాంగ్రెస్ ఘనకార్యంగా చెప్పుకుని అబద్ధమాడుతున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఉండి దంచుండ్రి, కొట్టండి, చితక్కొటండ్రి, చింతకాయ కొట్టుండ్రి వంటి మాటలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతినవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క కమ్యూనల్ సంఘటన కూడా జరగలేదని, కానీ రేవంత్‌రెడ్డి హయాంలో 9 కమ్యూనల్ ఘటనలు జరిగాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు బంద్‌చేసి సభ్యతతో మాట్లాడాలని హరీశ్‌రావు హితవు పలికారు.



కాంగ్రెస్ అంటేనే బోగస్

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన
- ప్రజాస్వామ్యం ఖూనీ అయింది
- పాలన చేతకాకుంటే దిగిపోండి
- బీఆర్‌ఎస్‌పై దాడులు చేస్తే సహించం
- బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అంటేనే బోగస్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి..రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేశాం హరీశ్‌రావు రాజీనామా ఏమైందని మరోసారి ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలు అమలు చేస్తే ఇప్పటికీ రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని మరోసారి అబద్ధాలు మాట్లాడుతున్నారని, దీనికి నిరుద్యోగులే సమాధానం చెపుతారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వరికి రూ.500 బోనస్ అని ఉందని, ఎక్కడా సన్నవడ్లకు బోనస్ అనిలేదని మ్యానిఫెస్టోను చూపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ఎమర్జెన్సీ పాలన సాగుతుందని ఆరోపించారు. అధికారపార్టీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష ఎమ్మెల్యే ఇంటి మీద దాడి చేస్తుంటే పోలీసులు చోద్యం చూశారని, ఇది సర్కారు వైఫల్యమేనని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలను కాపాడలేకపోతున్నారని, పాలన చేతకాకుంటే దిగిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తల మీద దాడులు, అవాంఛనీయ సంఘటనలు జరిగితే సహించేలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, గోసుల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవం బీజేపీ కుట్రలో భాగం

- కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలి
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీజేపీ కుట్రలో భాగంగానే ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఏఐసీసీ నుంచి పీసీసీ దాకా కాంగ్రెస్ పార్టీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి ఆంతర్యాన్ని గ్రహించాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులకు లేఖ రాశారు. 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీన నేపథ్యాలను గ్రహించాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవం కాంగ్రెస్ పార్టీ మూలసూత్రాలకు, భావజాలానికి విరుద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. భవిష్యత్ రాజకీయ అవసరాల కోసమే రేవంత్‌రెడ్డి బీజేపీ నినాదాన్ని ఎత్తుకున్నారనే అనుమానాలున్నాయన్నారు. చారిత్రక అంశాన్ని ప్రజాపాలనతో ముడిపెట్టి చూడటంలోనే సీఎం రేవంత్‌రెడ్డి కుట్రదాగి ఉన్నదనే విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడాన్ని తెలంగాణ సమాజం జీర్ణించుకోదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భవిష్యత్‌లో బీజేపీలో విలీనం చేసేందుకు సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మలచుకున్నారని విమర్శించారు.

బీఆర్‌ఎస్ జాతీయ సమైక్యతా దినోత్సవం

బీజేపీతో భవిష్యత్ పొత్తులో భాగంగా బీజేపీ ఎజెండాను రేవంత్ సర్కార్ అమలు చేస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను బీజేపీ విమోచన దినంగా, కమ్యూనిస్టులు తెలంగాణ విమోచన దినంగా నిర్వహించాయని ఉదహరించారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని జాతీయ సమైక్యత దినోత్సవంగా పాటించి తెలంగాణలో గంగా జమునా తహెజీబ్ సంస్కృతిని పరిరక్షించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీనదినం వజ్రోత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని 2022లో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ప్రకటించి ప్రస్తుతం విస్మరించారని దుయ్యబట్టారు. విలీనదినం, సమైక్యతా దినోత్సవం వంటి స్థిరపడిపోయిన నినాదాలను, సంప్రదాయాలకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడంలోని దూరదృష్టిని, బీజేపీ ఎత్తుగడను అర్థం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ తల్లికి అపచారం

మొదటిపేజీ తరువాయి...

వేళ సచివాలయం ఎదురుగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు గుట్టుగా ఏర్పాట్లు చేసింది. ఒకవైపు మిలాద్ ఉన్ నబీ, మరోవైపు వినాయక నిమజ్జనం హడావుడిలో ప్రజలుంటే ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించింది. సోమవారం రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు ముహూర్తం ఖరారు చేసింది. విచిత్రం ఏమిటంటే.. విగ్రహావిష్కరణకు ఎలాంటి కారణమూ లేదు. రాజీవ్‌గాంధీ జయంతీ కాదు, వర్ధంతీ కాదు. ఆయనకు సంబంధించిన మరో సందర్భం కూడా ఏదీ లేదు. అయినప్పటికీ పంతానికి పోయి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాల్సిన ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నది. ఇందుకు సంబంధించి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేరుతో ఆహ్వానాలు వెళ్లాయి. విగ్రహావిష్కరణను ఎవడు ఆపుతడో చూస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రజలు పండుగ సంబురాల్లో ఉండగా విగ్రహావిష్కరణకు పూనుకోవడంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఆత్మపై సర్కారు ఆడుతున్న ఆటగానే దీనిని పలువురు అభివర్ణిస్తున్నారు.

మేధో సమాజం లేఖతో వెనక్కి తగ్గిన గాంధీలు

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఎవరి విగ్రహాలు పెట్టినా ఊరుకునేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలోనే తేల్చిచెప్పారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మృతి చిహ్నం పక్కన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని.. ఆ స్మృతి చిహ్నం ప్రారంభోత్సవ సభలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అందుకోసం సచివాలయం ముందున్న సిగ్నల్ పాయింట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చి రోడ్డును వెడల్పు వేసింది. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని సిద్ధం చేసింది. ఆ ప్రతిపాదిత స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగానే తెలంగాణ సమాజం భగ్గుమన్నది. దీంతో వెనక్కి తగ్గిన రేవంత్‌రెడ్డి సచివాలయం బయట కాదు లోపలే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని హడావుడిగా భూమిపూజ చేసి ప్రజాగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారు. మరో వైపు, ప్రొఫెసర్ హరగోపాల్ సహా తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయులు, సాహితీవేత్తలు మొదలుకొని తెలంగాణ మేధో సమాజం రాహుల్‌గాంధీకి లేఖరాసింది. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయకూడదని, ఒకవేళ చేస్తే కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని లేఖలో స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే రాజీవ్‌గాంధీ విగ్రహ వివాదంలోకి తల దూర్చకూడదని భావించిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ చివరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం సోమవారం నాటి కార్యక్రమానికి దూరంగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది.

కాంగ్రెస్ విగ్రహ మథనం

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు విషయంలో వివాదం నెలకొనడంతో గాంధీ కుటుంబం సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానాన్ని తిరస్కరించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. నిజానికి విగ్రహావిష్కరణ విషయంలో రేవంత్‌రెడ్డి అనేకసార్లు వారి వద్ద ప్రస్తావించినా పెద్దగా పట్టించుకోలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే రేవంత్ వారి ఆమోదం ఉందని చెప్పుకునేందుకు తగిన సమయాన్ని ఎంచుకున్నారని చెప్తున్నారు. సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితులు, రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో ఉండటం, వయనాడ్‌లో పోటీచేసేందుకు ప్రియాంకగాంధీ అటువైపు దృష్టిసారించడం, ఇక కర్ణాటకలో నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై మల్లికార్జున్‌ఖర్గే మంతనాల్లో తలమునకలు కావడం వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా మలచుకొని ఇదే సరైన సమయంగా భావించారని పార్టీలో జోరుగా చర్చ సాగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి అటు పార్టీలోను, ఇటు తెలంగాణ సమాజంలో అనుకూల వాతావరణం ఉంటే రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును ఇంత గుట్టుచప్పుడు కాకుండా, ఎటువంటి ప్రచార పటాటోపం లేకుండా ఎందుకు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

నాయిని రాజేందర్‌రెడ్డి ఓ బ్లాక్‌మెయిలర్

- ఆయనకు కేటీఆర్‌ను విమర్శించే స్థాయిలేదు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్. పక్కన వాసుదేవారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒక బ్లాక్‌మెయిలర్ అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. నాయినికి కేటీఆర్‌ను విమర్శించే స్థాయిలేదని, కేటీఆర్‌ను విమర్శించడం అంటే సూర్యుడి మీద ఉమ్మి వేయడమేనని అన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి మెప్పుకోసం మాజీ మంత్రి కేటీఆర్‌పై అనుచితంగా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. నాయిని ప్రజానాయకుడు కాదని, రాజకీయ బ్రోకర్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల సూట్‌కేసుల కోసం బ్లాక్ మెయిల్ చేయడం ఆయనకు అలవాటేనని అన్నారు. ఉద్యమకారులపై అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడు కేటీఆర్‌ను విమర్శించే ముందు మీ నాయకుడు రాహుల్‌గాంధీ ఎక్కడి నుంచి వచ్చాడో చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమంలో యువతకు స్ఫూర్తిగా నిలిచిన కేటీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలితే ప్రజలు మీ నాలుకలను తెగ్గోస్తారు జాగ్రత్త అంటూ వాసుదేవరెడ్డి హెచ్చరించారు.

17 మాడల్ స్కూళ్లలో టీచర్లు సున్నా

- అర్బన్‌లో ఫుల్.. రూరల్‌లో నిల్
- ఇటీవల బదిలీల్లో టీచర్లకు స్థానచలనం
- పట్టణ ప్రాంతాలనే ఎంచుకున్న టీచర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 194 మాడల్ స్కూళ్లు ఉండగా, వీటిలో 17 స్కూళ్లల్లో ఒక్కరంటే ఒక్క టీచర్ కూడా లేరు. దీంతో ఈ స్కూళ్లు జీరో టీచర్లతోనే నడవనున్నాయి. విద్యార్థుల్లేక టీచర్లు లేరని అనుకుంటే పప్పులోకాలేసినట్లే. విద్యార్థులున్నా.. టీచర్లు లేని పరిస్థితి ఈ స్కూళ్లల్లో నెలకొంది. ఆదిలాబాద్ జిల్లాలోని సిరిపూర్ మాడల్ స్కూల్లో ఒక్కరంటే ఒక్క టీచర్‌కూడా లేరు. ఈ స్కూల్లో గతంలో 10 మందికి పైగా టీచర్లు పనిచేసేవారు. కానిప్పుడు ఒక్క టీచర్‌కూడా లేరు. ఇక ఇదే జిల్లాలోని నార్నూరు మాడల్ స్కూల్లో ఇదే పరిస్థితి. ఇటీవలి టీచర్ల బదిలీలతో రాష్ట్రంలోని పలు మాడల్ స్కూళ్లు కుదేలయ్యాయి. పలు స్కూళ్లల్లో టీచర్ల కొరతకు దారితీసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని మాడల్ స్కూళ్లు టీచర్లతో నిండిపోగా, మారుమూల ప్రాంతాల్లోని మాడల్ స్కూళ్లు ఖాళీ అయ్యాయి. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అత్యంత మారుమూల ప్రాంతాలు, రాష్ట్ర సరిహద్దులోని స్కూళ్లు, సంగారెడ్డి జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని టీచర్లంతా బదిలీలకు పట్టణ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అయితే ఇతరులు వీటికి ఎంపికచేసుకోకపోవడంతో ఇప్పుడా స్కూళ్లల్లో టీచర్ల కొరత సమస్యకు దారితీసింది. రాష్ట్రంలో 194 మాడల్ స్కూళ్లున్నాయి. శనివారం టీచర్ల బదిలీలు చేపట్టగా, 1,923 మంది పీజీటీలు, 745 మంది టీజీపీల చొప్పున మొత్తంగా 2,757 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వాస్తవానికి ఒక్కో మాడల్ స్కూల్ కనీసంగా 500 మంది విద్యార్థులుంటారు. ప్రతి స్కూల్లో కనీసంగా 20 మంది టీచర్ల అవసరముంటుంది. తాజా బదిలీలతో ఒక ట్రెండు స్కూళ్లల్లో ఒక్కరంటే ఒక్క టీచర్‌లేకుండా పోయారు. మరికొన్ని మాడల్ స్కూళల్లో ముగ్గురు, నలుగురు టీచర్లే ఉన్నారు.

పరిస్థితి ఇలా..

- ఆసిఫాబాద్‌లోని మాడల్ స్కూల్లో మొత్తం 807 మంది విద్యార్థులున్నారు. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులున్న స్కూల్ ఇదే. గతంలో ఈ స్కూల్లో 17 మంది రెగ్యులర్ టీచర్లు పనిచేసే వారు. తాజా బదిలీలతో ఈ స్కూల్లో కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒకరు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ కాగా, మరొకరు పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్.
- ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మాడల్ స్కూల్లో గతంలో 16 మంది టీచర్లుండేవారు.. కానిప్పుడున్నది కేవలం ముగ్గురంటే ముగ్గురే.
- కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మాడల్ స్కూల్లో ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు.
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో 5, రాయికోడ్‌లో ఆరుగురు టీచర్లు, నాగలిగిద్ద మోర్గిలో కేవలం ముగ్గురు టీచర్లు మాత్రమే ప్రస్తుతమున్నారు.

ఉపాధి కోల్పోయిన హెచ్‌బీటీలు..

మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలతో టీచర్లు సంతోషంలో ఉండగా, ఇదే పాఠశాలల్లో పనిచేస్తున్న అవర్లీ బేస్ట్ టీచర్లు(హెచ్‌బీటీ) ఉపాధి కోల్పోయారు. ఇదివరకు రెగ్యులర్ టీచర్లు లేకపోవడంలో హెచ్‌బీటీలను తీసుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది హెచ్‌బీటీలు పనిచేశారు. తాజా బదిలీల్లో రెగ్యులర్ టీచర్లు రావడంతో హెచ్‌బీటీలను తొలగించాల్సిన పరిస్థితి తలెత్తింది. విద్యాసంవత్సరం మధ్యలో హెచ్‌బీటీలను అర్ధాంతరంగా తొలగించడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో బదిలీలతో డిస్టర్బ్ అయిన హెచ్‌బీటీలను పక్క మండలాలు, అదేజిల్లాల్లో ఖాళీగా ఉన్న స్కూళ్లల్లో అవకాశం కల్పించిన న్యాయం చేయాలని, కుటుంబాలను ఆదుకోవాలని హెచ్‌బీటీల సంఘం అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.

..టీడీపీలోనే ఉన్నారా?

మొదటిపేజీ తరువాయి...

కప్పుతున్న సన్నాసి ఎవరని మండిపడ్డారు. పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆపై పదవులు పోతాయన్న భయంతో నాటకాలు ఎందుకని ప్రశ్నించారు. అతి తెలివితో కోర్టును మోసం చేద్దాం అనుకున్నా ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

చోటాభాయ్.. బడేభాయ్ బండారాన్ని బయటపెట్టాలి

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగలను జైల్లో పెట్టేందుకు ఎవరు అడ్డుపడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే చోటేభాయ్.. బడాభాయ్ బండారాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి బీజేపీ సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేసీఆర్‌ను జైల్లో పెట్టేవాళ్లమన్న బండి వ్యాఖ్యలపై ఆయన ఎక్స్‌వేదికగా స్పందించారు. బడేభాయ్.. చోటేభాయ్ బండారం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఓటు నోటు కేసులో అన్ని అధారాలతో అడ్డంగా దొరికిన దొంగకు బడేభాయ్ ఏవిధంగా సహకరిస్తున్నది ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన చోటేభాయ్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదని నిలదీశారు. ఎవరు ఎవరిని కాపాడుతున్నారో అందరికీ తెలుసని పేర్కొన్నారు.

గురుకులాలపై చిన్నచూపెందుకు?

గురుకులాలపై చిన్నచూపు ఎందుకని కాంగ్రెస్ సర్కారును కేటీఆర్ ప్రశ్నించారు. ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తామని అబద్ధాలు ప్రచారం చేసి సమయానికి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు గడిచేదెలా అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణలేదని, వారి ప్రాణాలకు భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వక వారి కుటుంబాలను రోడ్డున పడేస్తారా? అని ప్రశ్నించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఒక్కరోజూ విద్యా వ్యవస్థపై సమీక్ష లేదని విమర్శించారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తంగలపల్లి గిరిజన గురుకుల పీఈటీనీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ నీతిమాలిన చర్యలను ధైర్యంగా ఎండగట్టిన విద్యార్థులకు తాము అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

డ్రామాల కాంగ్రెస్

డ్రామాల కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరలో మూడుసార్లు పాల ధర పెంచిదని, హిమాచల్ ప్రభుత్వం ఏకంగా గంజాయిని అమ్మడానికి పర్మిషన్ కావాలని అర్జీ పెట్టుకున్నదని, ఇక మన రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అన్నీ అమలు చేస్తామని డ్రామాలు ఆడి చివరికి ఏం చేస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ పాలనలో సాగుకు కౌంట్‌డౌన్

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ రాగానే వ్యవసాయానికి కౌంట్‌డౌన్ షురూ అయిందని కేటీఆర్ విమర్శించారు. పదేండ్లు పచ్చగా ఉన్న తెలంగాణలో వ్యవసాయ చిచ్చుమొదలైందని విమర్శించారు. వ్యవసాయ విప్లవం సాధించిన తెలంగాణలో సాగువిస్తీర్ణం తగ్గడం కౌంట్‌డౌన్‌కు తొలి ప్రమాద హెచ్చరిక అని ఆవేదన వ్యక్తం చేశారు. 'పంటలసాగులో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి అనతికాలంలోనే ఎదిగామని ఆనందపడ్డాం. దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ రైతన్న దేశం కడుపు నింపే ఎత్తుకు ఎదిగాడని గర్వపడ్డాం. ఆర్థికంగా చితికిపోయిన అన్నదాతల బతుకులు వ్యవసాయ విప్లవంతో బాగుపడ్డాయని సంబురపడ్డాం. కానీ, కాంగ్రెస్ రాగానే వ్యవసాయానికి కౌంట్ డౌన్ షురూ అయింది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఫార్మాసిటీ ఉన్నట్టా? లేనట్టా?

- ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వండి
- కొనసాగించకపోతే భూములు రైతులకిచ్చేయాలి
- లేకపోతే బీఆర్ఎస్ పోరాటమే: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం కొనసాగిస్తుందో? లేదో? స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు కోరిన నేపథ్యాన్ని గుర్తుచేస్తూ.. విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎంకు లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మారంగాల్లో హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలిపే ఉద్దేశంతో 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేలా ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌ను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ఫార్మాసూటికల్స్ ఉత్పత్తుల్లో దేశంలోనే తెలంగాణ 40 శాతం వాటా కలిగి ఉన్నదని, వెయ్యికి పైగా లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు అడ్డాగా మారిందని.. ఏటా 80 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను తయారుచేస్తున్నదని వివరించారు. ఇలాంటి కీలకమైన రంగాన్ని మరింత ప్రోత్సహిస్తే రాష్ట్రానికి ఆదాయం పెరగటంతో పాటు మన యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అందించవచ్చన్న భావనతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్టు వెల్లడించారు. దీనికోసం భూ సేకరణ కూడా పూర్తిచేశామని గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయొద్దు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి పెద్దఎత్తున మేలు చేసే ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌పై గందరగోళం నెలకొన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. హఠాత్తుగా ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేస్తున్నట్టు సీఎం ప్రకటించటంతో ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందాయని తెలిపారు. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడుతాయని భూములు ఇచ్చిన రైతుల్లో గందరగోళం నెలకొన్నదని వెల్లడించారు. ప్రాజెక్ట్ కోసం రైతులు ఇచ్చిన భూములను ఇతర అవసరాలకు వాడతామని ప్రభుత్వం చెప్పుండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌ను కొనసాగిస్తే గత ప్లాన్ ప్రకారం గానీ, మరింత విస్తరించేలా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని కోరారు. మొండిపట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని సూచించారు.

రద్దు చేస్తే రైతులకు భూములివ్వాలి

ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తే భూములు ఇచ్చిన రైతులకు వాటిని వెంటనే అప్పగించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇతర అవసరాలకు వాడుతామంటే రైతులతో పాటు బీఆర్ఎస్ సైతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేలా ఉండాలని స్పష్టంచేశారు. ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని భావిస్తే లైఫ్‌సైన్సెస్‌కు రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా మార్చే అవకాశాన్ని కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలు, అనిశ్చితి, తొందరపాటు నిర్ణయాలతో రాష్ట్ర పురోగతి దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా ఉండాలని ఆకాంక్షించారు.



భువనగిరిలో జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీఆర్ఎస్ నేత జిట్టాకు ఘన నివాళి

- సంతాప సభకు హర్యానా గవర్నర్ దత్తాత్రేయ హాజరు
- పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఆయన దశ దినకర్మ, సంతాప సభను భువనగిరి పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సూ ర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సంతా ప సభకు హాజరై బాలకృష్ణారెడ్డి కు టుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాద రి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగ య్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, బూడిద భిక్షమయ్యగౌడ్, నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, గణేశ్‌గుప్తా ఇతర నాయకులు

నాగంకు కేటీఆర్ పరామర్శ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న నాగం జనార్దన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, బాల్క సుమన్, కోరుకంటి చందర్, గణేశ్‌గుప్తా తదితరులు ఉన్నారు.

వైకల్యాన్ని జయించి.. విధుల్లో ఓడి!

- ఇదీ గురుకులాల్లోని దివ్యాంగ టీచర్ల ఆవేదన
- పనివేళల ఫలితంగా తీవ్ర ఇబ్బందులు
- సాధారణ ఉద్యోగుల తరహాలోనే విధులు
- అమలుకాని 2016 దివ్యాంగుల చట్టం
- ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : శారీరక వైకల్యాన్ని జయించి కష్టపడి ఉద్యోగాలను సాధించారు. కానీ గురుకుల టైంటేబుల్ ముందు ఓడి అవస్థలను ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఉద్యోగాలను చేయలేక ఇంటిబాట పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదీ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సాధారణ గురుకులాల్లోని దివ్యాంగ ఉపాధ్యాయులు, ఉద్యోగుల దుస్థితి.

1200 మందికిపైగా ఉద్యోగులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేటగిరీల్లో కలిపి దాదాపు 1022 గురుకులాలు ఉన్నాయి. ఆయా గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్‌తోపాటు ఇతర కేడర్లలో 8300లకు పైగా పోస్టుల భర్తీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన 4శాతం రిజర్వేషన్ ఫలితంగా దాదాపు 760మంది దివ్యాంగులు ఉద్యోగాలను సాధించారు. వీరేకాకుండా గతంలో నియామకమైన వారిని కలిపితే దాదాపు 1200 మందికిపైగా దివ్యాంగులు గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

నైట్‌డ్యూటీలతో అవస్థలు

గురుకులాల్లో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులు పనివేళలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకానొక దశలో విధులు నిర్వహించలేక ఉద్యోగాన్ని వదులుకునే పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. రాష్ట్రంలోని చాలా గురుకులాల్లో సరైన వసతులు లేవు. కొత్తగా రిక్రూట్ అయిన అనేకమంది దివ్యాంగులకు దూరప్రాంతాల్లో అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. వీరంతా పనిచేసే ప్రాంతాల్లో ఉండలేక, నిత్యం రాకపోకలు సాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అదీగాక ఇటీవలనే ప్రభుత్వం కామన్ టైం టేబుల్‌ను నిర్ణయించింది. ఉదయం 8గంటలకే గురుకులాలకు చేరుకుని రాత్రి 9గంటల వరకు ఉండాలి. గురుకులాల పనివేళల్లో గర్భిణులకు మినహాయింపులు ఉన్నాయి. కానీ దివ్యాంగ ఉద్యోగులకు లేవని వాపోతున్నారు. నిర్ణీత పనివేళలను కచ్చితంగా పాటించాల్సిందేనని గురుకుల ప్రిన్సిపాళ్లు ఒత్తిడి తెస్తున్నారని, తమను సాధారణ ఉద్యోగులుగానే పరిగణిస్తున్నారని కన్నీటిపర్యంతమవుతున్నారు.

2016 చట్టం ఏం చెబుతున్నది

దివ్యాంగుల హక్కుల రక్షణ చట్టం 2016 ప్రకారం దివ్యాంగ ఉద్యోగులకు సులభతరంగా విధులను నిర్వర్తించుకునే పరిస్థితులను కల్పించాలని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 20(1) ప్రకారం దివ్యాంగులపై ఎటువంటి వివక్షనూ చూపవద్దని, సంస్థలో విధించిన షరతులు, పనిస్వభావాన్ని బట్టి అందులో దివ్యాంగ ఉద్యోగులు పాల్గొనడాన్ని ఈ సెక్షన్ కింద మినహాయించవచ్చని తెలిపింది. సెక్షన్ 20 (2) ప్రతి ప్రభుత్వ వ్యవస్థ, సంస్థ వైకల్యం గల ఉద్యోగులకు వసతిని, భౌతిక అడ్డంకులులేని సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని నిర్దేశించింది. ఆయా సెక్షన్లను అనుసరించి గురుకుల పనివేళలల్లో తమకు సడలింపులివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పనివేళలు సడలించాలి

దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం దివ్యాంగుల బాధ్యత ఆయా ప్రభుత్వ సంస్థలదే. ప్రభుత్వమే పనిచేసే చోట వసతిని కల్పించి, పనివేళల్లో మినహాయింపులను ఇవ్వాలి. షెడ్యూల్‌కు గంట తరువాత వచ్చేలా, ఒక గంట ముందుగానే వెళ్లేందుకు అనుమతివ్వాలి. బీహెచ్ఈఎల్ వంటి సంస్థలు ఇలాంటి మినహాయింపులను కల్పిస్తున్నాయి. గురుకులాల్లో పనిచేసే దివ్యాంగులందరికీ పనివేళల్లో సడలింపువ్వాలి.

- నర్రా నాగేశ్వర్‌రావు, దివ్యాంగుల సలహాదారుల బోర్డు మెంబర్

ఇంటర్‌లోపే 25 శాతం డ్రాప్

- పది పాసైనోళ్లంతా ఇంటర్‌కు వెళ్లట్లే
- వీరిలో బాలుర సంఖ్యనే అధికం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పదో తరగతి పాసైనోళ్లలో కొందరు అంతటితోనే చదువులకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. ఇంటర్‌లోపే 25శాతం మంది విద్యార్థులు చదువులకు స్వస్తి పలుకుతున్నట్టు విద్యాశాఖ తేల్చింది. రాష్ట్రంలో ఏటా 5 లక్షల మంది పదో తరగతి పాసవుతున్నారు. వీరిలో 25 శాతం అంటే దాదాపు లక్షకు పైగా ఇంటర్‌తోనే ఆపేస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రాష్ట్రంలో 3,287 జూనియర్ కాలేజీలు..

ప్రభుత్వ, ప్రైవేట్ కలిపితే 3,287 జూనియర్ కాలేజీలున్నాయి. వీటిలో ప్రైవేట్ కాలేజీలు 1,482 కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, గురుకులాలు, కేజీబీవీలు, మాడ ల్ స్కూళ్లు కలిపి 1,805 కాలేజీలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. ఇటీవల 25 వరకు కొత్త కాలేజీలు మంజూరయ్యాయి. వీటిలో గత బీఆర్ఎస్ సర్కారు అప్‌గ్రేడ్ చేసినవి, మంజూరుచేసిన గురుకులాలు, కాలేజీలే అధికంగా ఉన్నాయి. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 9, 10 తరగతుల్లో 94 శాతంగా ఉండగా, ఇంటర్‌కు వచ్చేసరికి 76% ఉంది.

జీవో 33 రద్దు చేయాల్సిందే

- మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి బీఆర్ఎస్వీ పిలుపు
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- జీవో 33 రద్దు చేయాలని నినాదాలు
- మెడికల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి
- మంత్రి దామోదర రాజీనామా చేయాలి: బీఆర్ఎస్వీ



మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడిలో పాల్గొన్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వైద్య విద్యలో స్థానికతను నిర్ణయించడానికి తీసుకొచ్చిన జీవో 33ని ఉపసంహరించి, వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించాలన్న డిమాండ్‌తో బీఆర్ఎస్వీ (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) ఆదివారం చేపట్టిన మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో తొలుత తెలంగాణ భవన్ నుంచి మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. మంత్రుల నివాస ప్రాంగణానికి వెళ్లకుండా బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్వీ నేతలు మంత్రుల నివాస సముదాయం లోపలికి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించారు. ప్రభుత్వానికి, సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. మరికొందరు బీఆర్ఎస్వీ నేతలు బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణం ఎదుట బైఠాయించారు. ప్రధాన గేటు ఎక్కి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నివాస ప్రాంగణంలోకి లోపలికి వెళ్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 33 జీవోను వెంటనే రద్దు చేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ప్రభుత్వ ఉదాసీనతతో విద్యార్థులకు నష్టం

రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత వల్ల కొన్ని ప్రైవేటు కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా రావడంతో 50% కన్వీనర్ కోట సీట్లను రాష్ట్ర విద్యార్థులు నష్టపోతున్నారని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను వైద్య విద్యకు దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ కుట్రలో భాగంగానే రాష్ట్రప్రభుత్వం జీవో 33 కొనసాగించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిందని ఆరోపించారు. తెలంగాణలో పుట్టిన వారు ఇతర రాష్ట్రాల్లో చదివితే స్థానికత వర్తించకుండా జీవో నం. 33 ద్వారా కన్వీనర్ కోట సీటు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీని ద్వారా ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు లబ్ధి చేకూర్చే కుట్ర దాగి ఉన్నదని ధ్వజమెత్తారు. వెంటనే వైద్యవిద్య కౌన్సిలింగ్ నిర్వహించాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థులకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీ నినాదాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిజం చేస్తే.. కాంగ్రెస్ సర్కారు దానిని దారుణంగా నీరుగారుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, కడారి స్వామియాదవ్, పడాల సతీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, వెంకటేశ్‌గౌడ్, గోపగాని రఘురాం, రమణ్, షఫీ, జంగయ్య, ప్రశాంత్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గంటలో మద్య నిషేధాన్ని రద్దు చేస్తా

- ప్రశాంత్ కిశోర్ ఎన్నికల హామీ

పాట్నా, సెప్టెంబర్ 15: బీహార్‌లో అధికారంలోకి వస్తే వెంటనే మద్య నిషేధాన్ని రద్దు చేస్తానని జన్ సురాజ్ అధినేత ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ఆదివారం ఆయన ఎఎన్ఐ వార్త సంస్థతో మాట్లాడుతూ 'అక్టోబర్ 2 కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యే అవసరం లేదు. మా ప్రభుత్వం ఏర్పడితే గంటలో మద్య నిషేధాన్ని రద్దు చేస్తాం' అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న మద్య నిషేధం అత్యంత నకిలీదని తెలిపారు.

ఇప్పుడే ఎస్సైని దించొస్తా!

బైక్‌తో ఉడాయించిన నకిలీ పోలీసు

- పోలీస్ యూనిఫాంతో మోసం
- కరీంనగర్‌లోని శాస్త్రీరోడ్‌లో ఘటన

కరీంనగర్ రాంనగర్, సెప్టెంబర్ 15: కానిస్టేబుల్ తరహా దుస్తులు ధరించిన ఓ వ్యక్తి రోడ్డుపై విధులు నిర్వర్తిస్తున్నట్టు నటించాడు. అటుగా బైక్‌పై వచ్చిన ఓ యువకుడిని ఆపి ఎస్సైని దించొస్తానని బైక్‌తో సహ ఉడాయించాడు. ఈ ఘటన ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాస్త్రీరోడ్‌లో జరిగింది. నగరంలోని ఫతేపురాకు చెందిన బొజ్జ శివం తన బుల్లెట్ వాహనంపై శాస్త్రీరోడ్డుపై వస్తుండగా.. అక్కడే కానిస్టేబుల్ తరహా దుస్తుల్లో విధి నిర్వహణలో ఉన్నట్టుగా నటించిన వ్యక్తి తనను ఆపాడు. సమీపంలో తమ ట్రాఫిక్ ఎస్సై విధులు నిర్వర్తిస్తున్నారని, ఆయనను దించొస్తానని, బైక్ ఇవ్వాలని అడిగాడు. పోలీస్ యూనిఫాంలో ఉండటంతో ఆ వ్యక్తిని నమ్మిన శివం తన బుల్లెట్ వాహనాన్ని ఇచ్చాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి హుటాహుటిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు చెప్పాడు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు తమ కానిస్టేబుల్ ఎవరూ అక్కడ విధినిర్వహణలో లేరని చెప్పడంతో వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ యూనిఫాంలో వచ్చిన వ్యక్తి తన బైక్ ఎత్తుకెళ్లాడని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ సరిలాల్ తెలిపారు.

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలిసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



మడేలమ్మ

సూర్యుడు కాలాన్ని మోస్తున్నట్టు
క్రీస్తు శిలువను భరించినట్టు
వీపుల మీద బట్టల మూట
చాకిరేవుకే ఊళ్లకి రాసిచ్చిన రాగిశాసనం బాట
వానొచ్చినా రాకపోయినా వెలుగొచ్చినా కరువొచ్చినా
చెరువు బండమీదనే బతుకికింకిపాయే!

నిలబడిన నీళ్లల్ల సవికిన కాళ్లు బర్రె జెనిగల తూట్లు
ఉస్సో ఉస్సో హైలెస్సా వరుసలు
బండలపై బతుకు దర్పులు
దరువు దరువుకు పత్తిపూల తెలుపులు
ఆరేసిన బట్టల మీద సింగిడి పిట్టల ముచ్చట్లు
ఇంట్ల ఆకలి మంటలు వీధిలో ఎగతాళి సామెతల పోటులు
ఒక్కరోజు సుస్తయినా
సాకల్ది ఇంటికే రాకపాయని ఈరంగమేసే పెత్తందారులు
మిరాశీ ఇచ్చేకాడ మాత్రం నెత్తులు గోకుతరు
చెరువెండినా
చెలిమె అలిగినా కాలువ వొట్టిపోయినా
చెరువు మీద చాకిరేవాగలే
చావు వార్తలకు పెళ్లి పిలుపులకు
ఊరూరూ ఉత్తరమై తిరిగి ఎద్దుగిట్టల్లా అరిగిన కాళ్ళు
చాకిరేవు పిలుపు మేలుకొలుపు

పిల్లోడు బడికోయినట్టు
దినం తప్పకుండా ఇంటింటి మైలగుడ్డలు
మూడురాళ్ల మీద గూనెపెంకులా పొయ్యి
అరచేతిలో పులిమి పులిమి రేవు ఒడ్డున చెక్కరొచ్చే
పలక బలపం పట్టకున్నా
పిండేసిన బట్ట లెక్కలు మరువని పంతులమ్మ
సద్ది బువ్వేసినా బెల్లం గారెనేసినా ముక్కిరుసకుండా
ఊరి ఆరోగ్యమే మహాభాగ్యమని భూదేవిలా మురిసి నడిచే

చంద్రవంకలా దివిటీ కోలెత్తి పెళ్లంత తానై ముందు నడిచే
అవిరేను ముందు అమ్మమ్మలా మిత్తి తీసి దీవించే
చావుకర్మలల్ల రుడం తీసి అందరికన్న ముందే నీళ్లల్ల మునిగే
ఇల్లంత సున్నమేసి ఇండ్ల సంధ్య వాకలి ఊడ్చి
ఎంగిలి ఆకులు తీసి ఇంటికోతమ్మా! అన్నప్పుడు
పాత చీర చేతుల పెట్టి పాడుబుద్ధిని పోనిచ్చుకోరు

పురుట్ల నెత్తరంతెత్తి పురుడు పోసే
సమర్తయితే శుభ్రం చేసి మూలన బట్టపరిసి
ముట్టు గుడ్డలు పీతి బట్టలు కాన్పుబట్టలు చావు గుడ్డలు
ఇంటి వెట్టి ఊరువెట్టి ఈత పొరుకై ఊడ్చే
సబ్బులు సర్ఫులు డిటర్జంట్లు లేని కాలంలో
సొడును సబ్బుగా కనిపెట్టిన శాస్త్రజ్ఞులు
సచ్చేదాక సేవలై తనువు బాణమైనా ఏ గౌరవాన్ని నోచుకోలే

చావిడికైనా దేవళానికైనా
కోట మైసమ్మ పండుగైనా పోశమ్మకు బోనాలైనా
గోడల బూజు దులిపి నిండు పున్నమై పూసే కుంచెలు
దేవుడి ముందు నైవేద్యమైనా దేవర ముందు యాటకోసినా
ఎర్రకూడు పచ్చకూడు తెల్లకూడు దిష్టితీసే పెద్దమ్మ
గండదీపానికి మట్టంటకుండా అరచేతులను కోకలుగా పరిచే
సంప్రదాయాలను మూలసుక్కలా నిలబెట్టినా తల్లి

పనంతా తనదే బరువంతా ఆమెదే ఊరి మురికంతా
తుడ్చి చాకిరంతా మోసింది
రేవు నుంచి బట్టల మూటతో వాకిట్లో చంద్రకాంతిల
ప్రతి ఇంటికి కోపం లేని ఆడబిడ్డయి సేవలు చేసే
మల్లె చెట్టు లాంటి మంచి మనిషి
సాకలమ్మ లేని ఊరు బండి యాట తాడు తెగినట్టే
తెలుపు లేని నలుపు, మామిడి తోరణం లేని పెండ్లే!



వనపట్ల సుబ్బయ్య
94927 65358

కవితలకు ఆహ్వానం

సురవరం ప్రతాపరెడ్డి మూర్తిమత్వంపై కవితలను ఆహ్వానిస్తున్నాం. vanapatlasubbaiah1972@gmail.com కు లేదా 9492765358 వాట్సాప్‌కు కవితలు పంపవలసిన ఆఖరి తేదీ 2024, అక్టోబర్ 30. ఉత్తమ కవితలను 2024, నవంబర్‌లో సంకలనంగా తీసుకురానున్నాం.

పురస్కారాల ప్రదానం

2024, సెప్టెంబర్ 22న మహబూబ్‌నగర్‌లోని భారత్ స్కౌట్స్ భవనంలో పలు పురస్కారాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు 'కాళోజీ' పురస్కారాన్ని అందుకోనుండగా 'యశోదారెడ్డి' పురస్కారాన్ని ప్రముఖ కవయిత్రి వీణారెడ్డి స్వీకరించనున్నారు. వీరితో పాటు బోధనారంగంలో విశిష్ఠ కృషిచేస్తున్న ఉపాధ్యాయులు 'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు' అందుకోనున్నారు. ముఖ్య అతిథులుగా ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి, మద్ది అనంత్‌రెడ్డి, డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి, లక్ష్మణ్‌గౌడ్, పాకాల లక్ష్మిరెడ్డి, రావూరి వనజ, జి.శాంతారెడ్డి హాజరుకానున్నారు.

- తెలంగాణ మహిళా సాహిత్య సంస్థ, మహబూబ్‌నగర్

సాహిత్య పురస్కారం

2024, సెప్టెంబర్ 21 సాయంత్రం హైదరాబాద్, బాగ్ లింగంపల్లి, సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో ప్రముఖ కథా రచయిత, నాటక ప్రయోక్త, పరిశోధకుడు నంది అవార్డు గ్రహీత 'తాటికొండాల నరసింహారావు-భ్రమరాంబ' సాహిత్య పురస్కారాల సభ జరుగనున్నది. 2023కు గాను డాక్టర్ ఎన్.గోపి, 2024కు గాను ప్రసేన్‌లు పురస్కారాలను స్వీకరించున్నారు. తాటికొండాల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, గౌరీశంకర్, సీతారాం, యాకూబ్, ఆనందాచారి, ఎస్.రఘు ప్రసంగించనున్నారు.

- వంశీకృష్ణ, 95734 27422



మన తెలుగు గొప్పతనం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల మంది ప్రజలు మాట్లాడే భాష 'తెలుగు'. మన దేశంలో హిందీతర్వాత ఎక్కువగా మాట్లాడే రెండవ భాష కూడా మన తెలుగే. ఈ మధ్య బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ లిపి సదస్సులో కొరియా భాష తర్వాత రెండవ అంతర్జాతీయ లిపిగా తెలుగునే సమర్థించారు. అంత చక్కని అజంత భాష మనది. అమర భావాల అమృత భాష మన తెలుగు నుడి.

ఇక తెలుగు నుడి చరిత్ర గురించి చెప్పుకొంటే.. ఇది క్రీస్తుకు ముందు దాదాపు 3000 ఏండ్ల కిందటనే తొలి అడుగులు వేసిన ద్రవిడ భాష అని చెప్పవచ్చు. అంటే, ఆదిమ ద్రవిడ భాషల చరిత్ర క్రీస్తుపూర్వమే కొన్ని శతాబ్దాల ముందున్నది.

ప్రపంచంలో అన్ని భాషల కన్నా పాత భాషగా పాత సుమేర్ భాషను ఎక్కువ మంది అంగీకరించారు. తర్వాత పాత ఈజిప్ట్, హిబ్రూ, గ్రీకు, పాత చైనా, కొరియా భాషలు పాతవిగా గుర్తించారు. మన తెలుగు ద్రవిడ భాషా కుటుంబానికి చెందినది. సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినవి. అంటే, ఇండో యూరప్ కుటుంబానికి చెందినవి. మరి మన ద్రవిడ భాషలైన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, తులు, కొడగు, కుడుక్, గోండి, గదబ మొదలైనవి ద్రవిడ భాష కుటుంబానికి చెందినవి. ఇక కొందరున్నట్టుగా జనని సంస్కృతంబు సకల భాషలకు అన్న మాట తప్పని ఎందరో సాహితీవేత్తల వాదన. నిజమే. తెలుగు, తదితర ద్రవిడ భాషలకు, సంస్కృతానికి సంబంధమే లేదంటారు. ఇక ఇతర భాషలు చూస్తే హిందీ సంస్కృతం, ప్రాకృతం, ఉర్దూ, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, గుజరాతీ, ఒరియా, మరాఠీ, కశ్మీరీ, కొంకణి, నేపాలీ, ఈ భాషలన్నీ ఇండో ఆర్యన్ భాష కుటుంబానికి చెందినవి.

ద్రవిడ భాషల్లో మొదటగా విడివడిన భాష తెలుగు. ఆ తర్వాత తమిళం, కన్నడం, మలయాళం విడిపోయాయి. ప్రపంచంలో దాదాపు 6000 భాషలున్నాయి. వాటిలో సొంత లిపి కలిగి ఉన్న భాషలు దాదాపు 400 లోపు. భారతీయ భాషా కుటుంబాల్లో ముఖ్యమైనవి రెండు భాషా కుటుంబాలు. ఒకటి, ఇండో ఆర్యన్ భాషా కుటుంబం. రెండవది, ద్రవిడ భాషా కుటుంబం. ఇండో ఆర్యన్ భాషలకు చెందినవి ఉత్తర భారతీయ భాషలు. వాటిని ఉత్తర భారతీయ ఆర్య భాషలని కూడా అంటారు. ద్రవిడ కుటుంబానికి చెందిన భాషలు దక్షిణ భారతీయ భాషలు... వీటిని ద్రవిడ భాషలంటారు.

ప్రపంచంలో ఉన్న భాషల్లో ఎక్కువ ధాతువులు (roots of verbs) ఉన్న భాష మన తెలుగే. క్రియా ధాతువులు తమిళంలో 450, హిందీలో 350, సంస్కృతంలో 1400 ఉంటాయి. మరి, మన భాషలో ఎన్నో తెలుసా? తెలుగు భాషలో 1800 ధాతువులున్నాయి. అంత గొప్ప భాష మనది. ధాతుక్రియలు అంటే.. 'కోయు, మూయు, వ్రాయు, వచ్చు, పోవు, కూరు, వండు, నేయు, తెచ్చు, ఇచ్చు'.. ఇలా.. ఉదాహరణకు 'చేయు' అనే మూల క్రియనే తీసుకుంటే ఆ మూల ధాతువు నుంచి ఎన్నో పదాలను పుట్టించవచ్చు. అవి.. 'చేత, చేనేత, చేయగల, చేసి, చేసిన, చేయుచున్న, ... ఇలా వేల పదాలు పుట్టించుకోవచ్చు. ఈ సౌలభ్యం ఇతర భాషా నుడులలో ఇంతగా లేదు. మన తెలుగు అజంత భాష కాబట్టి, ప్రతి పదం చివర అచ్చు ఉచ్చారణతో మాట అంతమవుతుంది.

ఉదాహరణకు... 'అందరూ..' దీనిలో చివరి అక్షరం 'ర్+ ఊ....'. ఇలాగే అన్ని మాటల చివర అచ్చు ఉచ్చారణతో ఉంటుంది. ఇలాంటి ఉచ్చారణ లాటిన్ ఇటాలియన్ భాషకు కూడా ఉన్నది. అందుకే, ఈ భాష కూడా అజంత భాష కాబట్టి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నారు.

తెలుగు వినడానికి, అనడానికి అందమైన ఒంపు సొంపుల భాష . తేట తేనెల భాష. సంగీతానికి అనువైన భాష. అమృత నుడుల పాలధారలో పంచదార కలిసిన భాష. మన అమ్మ నుడి తెలుగు నుడి. మన భాషలో ఏది పలుకుతామో అదే రాస్తాం. కానీ, కొన్ని భాషల్లో అలా ఉండదు. మచ్చుకు ఇంగ్లీష్ తీసుకున్నట్టయితే 'కామ్ (calm)' ఇక్కడ Lను పలకం, అలాగే put పుట్ అయితే but , బుట్ కావాలి, కానీ బట్ అని పలుకుతారు. తెలుగులో అలా కాదు. ఎన్ని వ్రాలు పలుకుతామో, అన్ని అక్షరాలే చాలు. మచ్చుకు అమ్మ అనే మాట ఉంటే.. అ+మ్మ... రెండు అక్షరాలు. అదే ఇంగ్లీషులో మదర్ అంటే మ+ద+ర్=3 వ్రాలు. కానీ ఇంగ్లీష్‌లో mo,the,r ఆరు అక్షరాలు కావాలి. చూశారా మన తెలుగు గొప్పదనం. అందులో ఉన్న సౌందర్యం, సౌలభ్యం. కనుక భాషాపరంగా భారతదేశంలో అన్ని భాషల కన్నా మన తెలుగే గొప్ప. కాబట్టే, కన్నడ ప్రభువైన శ్రీకృష్ణదేవరాయల వారు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నారు. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. ఇతర భాషల వారు మన భాషను గొప్పగా కీర్తిస్తుంటే, మనం మాత్రం తెలుగు వారమై ఉండి, డాలర్ల వ్యామోహంలో పడి పరభాష, పరుల సంస్కృతిలో కూరుకుపోతున్నాం. కన్న తల్లిని 'అమ్మా' అని పిలవడానికి సిగ్గుపడుతున్నాం. అమ్మను 'మమ్మీ' చేసి ఆనందిస్తున్నాం. ఇందుకు నవ్వుకోవాలో, ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి.

మన ప్రజల కట్టూ బొట్టు ఎలా ఉండేది? ఆంగ్లేయులు ప్రవేశించి వారి భాషను, వారి సంస్కృతిని మనపై రుద్దారు. దీంతో మనకు తెలియకుండానే వాళ్ల సంస్కృతీ సంప్రదాయాలు మన జీవితంలోకి వచ్చి చేరాయి. అంటే ఒక భాష నశిస్తే, ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతి కూడా నాశనమవుతుంది. అందుకే.. 'ఒక జాతి సంస్కృతిని నాశనం చేయాలంటే, మొదటగా వారి మాతృభాషను నాశనం చేస్తే చాలు' అని 'మెకాలే' అన్నారు.

ఇకనైనా మనం ఇతర భాషల్లోని మాటలకు తెలుగులో అందరికీ అర్థమయ్యే మన జనవాడుక అచ్చ తెలుగు మాటలను పొందిక చేసుకుందాం. అలా చేయరు, ఎందుకంటే వాళ్లకు తెలుగంటే దేశ్యమని, గ్రామ్యమని, హీన భాషని, లేకి భాషగా భావిస్తారు. అందుకే, అనువాదాలన్నీ సంస్కృత మిళితాంధ్ర భాషనే వాడారు. అందుకే, మేధావులంతా, గత మహానుభావులంతా తెలుగును చిన్నచూపు చూసి, వేల్పునుడికి పెద్దపీట వేశారు. ఇలా నేననడం చాలా మంది సంస్కృతవాదులకు నాపై చాలా కోపం వస్తుందేమో.. అయినా, నిజాన్ని నిక్కచ్చిగా చెప్పుకోక తప్పదు.

సంస్కృతం మనపై రుద్దడం వల్ల మన తెలుగుకు ఈ సంకర గతి పట్టింది. ఇది అందరూ మనస్ఫూర్తిగా అంగీకరించవలసిన నగ్న సత్యం. ఇది మన తెలుగుకున్న పెద్ద ఇబ్బంది. ఇది మనం గ్రహించకపోవడమే మనం చేసే పెద్ద తప్పు.

దేవుని గుడిలో ప్రార్థనలు తమిళంలో, సంస్కృతంలోనూ ఉంటాయి. కానీ తెలుగులో ఉండవు. దేవుళ్లకు తమిళం, సంస్కృతం భాషలు అర్థమైనప్పుడు తెలుగు ఎందుకు అర్థం కాదు? మనం తెలుగులో ప్రార్థనలు ఎందుకు చేయకూడదు? ఇలా చెప్పుకొంటూ పోతే అనేక శ్లోకాలు, ప్రార్థన గీతాలు, మేలుకొలుపులు, సుప్రభాతాలు అన్నీ అర్థం కాని సంస్కృతంలోనే ఉంటాయి. వాటిని ఎందుకు అచ్చ తెలుగులోకి అనువదించకూడదు? అందరికీ అర్థమయ్యే రీతిలో చేయవచ్చు కదా? ఒకసారి ఈ దిశగా ఎందుకు ఆలోచించకూడదు?

అచ్చమైన తెలుగు కోసం ఎందరో మహానుభావులు కృషిచేశారు, వారిలో ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి, గురజాడ, వీరేశలింగం పంతులు, ఆదిభట్ల నారాయణదాసు, చిలుకూరి నారాయణరావు, నారు నాగనార్యులు, శ్రీపాద కృష్ణమూర్తి, మారేపల్లి రామచంద్ర కవి, కాళోజీ.. ఇలా ఎందరో మహానుభావుల గురించి చెప్పుకోవచ్చు. కాబట్టి ఇకపై తెలుగు అభిమానులందరూ తెలుగులోనే మాట్లాడుదాం, తెలుగులోనే ఆలోచించుదాం. తెలుగు నుడికై పోరాడుదాం. తెలుగు వాడుక భాషను కాపాడుకుందాం.



రాఘవ మాస్టారు కేదారి
63629 73252



పోరు తెలంగాణ వీర కవి 'మేర మల్లేశం'

సెప్టెంబర్ 17 సందర్భంగా..

సిద్ధాంత నిబద్ధత, నిలువెల్ల నిజాయితీ, బతుకంతా త్యాగనిరతి, పేదరికానికి ఎదురీత.. ఈ లక్షణాలన్నీ ఒకే వ్యక్తిలో పోటెత్తాయంటే ఆ జీవితం ఎంత కల్లోలమవుతుందో ఊహించవచ్చు. ఈ ఆటుపోట్లను ఎదుర్కొంటూ సమసమాజం కోసం కమ్యూనిస్టు కార్యకర్తగా, ప్రజాకవి గాయకుడిగా బతుకుబండి లాగినవాడు మేర మల్లేశం. తన కార్యక్షేత్రం కరీంనగర్ దగ్గరి హుస్నాబాద్ ప్రాంతానికే పరిమితమైనందు వల్ల మల్లేశం పోరాట జీవితం, పాటలు బయటి ప్రాంతానికి తెలిసిరాలేదు. ఆచరణలో సిద్ధాంత పొంతన కోల్పోతున్న కమ్యూనిస్టులతో ఆయనకు ఏర్పడిన వివాదాల వల్ల కూడా మల్లేశం ఘనత ఎవరికీ పట్టనిదైంది. హుస్నాబాద్ ప్రాంతంలో తొలి కమ్యూనిస్టుగా దొరతనాన్ని ఎదిరించిన చరిత్ర ఆయనది. ఆ ప్రాంతం నుంచి వచ్చిన సీపీఐ నేతలందరూ ఆయన వెనుక నడిచినవారే. ఆయన పాటలకు గొంతు కలిపినవారే. నెహ్రూ పాలనకు వంతపాడుతూ, ఆశయాన్ని వదిలేసిన కమ్యూనిస్టుల తీరు నచ్చక మల్లేశం పార్టీకి దూరమవుతూ ఒంటరిగానే పీడిత జనానికి బాసటగా నిలుస్తూ తన బతుకును సాగించాడు.

'మేర మల్లేశం' జీవితకాలం 1924-1997. హుస్నాబాద్ దగ్గరి అక్కన్నపేట ఆయన స్వగ్రామం. ఊర్లో బట్టలు కుడుతూ బతుకుతున్న తన తండ్రి భూస్వామితో తలెత్తిన గొడవ వల్ల ప్రాణ భయంతో ఊరు వదిలి, మహారాష్ట్రకు వెళ్తే, మల్లేశం హైదరాబాద్‌కు వచ్చాడు. ఒక టైలరింగ్ కంపెనీలో పనికి కుదిరిన ఆయనకు ఆర్యసమాజ్, భారత కమ్యూనిస్టు పార్టీ పరిచయమయ్యాయి. కమ్యూనిస్టు సిద్ధాంతానికి, పోరాటాలకు ఆకర్షితుడై పార్టీలో చేరిన మల్లేశం నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో భాగమయ్యాడు. పోరాట పాటలు తోడయ్యాయి. నిజాం పాలనపై వ్యతిరేకంగా పాటలు ఆశువుగా పాడేవాడు. హుస్నాబాద్ ప్రాంతంలో ఉద్యమ వ్యాప్తి కోసం తన వెరపులేని ప్రసంగాలతో, ఆకట్టుకొనే పాటలతో జనాన్ని ఏకం చేశాడు. పార్టీ అండతో దొరతనపు దౌర్జన్యాన్ని తన పాటలతో ఎండగట్టాడు.

పార్టీ కార్యక్రమాల్లో భాగంగా 1947, సెప్టెంబర్‌లో ఊర్లలో జాతీయ జెండాలను ఎగురవేయడం, ప్రజల వద్ద ఉన్న తుపాకులను పార్టీకి అందజేయడం లాంటివి జరిగాయి. వెల్దండ ప్రాంతంలో ఈ పనుల్లో ఉన్న మేర మల్లేశంను స్థానిక గ్రామాధికారులు నిజాం పోలీసులకు పట్టించారు. అలా డిసెంబర్, 1947 నుంచి జనవరి 1951 దాకా మల్లేశం జైలు జీవితం గడిపారు. ఆనాటి జైళ్లలో పోలీసులు కమ్యూనిస్టులను ఎంత హీనంగా చూసేవారో, ఎలా హింసించేవారో మల్లేశం స్వీయ చరిత్రలో అనుభవపూర్వకంగా ఉన్నది. 'రజాకార్లు మమ్ముల్ని పెట్టని హింస లేదు. కొట్టుడు, తన్నుడు, తుపాకులతో గుద్దుడు, మీసాలను పట్టుకార్లతో పీకుడు, ముఖం మీద కాండ్రించి ఊంచుడు, నీళ్లడిగితే నోట్లే ఉచ్చ పోసుడు' చేసేవారని రాసుకున్నారు. ఈ కాలంలో మల్లేశం జనగామ, హైదరాబాద్, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపాడు.

జైలు నుంచి విడుదలయ్యాక ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఊరూరా తిరిగి ప్రసంగాలు, పాటలతో ప్రచారం చేశారు. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని పార్టీ పొగుడుతున్న తీరును నిరసిస్తూ జాప లక్ష్మారెడ్డితో కలిసి విమర్శ పెట్టారు. నాయకుల సమాధానంతో సంతృప్తి చెందక బయటికి వచ్చాడు. అప్పటినుంచి ఏ పార్టీలో చేరలేదు. తనదైన రీతిలో కాలక్రమంగా వచ్చిన అన్ని ఉద్యమాల్లో తన వంతు పాత్ర పోషించాడు. భార్య అరుణ కూడా ఆయన భావజాలాన్ని అనుసరించేదే. పూర్తి అనుకూలవతి. కుటుంబ పోషణ భారమంతా అరుణనే చూసేది. వారికి 8 మంది పిల్లలు. ఖర్చులకు డబ్బు సరిపోక పిల్లలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇల్లు గడవడమే కష్టమై, ఎవరి చదువులు సరిగా సాగలేదు. సంపాదన కోసం మల్లేశం వ్యవసాయం, వ్యాపారం చేసినా నష్టమే మిగిలింది. తనలోని నిజాయితీ, నిబద్ధతలను వదులుకోలేక మల్లేశం ఈ కష్టాలను అనుభవించాడు.

1970లో స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్‌కై మిత్రుల ఒత్తిడితో దరఖాస్తు చేసుకున్నాడు. రైలు చార్జీలు లేక ఢిల్లీకి వెళ్లలేదు. తామ్రపత్రం కలెక్టర్ ఆఫీసుకు వచ్చింది. నెల నెలా రూ.200 వచ్చేవి. ఆ సొమ్ము కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది. తొలి తెలంగాణ రాష్ట్రోద్యమానికి కమ్యూనిస్టులు మద్దతు ఇవ్వకున్నా తాను మాత్రం తెలంగాణ వైపు నిలిచాడు. 1980 తర్వాత విప్లవ రాజకీయాల వైపు మొగ్గడంతో మళ్లీ పోలీసులతో చిక్కులు తప్పలేదు. 1996లో ప్రముఖ రచయిత మలయశ్రీ సారథ్యంలో మల్లేశం దంపతులకు సత్కారం జరిగింది. గుండెలోని రెండు కవాటాలు దెబ్బ తినడంతో మల్లేశం 1997, ఆగస్టు 19న కన్నుమూశాడు. ఆయన అంతిమయాత్రకు తెలిసిన ఊర్లన్నీ కదిలివచ్చాయి. అంతకపేటలో సీపీఐ ఆయన స్మారకస్థూపం ఏర్పాటు నిర్మించింది.

ఇంతకాలం విస్మృతికి గురైన ఆయన పోరు చరిత, పాటల ఘనత ఇటీవల వెలువడ్డ 'మేర మల్లేశం-స్వీయ చరిత్ర-పోరాట పాటలు' అనే పుస్తకంతో వెలుగు చూశాయి. సుమారు నలభై ఏండ్ల కిందట కవి అన్నవరం దేవేందర్ స్వయంగా మల్లేశంను కలిసి మాట్లాడి, చర్చించి, సేకరించిన సమాచారానికి పుస్తక రూపమిది.

1997లో దేవేందర్ సంపాదకత్వంలో 'మేర మల్లేశం - పోరాట పాటలు' అనే చిన్న పుస్తకం వచ్చింది. అందులో మల్లేశం రాసిన వాటిలో లభ్యమైన 31 పాటలున్నాయి. అందులో చాలామట్టుకు స్థానిక దొరల ఆగడాలను ఎదిరిస్తూ రాసినవే. ప్రస్తుత పుస్తకానికి కె.ముత్యం సంపాదకుడు. పరిశోధకుడిగా అన్నవరం అందించిన సమాచారంతో తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లేశం పాత్రను ముత్యం ఎంతో క్రమబద్ధంగా వివరించారు. ఈ పుస్తకంలో స్వయంగా మల్లేశం రాసుకొని అన్నవరం దేవేందర్‌కు ఇచ్చిన 15 పేజీల స్వీయ చరిత్ర ఉన్నది. సుమారు యాభై ఏళ్ల మల్లేశం ప్రజా జీవితంపై కె.ముత్యం రాసిన విపుల వ్యాఖ్యానం ఉన్నది. అనుబంధంగా 'మేర మల్లేశం పోరాట పాటలు' ఉంది. తెలంగాణ మేరు సంఘం తరపున కొత్తకోట కరుణాకర్‌రావు దీనికి ప్రచురణకర్తగా ఉన్నారు. ఇలా వీరి కృషిఫలితంగా ఒక విస్మృత తెలంగాణ పోరు బిడ్డకు చరిత్రలో చోటు లభిస్తున్నది.




బి.నర్సన్
94401 28169

ఆధునిక కాలంలో వెలువడుతున్న మెజారిటీ సాహిత్యం పాఠకుల్లో ఎలాంటి నొప్పిని కలిగించడం లేదు. ఈ సాహిత్యం ఉద్యమాలను, ఉద్యమకారులను ప్రభావితం చేయలేకపోతున్నది. వితంతు వ్యవస్థ సంస్కరణోద్యమం ఇందుకు మినహాయింపు కాదు. అందుకే వితంతువుల పట్ల సంవేదన, సంయోజన, సానుభూతి, సంఘీభావం కొరవడుతున్నది. ఈ విషయాలు చరిత్రలో, వర్తమానంలో ఎట్లా రికార్డయ్యాయి? సమాజంలో, సాహిత్యంలో దాని ప్రతిఫలనాలు ఎట్లా ఉన్నాయి? అని విశ్లేషించి వివరించే గ్రంథమే 'భారతదేశంలో వితంతు వ్యవస్థ'. అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకులుగా వెలువడిన ఈ గ్రంథంలో సామాజిక, సాహిత్య వ్యాసాలు, వ్యక్తిత్వాలు, కథనాలు వెలువడ్డాయి.

ఇప్పుడు; బహుజన స్త్రీల సమస్య

'తెలుగు సాహిత్యంలో వితంతు పునర్వివాహాలు మహిళా ఉద్యమాలు ఒక సమీక్ష' పేరిట డాక్టర్ విజయచంద్ర తెన్నేటి రాసిన వ్యాసంలో పుష్కరాల సమయంలో వితంతు స్త్రీలు ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రోత్సహించే విధంగా ఆ చావులకు 'పవిత్రత'ను ఆపాదించేవారని రాశారు. అంటే ఇది మరో రకంగా 'సతి' ప్రథను ప్రోత్సహించడమే అని గుర్తించాలి. శిరోముండనం, ఏకభుక్తం, అమాంగల్యం, కులాంగనలు పేరిట వితంతువులకు గౌరవప్రదమైన జీవితాన్ని నిరాకరించడాన్ని చర్చించారు. అయితే ఈ వ్యాసంలో ఉప్పులూరి నాగరత్నమ్మను పునర్వివాహం చేసుకోవడానికి కందుకూరి వీరేశలింగం సహకరించారని రాశారు. అదే సమయంలో దేవదాసీ అయిన బెంగళూరు నాగరత్నమ్మను ఆమె సంగీత, సాహిత్య సేవను కందుకూరి తూలనాడిన విషయం కూడా అందరికీ తెలియాలి.



అప్పుడే వీరేశలింగం లాంటి 'సంఘ సంస్కర్తల' స్త్రీ సానుభూతి ఎంతవరకు నిజమో తెలుసుకోవడానికి, మిగతావారితో పోల్చి బేరీజు వేసుకోవడానికి తోడ్పడుతుంది. ఈ వ్యాసంలో రచయిత్రులు పులుగుర్త లక్ష్మీనరసమాంబ, మొసలికంటి రమాబాయమ్మ, బుచ్చి బంగారమ్మ, సరస్వతి, పులవర్తి కమలాదేవి తదితరుల రచనలను ఉటంకిస్తూ సాహితీ విలువను జోడించారు. అట్లాగే సంకలన సంపాదకులు కొమర్రాజు రామలక్ష్మి, సోమంచి శ్రీదేవి రాసిన 'సంగమం' నవలను ఇందులో విశ్లేషిస్తూ సంస్కృతి, సంప్రదాయం పేరిట వితంతువుల ఆత్మగౌరవాన్ని ఎట్లా దెబ్బతీసింద్రో చెప్పింద్రు.

మరో సంపాదకురాలు తమ్మెర రాధిక 'శ్రీపాద కథల్లో వితంతువులు' అనే అంశాన్ని విషయాన్ని చర్చించారు. వీళ్లేగాకుండా తెలుగు మహిళా విమర్శకుల మీద విలువైన పుస్తకాన్ని పరిశోధించి గతంలో వెలువరించిన దివంగత కందాల శోభారాణి గురజాడ, కందుకూరి చిత్రించిన వితంతు సమస్యలు, చలం సాహిత్యంలో వితంతు సమస్య గురించి తిరునగరి దేవకీదేవి, కొ.కు. కథల్లోని వితంతు పాత్రల గురించి కె.ఎన్.మల్లీశ్వరి తదితరులు రాసింద్రు. అట్లాగే సామాజిక వ్యాసాల విభాగంలో 'కులమూ, జెండర్ సంబంధంతో ఉంటూ, కులాల సరిహద్దులను కాపాడేందుకు ప్రధానంగా స్త్రీలపై ఆధారపడే ఒక నిర్మాణానికి సంబంధించిన నిబంధనల సమాహారమే 'బ్రాహ్మణీయ పితృస్వామ్య వ్యవస్థ' అంటూ నిర్వచించిన ఉమాచక్రవర్తి వ్యాసం ఇందులో ఉన్నది. వేదకాలంలో లేని వివక్ష ఆ తర్వాతి కాలంలో ఎట్లా, ఎందుకు వచ్చిందో ఇందులో వివరించారు. ఈ వ్యాసాన్ని తెన్నేటి విజయచంద్ర తెలుగులోకి తెచ్చారు.

వితంతు సమస్యపై సంస్కరణోద్యమ కాలపు మహిళల అవగాహనను కాత్యాయని విద్మహే అక్షరబద్ధం చేశారు. ఆమె తన వ్యాసంలో పూలే, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సామినేని ముద్దునరసింహం నాయుడు, వీరేశలింగం, దామెర్ల సీతమ్మ, జూలూరు తులశమ్మ తదితరుల రచనల ఆసరాగా ఆనాటి స్త్రీల చైతన్యాన్ని, వితంతువుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా చేసిన రచనలను సమగ్రంగా విశ్లేషించారు. పుస్తకంలోని మొదటి మూడు వ్యాసాలు అనిశెట్టి రజిత రాశారు. ఇక్కడే మహారాష్ట్రలో 'విద్యాదేవి'గా కొలువబడ్డ సావిత్రీబాయి రోడే, స్త్రీ, పురుష తులనాత్మక రచన చేసిన తారాబాయి షిండే, తెలంగాణలో సంగెం లక్ష్మీబాయమ్మ తదితరుల గురించి కూడా ఇందులో చేర్చితే బాగుండేది. 'కథనాలు' శీర్షికన వెలువడిన రచనల్లో సమాజంలోని అన్నివర్గాల వారి మహిళల వెతలు రికార్డయ్యాయి.

వితంతువు అంటే ఒకప్పుడు బాల్య వివాహం చేసుకున్న బ్రాహ్మణ స్త్రీల సమస్యగానే ఉండేది. ఇప్పుడది బహుజన స్త్రీల సమస్యగా మారింది. విద్యావకాశాలు పెరిగి బ్రాహ్మణ స్త్రీలలో బాల్యవివాహాలు రద్దయ్యాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆ కులాల్లో వితంతు వ్యవస్థ సమస్య కాకుండాపోయింది. అయితే మద్యపాన సేవనం, హజార్డస్ ఉద్యోగాలు కూడా బహుజనుల్లో ముఖ్యంగా నిరక్షరాస్యులు వితంతవులుగా మారడానికి హేతువులవుతున్నాయి. వీటన్నింటిని పట్టించుకొని ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి ఈ గ్రంథం కరదీపికలాగా ఉంటుంది. సమాజం పట్ల కన్సర్న్ ఉన్న అందరూ చదవాల్సిన గ్రంథం ఇది.



డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్



ఖైరతాబాద్‌లోని సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి ఆదివారం అశేషంగా తరలివచ్చిన భక్తజనం


ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మహాగణపతి.. విఘ్నాలు తొలగించు!

ప్రజలకు సుఖ సంతోషాలు కలగాలి: ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 15: 'వినాయకా.. రాష్ట్ర ప్రజల విఘ్నాలు తొలగించు.. తుఫాన్, వరదలతో, సీజనల్ వ్యాధులతో అవస్థలు పడుతున్న ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి అని రెండు చేతులు జోడించి మొక్కుకున్నా' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయనకు ఘనస్వాగతం పలికింది. మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. ప్రపంచంలోనే ఖైరతాబాద్ మహాగణపతి అత్యంత ప్రాచుర్యం పొందిందన్నారు. 70 ఏండ్ల నుంచి నిరాటంకంగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా నవరాత్రోత్సవాలు, శోభాయాత్రలు నిర్వహించామని, అదే తీరులో ప్రస్తుత ప్రభుత్వం ఉత్సవాలు జరిగేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నేతలు గజ్జెల నగేశ్, రావుల శ్రీధర్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఖైరతాబాద్‌కు పోటెత్తిన భక్తజనం

హైదరాబాద్ నడిబొడ్డున ఖైరతాబాద్‌లో కొలువుదీరిన సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి చివరిరోజైన ఆదివారం భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు సుమారు ఐదు లక్షలకు పైగా భక్తులు వచ్చినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహాగణపతి దర్శనం కోసం ఒక్కసారిగా లక్షలాది మంది తరలిరావడంతో వారిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొన్నది. రాత్రి 12 గంటలకు వరకు ఏడు లక్షలకు పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు. నేడు దర్శనాన్ని పూర్తిగా నిలిపివేస్తున్నట్టు, భక్తులు ఎవరూ రావద్దని పోలీసులు ముందస్తుగా ప్రకటించారు. మహాగణపతిని దర్శించుకొని ఐమాక్స్, మింట్ కాంపౌండ్‌కు వెళ్లే దారుల్లో భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకోగా పలువురు వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు పోలీసుల తరమూ కాలేదు.బాధితులకు భక్తులే సపర్యలు చేశారు.


సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

మంత్రి ఉత్తమ్ భద్రతా వాహనం ఢీ.. వ్యక్తి మృతి

న్యాయం చేయాలని గరిడేపల్లిలో బంధువుల రాస్తారోకో

గరిడేపల్లి, సెప్టెంబర్ 15: భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భద్రత కోసం వెళ్తున్న ఫార్చునర్ వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రం తాసీల్దార్ కార్యాలయం సమీపంలో అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. గరిడేపల్లి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కీసర జీడయ్య (42) కూలిపని నిమిత్తం గరిడేపల్లి నుంచి అబ్బిరెడ్డిగూడెం వైపు బైకుపై వెళ్తున్నాడు. హుజూర్‌నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎస్కార్ట్ కోసం హైదరాబాద్ నుంచి వెళ్తున్న ఫార్చునర్ (బుల్లెట్ ప్రూఫ్) వాహనం జీడయ్య బైకును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీడయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీడయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మిర్యాలగూడ-హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. దాదాపుగా రెండున్నర గంటలపాటు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం స్థానిక నాయకులు, పోలీసులు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ చరమందరాజు, ఎస్సై నరేశ్ తెలిపారు.


జీడయ్య (ఫైల్)

రుణమాఫీ పూర్తి చేసినం

- మాఫీ చేయాల్సింది 42 లక్షల మందికి 31 వేల కోట్లు
- ఇప్పటికి చేసింది 23 లక్షల మందికి 18 వేల కోట్లు
- ఇంకా చేయాల్సింది 19 లక్షల మందికి 13 వేల కోట్లు
- రుణమాఫీ పూర్తి చేసినట్టు ఎలా అవుతుంది

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఒకవైపు రుణమాఫీ పూర్తి చేశామని చెప్తున్న ముఖ్యమంత్రి... మరోవైపు రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు ఆపై మొత్తాన్ని చెల్లించిన వెంటనే మాఫీ చేస్తామని ప్రకటించారు. 'రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశాం. రూ.2 లక్షలకుపైగా రుణం కలిగిన రైతులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ రైతులు రూ.2 లక్షలకు పైబడి ఉన్న మొత్తాన్ని చెల్లించిన మరుక్షణమే మాఫీ చేస్తాం' అని ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎం తాజా వ్యాఖ్యల ప్రకారం ఇంకా రుణమాఫీ మొత్తం పూర్తికాలేదని స్పష్టమవుతున్నది. రూ.2 లక్షలలోపు రుణాలు కలిగిన రైతుల్లో కూడా చాలా మందికి పలు సమస్యలతో మాఫీ కాలేదు. రూ.2 లక్షలకుపైగా రుణం కలిగిన రైతులెవరికీ రుణమాఫీ కాలేదు. అలాంటప్పుడు రుణమాఫీ పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

19 లక్షల మంది రైతులు... 13 వేల కోట్లు

ప్రభుత్వ లెక్కల ప్రకారం రుణమాఫీకి అర్హత కలిగిన రైతుల సంఖ్య 42 లక్షలు. వీరికి రుణమాఫీ చేసేందుకు రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం గతంలోనే వెల్లడించింది. ఇప్పటివరకు మూడు విడతల్లో 23 లక్షల మందికి రుణమాఫీ చేయగా, ఇందుకోసం రూ.18 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇంకా 19 లక్షల మంది రైతులకు రూ.13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నది. రూ.2 లక్షలలోపు రుణం ఉన్న సుమారు నాలుగు లక్షల మందికి మాఫీ కాలేదని తెలిసింది. రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలో తప్పులు ఉండటం తదితర కారణాలతో వీరికి రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు ఎప్పుడు మాఫీ అవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాన్ని బ్యాంకుల్లో చెల్లించిన వెంటనే మాఫీ చేస్తామని చెప్తున్న ప్రభుత్వం.. ఇందుకు ఎలాంటి గడువూ విధించలేదు. దీనికి తోడు రూ.2 లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని ఇప్పుడే చెల్లించొద్దని, తాము చెప్పినప్పుడే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వీరికి రుణమాఫీ ఎప్పుడు అవుతుంది? అసలు అవుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా ఆగస్టు 15 లోగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామాను కోరడం విడ్డూరంగా ఉన్నదని ప్రతిపక్షం విమర్శిస్తున్నది. ఏ మొహం పెట్టుకొని హరీశ్‌రావును రాజీనామా కోరతారని ప్రతిపక్షం ప్రశ్నిస్తున్నది.



కౌశిక్ ఇంటిపై దాడి చేసింది మనోళ్లే!

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసింది కాంగ్రెస్ పార్టీ వాళ్లేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. 'మన ఇంటికి వస్తమని చెప్పిండ్రు.. కానీ, మనోళ్లే వాళ్ల ఇంటికి పోయిండ్రు..ఒళ్లు చింతపండు చేసింఢ్రు' అని సీఎం వ్యాఖ్యానించారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీవారో సీఎం స్పష్టం చేసినట్టయ్యింది. ఈ వ్యాఖ్యల ద్వారా గాంధీ తమవాడేనని తేల్చి చెప్పేశారు. ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సభలో ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. 'కార్యకర్తలపై కేసులు పెట్టాలని దాడులకు ప్రయత్నిస్తున్నారు. ఒళ్లు చింతపండు అయ్యాక.. మా ఇంటికి వచ్చి తన్నింఢ్రు అని చెప్తున్నరు. సంకనాక పిలవాలా.. రా రా చూసుకుందాం అని..' అంటూ అసలు విషయం చెప్పేశారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని ఫిరాయింపు ఎమ్మెల్యే గాంధీకి ఇవ్వడంపై బీఆర్‌ఎస్ మండిపడింది. దీంతో గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అని, అందుకే పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చామని మంత్రులుశ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క చెప్తూ వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే అని చెప్పారు. ఆదివారం మాత్రం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ ఎమ్మెల్యేనని చెప్పకనే చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో అబద్ధాల కుండ బద్దలైపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌పై దాడులను ప్రోత్సహించేలా ఉన్నాయనే విమర్శలొస్తున్నాయి. సీఎం రేవంత్ భాషపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాన్ ప్రకారమే కౌశిక్‌రెడ్డిపై దాడికి ఉసిగొల్పారనే ప్రచారం సాగుతున్నది.



విమోచన దినోత్సవమే జరపాలి

- 'ప్రజాపాలన'లో భాగస్వామిని కాలేను
- సీఎంకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాపాలన దినోత్సవం పేరిట నిర్వహించే కార్యక్రమానికి తాను రాలేనని స్పష్టంచేశారు. సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి కేంద్ర మంత్రుల ను ఆహ్వానించిన నేపథ్యంలో కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. ముఖ్యమంత్రికి ఆదివారం లేఖ రాశారు. సెప్టెంబర్ 17ను పవిత్రమైన, స్ఫూర్తిదాయకమైన రోజు గా కిషన్‌రెడ్డి అభివర్ణించారు. వేలాది మంది త్యాగాల ఫలితమైన విమోచన దినోత్సవం పేరును మార్చి చరిత్రలో ఏమీ జరగలేదన్నట్టుగా వక్రీకరించడం తగదని పేర్కొన్నారు. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాను భాగస్వామిని కాలేనని తెలిపారు.

ఓవైసీకి భయపడే.. : మహేశ్వర్‌రెడ్డి

ఎంఐఎం ఒవైసీలకు భయపడే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించడంలేదని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇతర పేర్లతో నిర్వహించడం తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను విస్మరించడమేనని ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

ఇంట్లోకి చొరబడి పుస్తెలతాడు చోరీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 15: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడిన ఓ దుండగుడు కూరగాయలు కోస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. తంగళ్లపల్లిలోని మార్కండేయ ఆలయం పక్కన ఒంటరిగా నివాసం ఉండే సబ్బని రుక్కుంబాయి (70) తన ఇంట్లో దర్వాజ వద్ద కూర్చుని వంట కోసం కూరగాయలు కోస్తున్నది. ఓ ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి రుక్కుంబాయి మెడలో నుంచి పుస్తెలతాడును లాక్కెళ్లి వీధి సమీపంలో పార్కింగ్ చేసిన బైక్‌పై పరారయ్యాడు. వృద్ధురాలు బయటకు వచ్చి కేకలు వేయగా.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం, పోలీసు జాగిలంతో గాలించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై సుధాకర్ మండల కేంద్రంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

16 మంది ఎంపీలు పేదల విరోధులా?

- 17 మందిలో అసదుద్దీన్ ఒక్కడే పేదల పక్షపాతి అన్న సీఎం
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీల గుర్రు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర ఎంపీలు గుర్రుమంటున్నారు. రాష్ట్రంలో 17 మంది ఎంపీలు ఉంటే అసదుద్దీన్ ఒవైసీ మాత్రమే పేదల పక్షాన గొంతెత్తుతారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'ప్రాఫెట్ ఆఫ్ ద వరల్డ్' పుస్తకా విష్కరణ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఏపీలో పలువురు ఎంపీలు పేదల పక్షాన పార్లమెంట్‌లో గళమెత్తేవారు.ఇప్పుడు ఆ సంఖ్య చాలా తగ్గింది. ప్రస్తుతం వ్యాపారవేత్తలు, కార్పొరేట్లు రాజకీయాల్లోకి వస్తున్నారు. వాళ్లు వ్యాపారాల్లో బాగానే రాణిస్తున్నారు. కానీ పేదల పక్షాన గొంతెత్తేవారు తక్కువయ్యారు. ప్రస్తుతం ఉన్న 17 మందిలో నాకు పేదల పక్షాన గొంతెత్తే ఒకే వ్యక్తిగా అసదుద్దీన్ ఒవైసీ మాత్రమే కనిపిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. దీంతో రాష్ట్రంలోని మిగతా ఎంపీలు సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. అసదుద్దీన్ మినహా మిగతా 16 మంది ఎంపీల్లో 8 మంది కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా, మిగతా 8 మంది బీజేపీకి చెందినవారు. ఇందులో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. అందరినీ పేదలకు విరోధులుగా ప్రకటించటంపై వారు మండిపడుతున్నారు.

సొంత పార్టీ ఎంపీలకే అవమానమా?

ఎంపీ అసదుద్దీన్‌ను పొగిడే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత పార్టీ ఎంపీలనూ అవమానించేలా మాట్లాడారని కాంగ్రెస్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇది కాంగ్రెస్ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలను అవమానించడమే అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎంపీల్లో సీఎం ఏరికోరి టికెట్ ఇచ్చుకొని, గెలిపించుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య వంటి వారు కూడా ఉన్నారని గుర్తుచేస్తున్నారు.సీఎంగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే పార్టీకి ప్రజల్లో ఏం విలువ ఉంటుందని మండిపడుతున్నారు. ప్రభుత్వం ఉన్నది ప్రజాసేవకే అనేలా ఉండాలే తప్ప.. తమవాళ్లు ఎవరూ పేదల పక్షాన మాట్లాడరు అన్నట్టుగా వ్యాఖ్యానించటం ఏమిటని మండిపడుతున్నారు. ప్రతిపక్షం అంటే పేదల తరపున పోరాడుతుందని, కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పేదల తరపున పోరాడదని సంకేతాలు ఇస్తున్నారా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు సైతం మండిపడుతున్నారు. 'మేము పొద్దునలేస్తే ప్రజల మధ్యనే ఉంటు న్నాం. రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కొట్లాడేది కార్పొరేట్ల కోసమా? రైతులందరూ వ్యాపారవేత్తలా? హైడ్రా పేరు తో మీరు కూల్చిన గుడిసెలు కోటీశ్వరులవా? వాళ్లందరి తరపున మేం పోరాడేది కనిపించడం లేదా?' అని బీజేపీకి చెందిన ఓ ఎంపీ మండిపడ్డారు. ఒవైసీని ప్రసన్నం చేసుకునే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజకీయ విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సొంత పార్టీ ఎంపీలను కూడా అవమానిస్తూ ఎంఐఎంను ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

సీపీఎస్ రద్దుకు 26న దేశవ్యాప్త ప్రదర్శనలు

ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 26న దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్, తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ వెల్లడించారు. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంవోపీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. యూపీఎస్, ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సీపీఎస్ రద్దుపై జాతీయస్థాయి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు డిసెంబర్ 15న ఢిల్లీలో ఎన్‌ఎంవోపీఎస్ జాతీయ కన్వెన్షన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, జమ్మూకశ్మీర్, ఝార్కండ్, ఢిల్లీ రాష్ట్రాల ఎన్నికల్లో 'ఓట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం' నినాదంతో ముందుకెళ్తామని స్పష్టంచేశారు. సమావేశంలో తెలంగాణ నుంచి కల్వల్ శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ సహా 22 రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాయన మాటా పెడచెవిన!

- ఎవరికీ చెప్పకుండానే గుత్తా అమిత్ బాధ్యతలు
- రేవంత్‌రెడ్డి వర్గానికే పదవులు
- నల్లగొండ కాంగ్రెస్‌లో ముసలం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు ఆరేలా కనిపించడంలేదు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డిలకు నామినేటెడ్ పోస్టులపై పార్టీ సీనియర్లు గుర్రుగా ఉన్నారు. పార్టీ అధిష్ఠానం వారిద్దరూ బాధ్యతలు తీసుకోవద్దని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చింది. అయినా ఎవరికీ చెప్పకుండా.. డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. గత వారమే ఆయన నేరుగా కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు సర్వత్రా ఇదే చర్చనీయాంశంగా మారింది. గుత్తా సుఖేందర్‌రెడ్డి రాజకీయ వారసుడిగా ఆరంగేట్రం చేసిన అమిత్‌రెడ్డి తొలిసారి ప్రభుత్వ పదవిని సాధించుకున్నారు. ఇలాంటి సందర్భాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలనైనా పిలిచి, వారి సమక్షంలో బాధ్యతలు స్వీకరించాలి. విచిత్రంగా కనీస సమాచారం లేకుండానే హడావుడిగా ఒక్కడే వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. గుత్తా అమిత్‌రెడ్డికి పదవి ఇవ్వడం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కాంగ్రెస్‌లో తుఫాను సృష్టించిందని చెప్పవచ్చు. జిల్లాలో పదుల సంఖ్యలో నేతలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పనిచేస్తే.. వారెవ్వరికీ పదవులు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నుంచి అప్పటికప్పుడు వచ్చి చేరిన అమిత్‌రెడ్డికి పదవి ఇవ్వడం పార్టీ సీనియర్లను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.అమిత్‌కు పదవి రావడమే ఆలస్యం.. జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలు, మంత్రులు పార్టీ అధిష్ఠానం వద్ద తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నొచ్చుకున్న పెద్దాయన

నల్లగొండ జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నేత వద్దకు జిల్లా నేతలు వెళ్లి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. దీంతో ఆయన గుత్తా అమిత్‌రెడ్డికి పదవి తీసుకోవద్దని వారించినట్టు తెలిసింది. ఆయనతోపాటు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కూడా పదవి తీసుకోవద్దని, స్వచ్ఛందంగా వదిలివేస్తున్నట్టు చెప్పాలని సూచించినట్టు తెలిసింది. గుత్తా అమిత్‌రెడ్డి మాత్రం 'పెద్దాయన' మాటను పట్టించుకోకుండానే వెళ్లి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అయిందనిపించారు. దీంతో నల్లగొండ పెద్దాయన నొచ్చుకున్నట్టు సమాచారం. ఆయన జిల్లా నేతలతో కూడా చర్చించి ఇది పద్ధతి కాదని, పార్టీ బద్నాం అవుతోందని అన్నట్టు తెలిసింది.జిల్లాలో రేవంత్‌రెడ్డి వర్గంగా ఉంటున్నవారికి మాత్రమే పదవులు వస్తున్నాయని, ఇక్కడ పార్టీ కోసం పనిచేస్తున్న వారికి పదవులు రావడంలేదని పలువురు నల్లగొండ నేతలు తీవ్ర అసంతృప్తి చేస్తున్నారు. ఇప్పటికే పటేల్ రమేశ్ రెడ్డికి పదవి ఇవ్వడం, బండ్రు శోభారాణికి ఇవ్వడం, తాజాగా అమిత్‌రెడ్డికి పదవి ఇవ్వడం అసంతృప్తికి గురిచేస్తున్నది. టీడీపీ మూలాలున్న వీరు రేవంత్‌రెడ్డి వర్గంగా ముద్రపడ్డారు. వీళ్లకే పదవులు ఇస్తూ పోతే మరి అసలు కాంగ్రెస్ వాళ్ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉదయిస్తున్నది.

16 రోజులుగా పవర్ కట్

మొదటిపేజీ తరువాయి...

చేసినా పట్టించుకోవడం లేదని, పంటలకు నీళ్లు లేక ఎండిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. విద్యుత్తు అధికారులకు ఫోన్లు చేసినా ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు వచ్చినప్పటి నుంచి విద్యుత్తు స్తంభాలు, లైన్లు దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరించకుండా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు 24 గంటల కరెంట్ వచ్చిందని, కాంగ్రెస్ పాలనలో ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యానికి పంటలు ఎండిపోతుండటంతో సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు విద్యుత్తును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వర్షాలు వచ్చినప్పటి నుంచి కరెంట్ రావడం లేదు

వర్షాలు వచ్చినప్పటి నుంచి త్రీఫేజ్ కరెంట్ రావడం లేదు. నాకు 7 ఎకరాల వరి పొలం ఉంది. కరెంట్ లేక పొలం ఎండిపోతున్నది. కరెంట్ కోసం అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. మేమే ఎక్కడైనా విద్యుత్తు లైన్లు తెగిపడ్డాయో చూస్తున్నాము. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.

-గట్టికొప్పల మోహన్‌రెడ్డి, రైతు, మామిళ్లగూడెం

నోబెల్ శాంతి సమావేశానికి 'భట్టి'కి ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 18 నుంచి 21 వరకు మెక్సికో దేశంలో జరిగే 10వ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈ మేరకు నిర్వాహకులు ఆయనకు ఆహ్వానం పంపారు. 'ప్రగతి కోసం శాంతి' అనే ఎజెండాతో ఈ సమావేశాలు జరుగనున్నాయి. నోబెల్ బహుమతి గ్రహీతలు, ప్రపంచశాంతి న్యాయవాదులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.



ఇంపాక్ట్ ప్లేయర్ పురస్కారాన్ని అందుకుంటున్న మిశ్రా

ఈఈఎస్ఎల్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : కేంద్ర విద్యుత్తు శాఖకు చెందిన ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)కు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. 2023-24 సంవత్సరానికి భారత పరిశ్రమ సమాఖ్య(సీఐఐ) అందించే 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును దక్కించుకుంది. సీఐఐ రజతోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సెక్రటరీ మిలింద్ దియోరా చేతులమీదుగా ఈఈఎస్ఎల్ సీజీఎం అనిమేశ్ మిశ్రా పురస్కారాన్ని అందుకున్నారు. ఉజాలా పథకం కింద 36 కోట్ల ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేయడమే కాకుండా, 1.3 కోట్ల వీధి దీపాలను అమర్చింది. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయిదేవరాజులు ప్రసాద్, ఇంధన సామర్థ్య కౌన్సిల్ చైర్మన్ రవిచంద్రన్, సీఐఐ ఈడీ కేఎస్ వెంకటగిరి, గిరిజాశంకర్, పీవీ కిరణ్, అనంత్ పాల్గొన్నారు.

చైనాలో దర్శకత్వం.. దుబాయ్‌లో స్క్రీన్‌ప్లే!

- తెలంగాణలో కమీషన్ ఖాతాలు.. కోట్లల్లో డబ్బులు
- మ్యూల్ ఖాతాల డబ్బంతా క్రిప్టోగా మార్పు
- చైనా, దుబాయ్‌లలో కింగ్‌పిన్‌లు
- చేతులు మారుతున్న కోట్లాది రూపాయలు

చట్టవిరుద్ధంగా సంపాదిస్తున్న డబ్బును తమ ఖాతాలకు చేరవేసేందుకు సైబర్ మోసగాళ్లు కొత్తమార్గాన్ని ఎంచుకున్నారు. కమీషన్ల ఆశ చూపుతూ మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ ద్వారా కోట్లు దారి మళ్లిస్తున్నారు. ఇందుకు తెలంగాణను కేంద్రంగా ఎంచుకొని ఇక్కడి అమాయకులను ఇరికిస్తున్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి వందల కోట్లు చేతులు మారుతున్నాయి. రాష్ట్రంపై ప్రత్యేక దృష్టిసారించిన సైబర్ నేరగాళ్లు.. మనవాళ్లను నమ్మించి మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ తీయించి.. ప్రతిరోజూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఆ కొల్లగొట్టిన డబ్బును ఏకంగా క్రిప్టోలోకి మార్చి.. సైబర్ కింగ్‌పిన్‌లకు పంపుతున్నారు. ఈ తతంగమంతా మొన్నటి వరకు రహస్యంగా జరిగినా.. ఇటీవల సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఈ స్కామ్‌ను బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా కొన్ని అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి భారీగా డబ్బులు విత్ డ్రా అయిన ఘటనలు బ్యాంకు అధికారుల దృష్టికి రావడంతో.. వారు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు సమాచారం ఇచ్చారు. కొత్త తరహా మోసాలపై లోతుగా విచారించడంతో చైనా, దుబాయ్‌లో ఉంటున్న కింగ్‌పిన్‌లు ఈ సైబర్ రాకెట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ స్కామ్‌ను ఎలా చేపట్టాలో చైనా కింగ్‌పిన్‌లు బోధిస్తుండగా దుబాయ్‌లో ఉండే మరికొందరు హైదరాబాద్‌లోని సైబర్ స్లీపర్‌సెల్స్‌తో పక్కాగా అమలయ్యేలా చూస్తున్నారు.

మనోళ్లు సమిధలా? నేరస్తులా?

దుబాయ్, చైనా కింగ్‌పిన్‌లు చెప్పిట్టుగా కమీషన్ల కోసం కరెంట్ బ్యాంకు అకౌంట్లు తీయిస్తున్న తెలంగాణకు చెందిన సైబర్ స్లీపర్ సెల్స్ సమిధలుగానే సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. పేదలను గుర్తించడం, వారి ద్వారా అకౌంట్లు ఓపెన్ చేయించి, కమీషన్లు ఇవ్వడం, ఆ డబ్బును క్రిప్టోగా మార్చడంలోనూ వీళ్లే కీలకంగా ఉండటంతో నేరస్తులుగా కూడా పరిగణిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న ఈ మ్యూల్ అకౌంట్ల వ్యవహారంపై దృష్టి సారించి, లావాదేవీల వివరాలు ఇవ్వాలని బ్యాంకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సైబర్ నేరాల ద్వారా సంపాదించిన రూ.175 కోట్లను హైదరాబాద్‌లోని శంషీర్‌గంజ్ ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి పలు దఫాలుగా విత్‌డ్రా చేసి, క్రిప్టోగా మార్చిన సైబర్ రాకెట్‌లో కీలకమైన కింగ్‌పిన్‌లను అరెస్టు చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నట్టు చెబుతున్నారు.

అత్యాశతో కోట్లు నష్టం

హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు రూ.8.6 కోట్లు మోసపోయిన ఘటన మరువక ముందే.. ఓ వృద్ధుడి నుంచి ఏకంగా రూ.13.26 కోట్లను కొల్లగొట్టారు. సామాన్యుల నుంచి చిల్లరే వస్తుండటంతో.. కొత్తగా ఆన్‌లైన్ వేదికగా స్టాక్‌లో పెట్టుబడులు పెట్టేవారి ఖాతాల్లో లక్షలు, కోట్ల రూపాయలు ఉండటంతో వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. చిట్కాల పేరిట మెసేజ్‌లు పంపి, నకిలీ సైట్‌ల లింకులు పెట్టి ఉన్నది మొత్తం ఊడ్చేస్తున్నారు. పెట్టుబడి పెట్టడానికి ఆకర్షితులైతే ఆపరేటర్లు మొదట్లో డబ్బును మోసపూరిత వ్యక్తితాలూకు బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ విధంగా నమ్మించి తమ ప్రీమియం, వీఐపీ ఛానెళ్లకు సభ్యత్వాన్ని పొందాలని ఒత్తిడి చేస్తారు. తద్వారా మరిన్ని ఎక్కువ లాభాలు వస్తాయని హామీ ఇస్తుంటారు.

మొట్టికాయలు పడితే కానీ మేల్కోలే!

- కోచింగ్ సెంటర్ల కట్టడిలో సర్కారు విఫలం
- జనవరిలో కేంద్రం మార్గదర్శకాలు
- మీనమేషాలు లెక్కించిన రాష్ట్రం
- కేంద్రం ప్రభుత్వం ఆగ్రహంతో అమలుకు నిర్ణయం
- ఇంటర్‌బోర్డుకు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జేఈఈ, నీట్, ఎప్‌సెట్ వంటి పరీక్షలకు కోచింగ్ ఇస్తున్న శిక్షణ సంస్థలను కట్టడిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. చివరికి కేంద్ర ప్రభుత్వం మొట్టికాయ లేయడంతో ఇప్పుడు మేల్కొన్నది. ఇటీవలి కాలంలో కోచింగ్ సెంటర్లలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. దీనికితోడు వసతుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తున్నది. అయినప్పటికీ ఫీజులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రాలన్నీ వాటిని అమలుచేయాలని సూచించింది. ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తొలిసారి ఉల్లంఘిస్తే రూ. 25 వేలు, రెండోసారి మళ్లీ అదే పనిచేస్తే రూ. లక్ష జరిమానా విధించాలని సూచించింది. పదేపదే అదే పనిచేస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. వీటి అమలు విషయాన్ని రాష్ట్రం పెడచెవిన పెట్టింది. కేంద్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో తాజాగా క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించారు. కేంద్ర మార్గదర్శకాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను ఇంటర్‌బోర్డుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

కేంద్ర మార్గదర్శకాల్లో ప్రధానమైనవి

- రోజులో ఐదు గంటలకు మించి క్లాసులు నిర్వహించకూడదు. తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో క్లాసులు నిర్వహించరాదు.
- శిక్షణ ఇచ్చే వ్యక్తి లేదా సంస్థ కోచింగ్ ప్రారంభించిన మూడు నెలల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తగు డాక్యుమెంట్లను సమర్పించాలి. దరఖాస్తు చేసిన మూడు నెలల్లోపు ఆయా దరఖాస్తును ఆమోదిస్తారు. లేదా తిరస్కరిస్తారు.
- ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చే సంస్థలు తప్పనిసరిగా ఆయా బ్రాంచ్‌లను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి.
- సెకండరీ విద్య (పాఠశాల విద్య) పూర్తిచేసిన వారిని మాత్రమే కోచింగ్ కోసం పేర్ల నమోదుకు అనుమతించాలి.
- శిక్షణ కేంద్రాల్లో అర్హులైన సిబ్బందిని నియమించుకోవాలి.
- విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ర్యాంకు గ్యారెంటీ హామీలు ఇవ్వరాదు. ఫలితాలపై మోసపూరిత ప్రకటనలివ్వరాదు.
- సిబ్బంది అర్హత, కోచింగ్ సెంటర్ వివరాలు, శిక్షణ అందించే కోర్సులు, వసతి సౌకర్యాలు, ఫీజు రీఫండ్‌కు సంబంధించిన సమాచారాన్ని బహిర్గత పరచాలి.

మాపై అరికో కేఫ్ ఆరోపణలు అవాస్తవం

- అక్కడ విస్కీతో ఐస్‌క్రీమ్ తయారీ
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అరికో కేఫ్ యాజమాన్యం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిపై చేసిన ఆరోపణలను ఆ శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఖండించారు. విస్కీతో ఐస్‌క్రీమ్‌ను తయారుచేసి కస్టమర్లకు, ముఖ్యంగా మైనర్లకు అమ్ముతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ఇటీవల ఆ కేఫ్‌పై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి సిబ్బందిని పట్టుకున్నామని ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ కేఫ్‌లో మద్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఐస్‌క్రీమ్ తయారీకి 100 పైపర్ విస్కీని ఉపయోగించారని నిర్ధారించుకున్న తర్వాతే వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బందికి లంచాలు ఇవ్వకపోవడమే ఈ అరెస్టులకు, కేసుల నమోదుకు కారణమని, ఎక్సైజ్ సిబ్బందే ఐస్‌క్రీమ్‌లో విస్కీ కలిపారని అరికో కేఫ్ యాజమాన్యం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ శివారులో ఎండిపోయిన పత్తి మొక్కలు చూపిస్తున్న రైతు వెంకన్న

లీడర్లు చెప్పిన పొలాల్లోనే పంటల పరిశీలన?

- అసలు పంటలు నష్టపోయిన రైతులకు అన్యాయం?
- మా పొలాల్లోకి రావడం లేదని అన్నదాతల ఆవేదన
- లంచాలు ఇస్తేనే పరిహారం వస్తదంటున్న స్థానిక లీడర్లు
- నర్సింహులపేట మండలంలో అధికారుల తీరుపై ఫైర్

నర్సింహులపేట, సెప్టెంబర్ 15: పంట నష్టపరిహారం విషయంలో కొందరు నాయకులు చెప్పిన బాధితులకే న్యాయం జరుగుతున్నదని, పంటలు నష్టపోయిన మిగతా వారిని అధికారులు పట్టించుకోవడం లేదని వదిలి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల రైతులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే కోసం వచ్చిన అధికారులను తమకు నచ్చిన వారి పొలాల వద్దకే తీసుకెళ్తున్నారని, అధికారులు కూడా వారు చూపించిన పొలాల్లోనే నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నారని వాపోతున్నారు. దీనికి తోడు 'మేము చెప్తేనే పరిహారం వస్తుంది.. మాకు లంచాలు ఇవ్వాలి? లేకపోతే అంతేసంగతి. ఈ విషయం బయటకు చెప్పొద్దు.. ఒకవేళ చెప్తే పరిహారం రాదు' అని భయపెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఏవో, ఏఈవోలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనకు వచ్చిన అధికారులను కొంతమంది నాయకులు తమకు నచ్చిన పొలాలకు తీసుకువెళ్లి పంటల నష్టాన్ని చూపిస్తున్నారు. అసలు రైతులకు అన్యాయం చేస్తున్నారు. నష్టపరిహారం ఎక్కువగా ఇప్పించేందుకు డబ్బు సైతం వసూలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలైన బాధిత రైతులకు అన్యాయం జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. పంటలను ఏవో, ఏఈవోలకు క్షేత్రస్థాయిలో చూపించాలని, ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదని ఏడీఏ విజయచందర్ స్పష్టంచేశారు.

భద్రాద్రి రామాలయం పేరుతో విరాళాల సేకరణ

- అమెరికాలోని ఆలయ నిర్వాహకుల దోపిడీ
- రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు: ఈవో

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం పేరుతో అమెరికాకు చెందిన ఓ ఆలయ నిర్వాహకులు విరాళాలు సేకరిస్తున్నట్టు గుర్తించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి తెలిపారు. ఆలయంలోని చిత్రకూట మంటపంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో విరాళాలు సేకరిస్తున్నారని, ఇప్పటికే కోట్ల రూపాయల విరాళాలు వసూలు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఖగోళ యాత్ర కోసం అమెరికా ఆలయ అర్చకులు భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరిట లెటర్‌ప్యాడ్‌ను రూపొందించి విరాళాలు సేకరిస్తున్నట్టు తెలియడంతో ఆ విషయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. భద్రాద్రి ఆలయం పేరుతో ఎవరైనా విరాళాలు సేకరించినా, భద్రాద్రి ఆలయ పేరును ఉపయోగించుకున్నా దేవాదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని రమాదేవి హెచ్చరించారు. సమావేశంలో ఆలయ ఏఈవో భవానీ రామకృష్ణ, ఈఈ రవీందర్‌రాజు, సూపరింటెండెంట్ సాయిబాబా, అర్చకులు రామస్వరూప్, అమరవాది విజయరాఘవన్, గోపి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనం ఆర్సీ గడువు 15 ఏండ్లే

- ఆ తర్వాత ఐదేండ్లకోసారి రెన్యువల్ తప్పనిసరి
- లేకుంటే రవాణా శాఖకు జరిమానా చెల్లించాల్సిందే
- న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండాలంటే 60 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం
- ఆర్సీరెన్యువల్‌కు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సాధారణంగా ప్రైవేటు వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) గడువు 15 సంవత్సరాలపాటు ఉంటుంది. ఇది ముగిసిన అనంతరం ప్రతి ఐదేండ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. లేకుంటే ఆర్టీవో అధికారుల తనిఖీల్లో పట్టుపబడినప్పుడు భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత ఆర్సీ రెన్యువల్ చేసుకోకుంటే సంవత్సరానికి వాహనం ఖరీదులో 10 శాతం వరకు అదనంగా ఫైన్ కట్టాల్సి ఉంటుంది. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండాలంటే గడువు ముగిసే తేదీకి ముందే రెన్యువల్ చేసుకోవడం ఉత్తమం. ఇందుకు ఆన్‌లైన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్సీ రెన్యువల్‌కు ఫారం-25, దరఖాస్తు ఫారం, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్, ఆర్సీబుక్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, రోడ్‌టాక్స్ చెల్లించిన డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పాన్‌కార్డు, చాసిస్, ఇంజిన్ పెన్సిల్ పాయింట్ తదితరాలు అవసరమవుతాయి.

ఆన్‌లైన్‌లో రెన్యువల్ ఇలా..

- మొదట https://parivahan.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- మెను నుంచి 'ఆన్‌లైన్ సేవలు' క్లిక్ చేసి.. 'వాహన సంబంధిత సేవలు'ను ఎంచుకోవాలి.
- మీ రాష్ట్రాన్ని, సమీప ఆర్టీవోను ఎంచుకుని 'ప్రొసీడ్'పై క్లిక్ చేయాలి.
- 'సేవలు' విభాగంలోకి వెళ్లి డ్రాప్-డౌన్ జాబితా నుంచి 'ఆర్సీ' సంబంధిత సేవలను ఎంచుకోవాలి.
- 'రిజిస్ట్రేషన్ రెన్యువల్'ని ఎంచుకుని, మీ వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, చాసిస్ నంబర్‌ను ఎంటర్ చేయాలి
- దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడానికి 'వివరాలను ధృవీకరించు'ను క్లిక్ చేయాలి.
- రెన్యువల్ చార్జీలతో పాటు ఇతర ఫీజులు కూడా ఉంటాయి.

ఆఫ్‌లైన్‌లో రెన్యువల్ ఇలా..

- ఆర్సీ రెన్యువల్ కోసం ఆర్టీవో కార్యాలయంలో యజమాని దరఖాస్తు చేయాలి. అందుకోసం ఫారం-25ను నింపాలి. వాహన గడువు ముగిసిన నాటినుంచి 60రోజుల్లోగా పూర్తిచేయాల్సి ఉంటుంది.
- ఆర్సీ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసిన తర్వాత, మీకు అపాయింట్‌మెంట్ ఇస్తారు.
- ఆ రోజు మీ వాహనాన్ని ఆర్టీవో కార్యాలయంలో సమర్పించాలి. ఆర్‌టీవో అధికారి మీ వాహనాన్ని తనిఖీ చేస్తారు.
- మీ వాహనంలో ఎలాంటి సమస్యలు లేనట్టయితే.. ఆర్టీవో ఇన్‌స్పెక్టర్ సంతకం చేసి రెన్యువల్‌కు ఆమోదముద్ర వేస్తారు.
- మీ వాహన ఆర్సీ రెన్యువల్ పూర్తయిన తర్వాత సంబంధిత చార్జీలు, పన్నులు చెల్లించాలి.
- రెన్యువల్ చార్జీలతోపాటు ఇతర ఫీజులు కూడా ఉంటాయి.

నేల విడిచిన హైడ్రా!

మొదటిపేజీ తరువాయి...

వైభవం సంతరించుకుంటుందా? ఈ కూల్చివేతలతో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు మూల్యం చెల్లించేదెవరు? అంటూ రేవంత్ ప్రభుత్వం బుల్డోజర్ పాలనపై సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చలు జరుగుతున్నాయి. హైడ్రాతో చెరువుల సంరక్షణ ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతుంటే.. అసలు కూల్చివేతలతో భయాబ్రాంతులకు గురిచేస్తున్న హైడ్రా తీరు సరైనదేనా? అనే ప్రశ్నలను నగరవాసులు లేవనెత్తుతున్నారు. విశ్వనగరంగా ఎదగాల్సిన మహానగరంలో చెరువుల పరిరక్షణ పేరిట కూల్చివేతలతో ప్రతిష్ఠ దిగజారిపోతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వివాదాస్పదంగా కూల్చివేతలు

400 ఏండ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ లేక్ సిటీగా పేరు గాంచించింది. దేశంలో ఏ నగరంలో లేనన్ని గొలుసుకట్టు చెరువులు, కుంటలతో భాగ్యనగరం నిండిపోయింది. రాజుల కాలంలోనే ఇంటర్ లింకేజీ వాటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్, చెరవుల వ్యవస్థను నిర్మించారు. పెరిగిన జనాభా, రాకెట్ వేగంతో విస్తరించిన హైదరాబాద్ నగర పరిధి, పట్టణీకరణతో వందల చెరువులు, కుంటలు నిర్వీర్యం అవుతున్నాయి. ఈ అంశాలేవీ పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలతోనే చెరువులకు పూర్వ వైభవం అన్నట్టుగా వ్యవహరిస్తున్న హైడ్రా తీరు వివాదస్పదంగా మారింది.

చెరువుల నిర్వీర్యంలో అసలేం జరిగింది?

చెరువుల ఆక్రమణలు ఐదేండ్లో.. పదేండ్లకిం దటో మొదలైనవి కావు. తరతరాలుగా నిర్వీ ర్యం అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాలన వైఫల్యమే ప్రధాన పాత్ర పోషించగా, అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల ఆక్రమణలు, పేదల నిర్మాణాలు ఉన్నాయి. ఉదాహరణకు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువుకు కనీసం ఐదారు ఇన్‌ఫ్లో చానల్స్ ఉంటాయి. చెరువు నిం డిన తర్వాత బయట కెళ్లిపోయేందుకు అవుట్ లెట్స్ ఉంటాయి. ఇదీ చెరువు వాస్తవ రూపం. చెరువు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరగానే ఎఫ్‌టీఎల్ ఏర్పడుతుంది. కానీ ఎఫ్‌టీఎల్ భూము ల్లో ఇప్పుడు నిర్మాణాలు జరిగాయి. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణ కార్యకలాపాలతో చెరువులోకి వచ్చే ఇన్‌లెట్స్ దెబ్బతిన్నాయి.

కూల్చివేతలతో సంరక్షణ సాధ్యమేనా?

మూసీ రివర్ ఫ్రంట్ నుంచి మొదలుకుంటే, దుర్గం చెరువు పరీవాహక ప్రాంతంలో అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వరకు విస్తరించిన అర్బనైజేషన్ కొత్తగా జరిగింది కాదు. హైడ్రా నివేదిక ప్రకారం నగరంలో ఉన్న 52 చెరువులు 60 శాతానికిపైగా నిర్మాణాలతో ఉన్నాయి. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చినవే, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ధ్రువీకరించినవే. హైడ్రా ద్వారా కూల్చివేతలతోనే చెరువుల సంరక్షణ సాధ్యమా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. చెరువుల ఇన్‌లెట్స్, అవుట్‌లెట్స్‌ను పునరుద్ధరించకుండా, పూడికను తీయకుండా కేవలం నిర్మాణాలను కూలిస్తే చెరువుల నీటినిల్వ పెరుగుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

పరీవాహక ప్రాంతాల్లో పేదలే ఎక్కువ

సబర్మతి తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును చేపడతామని ప్రభుత్వం చెప్తున్నది. కానీ సబర్మతి నది ఆధునీకరణలో ఎంతమంది నిరాశ్రయులయ్యారు? ఎంతమంది సొంత గూటిని కోల్పోయారనే విషయం కూడా చర్చించాలి. మూసీ వెంబడి నివాసం ఉండేవారిలో మెజార్టీ జనాలు నిరుపేద, మధ్యతరగతివారే. ఇటీవల సున్నం చెరువు ఆక్రమణలను కూల్చివేసిన సందర్భంలో ఓ నిరుపేద కుటుంబం నివసించే అవకాశమే కోల్పోయింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనే. ఇలాంటి సమస్యలను పరిష్కరించకుండా నేరుగా హైడ్రా బుల్డోజర్లను పేదల ఇండ్లపై దింపితే చెరువులు, నదులు, కుంటలకు పూర్వ వైభవం ఎలా సాధ్యం అవుతుంది? ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో బస్తీ నిర్మూలన కార్యక్రమాలపై వందల కేసులు సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ అలాంటి పరిస్థితి రావొద్దంటే వారికి పునరావాసం కల్పించి బఫర్ జోన్‌లో ఉండే నిర్మాణాలను కూల్చితేనే మూసీకి పూర్వ వైభవం సాధ్యం.

అర్బన్ ఫ్లడింగ్ మాటేంటి?

భవిష్యత్తులో పొంచి ఉన్న అర్బన్ ఫ్లడింగ్‌ను పరిష్కరించే మార్గాల అన్వేషణ ఎందుకు జరగడం లేదు? అన్నది మరో కీలక ప్రశ్న. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కూడా ప్రత్యేక సూచనలు, ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ అవేవి పట్టనట్టు హైడ్రా కూల్చివేతలతో అర్బన్ ఫ్లడింగ్ నిరోధించగలుగుతారా? అంటే ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. అర్బన్ ఫ్లడింగ్ ప్రభావాన్ని నియంత్రించేలా ప్రత్యేక స్టామ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. అలా కాకుండా కూల్చివేతలతోనే పరిష్కారం ఎలా దొరుకుతుందని సోషల్ మీడియాలో విస్తృత స్థాయిలో ప్రశ్నలు, చర్చోపచర్చలు నడుస్తున్నాయి.

హడావుడి చేసి.. వదిలేసి!

రాంనగర్ మణెమ్మ గల్లీలో హైడ్రా అధికారుల తీరిది

హైదరాబాద్ సిటీబ్యూరో/ముషీరాబాద్, సెప్టెంబర్ 15: హైదరాబాద్‌లో ఇప్పటి వరకు 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా తెలిపింది. ఆ కూల్చివేతలు చేపట్టిన చోట పరిరక్షణ చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇటీవల రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలోని ఓ ఇంటికి సమీపంలో నాలా ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించి 20 రోజుల క్రితం భవనాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. కానీ భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించలేదు. ఇదే అదనుగా పక్కనే ఉన్న భవన యజమాని.. కూల్చివేతలు జరిగిన స్థలంలో ఒకటి, రెండు ఫీట్లు జరిగి తాత్కాలిక రేకులు ఏర్పాటు చేశారు. మణెమ్మ గల్లీలో కూల్చివేతలు చేపట్టి 20 రోజులవుతున్నా వ్యర్థాలను తొలగించలేదు. ఓ భవనం గోడకు రంధ్రం చేసి వదిలేశారు. భవనం మొత్తాన్ని కూల్చేస్తామన్న టౌన్‌ప్లానింగ్, హైడ్రా పత్తాలేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టి తీసుకెళ్లినా స్పందించటం లేదని స్థానికురాలు లక్ష్మీబాయి వాపోయారు. డ్రైనేజీ పైపులైన్‌పైనే వ్యర్థాలను పోయడంతో మొత్తం బ్లాక్ అయ్యి సంపుల్లోకి మురుగు నీరు వస్తున్నదని హైడ్రా తీరుపై మరో స్థానికురాలు శారద అసహనం వ్యక్తం చేశారు.

వైద్య సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : టీజీజీడీఏ కార్యవర్గం ఎన్నిక షెడ్యూల్‌ను ఆదివారం అసోసియేషన్ విడుదల చేసింది. హైకోర్టు అనుమతితో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్లు జీఎం మొహియుద్దీన్, న్యాయపతి ప్రశాంత్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నట్టు పేర్కొంది. నేడు నోటిఫికేషన్ విడుదల చేసి 19 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 20న నామినేషన్ల పరిశీలన అనంతరం జాబితాను విడుదల చేయనున్నారు. 29న కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది.

ఎన్‌పీఏ వార్షికోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గర్గ్ అకాడమీలోని వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళి అర్పించారు. 1948 సెప్టెంబరు 15న రాజస్థాన్‌లోని మౌంట్‌అబూలో సెంట్రల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ స్థాపించారు. అయితే, ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు వచ్చే వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు దానిని 1975లో హైదరాబాద్‌కు మార్చారు. అప్పుడే వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీగా నామకరణం చేశారు.

జూరాలపై మరో పెనుభారం

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఉన్నది రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు తీరు. ఇప్పటికే ఉన్న ఆయకట్టుకు అవసోపాలు పడుతున్న జూరాల ప్రాజెక్టుపై కొడంగల్ లిఫ్ట్ పేరిట మరో భారాన్ని మోపుతున్నది. భీమా పథకంలో ప్రతిపాదిత ఆయకట్టు మొత్తానికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరు ఇవ్వకున్నా కూడా పొదుపు పేరిట జలాల్లో కోత విధించడం కొసమెరుపు. మరోవైపు రాజీవ్‌భీమా ఆయకట్టు కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడింది. ట్రిబ్యునల్ ఎదుట కొట్లాడి నికర జలాలను సాధించాల్సింది పోయి, సొంత నియోజకవర్గం కోసం వేరొక ప్రాజెక్టులోని నికరజలాల్లోనే కోత విధించే దుర్మార్గానికి సర్కారు తెగబడింది.

జూరాలపై మరో పెనుభారం

జూరాల ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ 17.84 టీఎంసీలను కేటాయించింది. ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వచ్చే సమయానికే దాని గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుత లైవ్ కెపాసిటీ 6.8 టీఎంసీలు మాత్రమే. వాస్తవాలు తెలిసినా.. తక్కువగా నీటినిల్వ ఉన్న చోటు నుంచి ఆయకట్టుకు నీరిచ్చే పరిస్థితి ఉండబోదని నెత్తినోరు బాదుకుంటున్నా ఉమ్మడి రాష్ట్ర ఏలికలు కుట్రపూరితంగా, కృష్ణాజలాలు తెలంగాణకు దక్కకుండా చేసేందుకు జూరాల ప్రాజెక్టును ఆధారంగా చేసుకునే అనేక ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించారు. రాజీవ్‌భీమా స్టేజ్ 1, స్టేజ్ 2, కోయిల్‌సాగర్, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలను జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచే చేపట్టారు. మొత్తంగా ఒక్క జూరాల ప్రాజెక్టుపై ఆధారపడి ఇప్పటికే 5.48లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ ఆయకట్టుకే యాసంగిలో నీరందించలేని దుస్థితి. కేవలం ఒకే పంటకే నీరందిస్తున్నారు.

10వేల నుంచి 15వేల ఎకరాలకు పెంపు..

కృష్ణా డెల్టాకు ట్రిబ్యునల్ -1 దాదాపు 183 టీఎంసీలను చారిత్రక రక్షణల కింద కేటాయించింది. డెల్టా కాల్వల ఆధునీకీకరణ వల్ల 29 టీఎంసీల మేరకు మిగులు ఏర్పడుతున్నదని చెప్పి అందులో 9 టీఎంసీలను పులిచింతల ప్రాజెక్టుకు కేటాయించింది. ప్రాజెక్టు కింద ఒక టీఎంసీకి 10వేల ఎకరాలకు నీరందించేలా మొత్తంగా 2.03 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయించారు. జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ భీమా ప్రాజెక్టును ప్రారంభించినా రాష్ట్ర ఏర్పాటు నాటికి పనులేమీ పూర్తికాలేదు. కేసీఆర్ హయాంలో పూర్తయ్యాయి. భీమా ఆయకట్టు రైతులకు చెందాల్సిన 7.33 టీఎంసీల జలాల్లో 7.11 టీఎంసీలను నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కేటాయించడం గమనార్హం.

భీమా ఆయకట్టు ప్రశ్నార్థకమే?

రాజీవ్‌భీమా ఎత్తిపోతల పథకాన్ని రెండు స్టేజ్‌లుగా చేపట్టారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌పై రామన్‌పాడు వద్ద పంచదేవపాడు గ్రామం వద్ద ఒకటి, ఊకచెట్టి వాగు ప్రాజెక్టుపై 2వ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా దీర్ఘకాలికంగా కరువు పీడిత మక్తల్, మాగనూరు, ఆత్మకూర్, నర్వ, చింతకుంట, దేవరకద్ర, కొత్తకోట, పెద్దమందడి, మహబూబ్‌నగర్ జిల్లాలోని పెబ్బబైర్, పాన్‌గల్, వీపనగండ్ల, కోడేరు, కొల్లాపూర్ మండలాల్లోని తదితర మెట్ట ప్రాంతాల్లోని మొత్తం 2లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. ప్రస్తుతం 1.58లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఇంకా 40వేల ఎకరాలకుపైగా నీరందించాల్సి ఉంది. ఇదిలా ఉంటే భీమా ప్రాజెక్టు మొత్తంలో నీటినిల్వకు భూత్పూర్, సంగంబండ, రంగసముద్రం, శంకరసముద్రం రిజర్వాయర్లు ఉండగా, వాటి మొత్తం నిల్వసామర్థ్యం 8.3టీఎంసీలే. భీమా స్కీమ్‌లో ప్రధానమైన, మొదటిదయిన భూత్పూర్ రిజర్వాయర్ (1.3టీఎంసీలు) నుంచే ప్రస్తుతం నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టారు. ఈ రిజర్వాయర్ నుంచే 7టీఎంసీల జలాలను తరలించాలే ప్రణాళికలను రూపొందించారు.

ప్రాజెక్టు	నీటికేటాయింపులు	ప్రాజెక్టుకింద నీటినిల్వసామర్థ్యం	ప్రతిపాదిత ఆయకట్టు	ప్రస్తుతం సాగునీరు అందుతున్నది
జూరాల	17.33టీఎంసీలు	9.66 టీఎంసీలు	100000	100000
రాజీవ్‌భీమా	20	8.32	1,98,600	1,58,000
నెట్టెంపాడు	22 (వరద జలాలు)	5.19టీఎంసీలు	200000	1,42,000
కోయిల్‌సాగర్	3.5	1.50	50,000	30,000
మొత్తం	62.83	24.67	5,48,000	3,40,000
నారాయణపేట్ కొడంగల్	7.23	3	100000	000

(నోట్: సాగునీరు కాకుండా ఆయా ప్రాజెక్టుల కింద మిషన్‌భగీరథ నీటి కేటాయింపులు కూడా ఉన్నాయి)

ఇదీ కేసీఆర్ దార్శనికత..

ఉమ్మడి పాలకుల వివక్ష మూలాన కోల్పోయిన నీళ్లను ఒడిసిపట్టేందుకు స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రాజెక్టుల రీఇంజినీరింగు చేపట్టారు. కృష్ణాబేసిన్‌లో చాలా వరకూ అన్ని లిఫ్టు స్కీంలు కావడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉంచుకోవాల్సిన అవసరం మరింతగా ఉందని చెప్పడమే కాదు.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. రిజర్వాయర్లలో సాధ్యమైనంత నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచుతూ రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టారు. జూరాలపై ఉన్న భారాన్ని గుర్తించి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇంటేక్ పాయింట్‌ను ఏడాది పొడవునా నీటినిల్వలు ఉండే శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌కు మార్చారు. ఇక పీఆర్ ఎల్ఐఎస్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యాన్ని 67.97టీఎంసీలు పెట్టారు. ప్రస్తుత రేవంత్ సర్కారుకు ఆ సోయి లేకుండా జూరాలపైనే మరో ప్రాజెక్టును చేపట్టడం గమనార్హం. దీనిపై సాగునీటిరంగ నిపుణులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతలపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వైద్యులందరికీ ప్రత్యేక ఐడీలు

- ఎన్ఎంఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఎన్ఎంసీ వెల్లడి



న్యూఢిల్లీ: నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఇటీవల ప్రారంభించిన పోర్టల్‌లో వైద్యుల నమోదు ప్రక్రియను ప్రారంభించింది. దేశంలో ప్రాక్టీస్ చేయడానికి అర్హులైన ఎంబీబీఎస్ వైద్యులందరూ ఇందులో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా నమోదు చేసుకున్న వారికి విశిష్ట గుర్తింపు ఐడీని కేటాయిస్తారు. నేషనల్ మెడికల్ రిజిస్టర్(ఎన్ఎంఆర్) అనేది ఒక డైనమిక్ డాటాబేస్. ఇందులో వైద్యుల ప్రామాణికతను ఆధార్ ద్వారా ధ్రువీకరిస్తారు. రిజిస్ట్రేషన్‌కు ఎన్ఎంఆర్ సిద్ధంగా ఉన్నదని, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్ఎంపీలు) అందరూ తక్షణమే ఇందులో నమోదు చేసుకోవాలని ఎన్ఎంసీ కార్యదర్శి డాక్టర్ బి శ్రీనివాస్ తెలిపారు. ఇండియన్ మెడికల్ రిజిస్టర్ (ఐఎంఆర్) వద్ద నమోదుచేసుకున్న ఎంబీబీఎస్ వైద్యులు కూడా ఎన్ఎంఆర్‌లో మరోమారు రిజిస్టర్ చేసుకోవాలని నోటీస్ జారీ అయ్యింది. దీని ప్రకారం, పోర్టల్‌లో వైద్యులకు సంబంధించిన సమాచారం కొంత ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుంది. 'హెల్త్ కేర్ ప్రొవైడర్ రిజిస్ట్రీ' లోనూ వైద్యులు చేరేందుకు ఆప్షన్‌ను తీసుకొచ్చారు. 'దేశంలో ఇప్పటివరకు ఎంతమంది అర్హులైన వైద్యులున్నారు? విదేశాలకు వెళ్లినవారెంత మంది? డాక్టర్‌గా లైసెన్స్ కోల్పోయిన వాళ్లెంత మంది? సమగ్రమైన డాటా అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో ఎన్ఎంఆర్ పోర్టల్‌ను తీసుకొచ్చారు. దాదాపు 13 లక్షల మంది వైద్యుల డాటా పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది' అని ఎన్ఎంసీ అధికారి ఒకరు చెప్పారు.

వెరిఫికేషన్ అయ్యాకే ఐడీ జారీ

ఆధార్ ఐడీ, ఎంబీబీఎస్ డిగ్రీ సర్టిఫికెట్ డిజిటల్ కాపీ, ఎంసీఐ లేదా రాష్ట్ర స్థాయి స్టేట్ మెడికల్ కౌన్సిల్ జారీచేసిన సర్టిఫికెట్‌లను రిజిస్ట్రేషన్ సమయంలో వైద్యులు సమర్పించాల్సి ఉంటుంది. వైద్యుడు సమర్పించిన పత్రాలను సంబంధిత స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు పంపి ధృవీకరిస్తారు. దరఖాస్తులోని వివరాలు సరైనవా?కావా? అన్నది సంబంధిత వైద్య కాలేజీకి పంపి నిర్ధారిస్తారు. వివరాలన్నీ సరైనవేనని తేలాక.. దరఖాస్తు తిరిగి ఎన్ఎంసీకి చేరుతుంది. అటు తర్వాత ఎన్ఎంసీ నుంచి సదరు వైద్యుడికి విశిష్ట గుర్తింపు 'ఎన్ఎంఆర్ ఐడీ' జారీ అవుతుంది.

సీఎం పదవి నాకే ఇవ్వాలి

- హర్యానా బీజేపీ సీనియర్ నేత అనిల్ విజ్
- ఎన్నికలకు ముందే కమలం పార్టీలో పోటీ
- సైనీకే మద్దతు ప్రకటించిన పార్టీ అధిష్ఠానం



అంబాల: వచ్చే నెల 5న హర్యానాకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అధికార బీజేపీకి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అనిల్ విజ్ షాకిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ కనుక తిరిగి అధికారంలోకి వస్తే, సీఎం పదవి తనకే ఇవ్వాలన్నారు. అయితే హర్యానాలో గెలిస్తే నాయబ్ సింగ్ సైనీయే తిరిగి సీఎం అవుతారని ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ క్రమంలో అనిల్ విజ్ ఆదివారం మాట్లాడుతూ 'ఇప్పటివరకు నేను అధిష్ఠానాన్ని ఏమీ అడగ లేదు. అంబాల, రాష్ట్ర ప్రజలు నా దగ్గరకొచ్చి ఇంత సీనియర్ అయి ఉండి మీరెందుకు సీఎం కాలేదని అడుగుతున్నారు. ప్రజల డిమాండ్, నా సీనియారిటీ ఆధారంగా ఈసారి నేనే సీఎంని అవుతా' అని అన్నారు. తనను సీఎంగా చేయడం పార్టీ ఇష్టమని.. ఒక వేళ సీఎంను చేస్తే హర్యానా తలరాత, ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తానని అన్నారు.

నాయబ్ సింగే సీఎం అభ్యర్థి

హర్యానాలో బీజేపీ విజయం సాధిస్తే ప్రస్తుత సీఎం నాయబ్ సింగ్ సైనీయే మరోసారి ముఖ్యమంత్రి అవుతారని హర్యానా పార్టీ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. అనిల్ విజ్ ప్రకటనను ఉద్దేశించి మాట్లాడుతూ ఒక పార్టీ నేతగా ఆయన అలా మాట్లాడి ఉండవచ్చన్నారు.

కేజ్రీ 'ముందస్తు' వ్యూహం!

- రెండ్రోజుల్లో రాజీనామా చేయనున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి సంచలన ప్రకటన
- మహారాష్ట్రతో పాటే ఢిల్లీ శాసనసభకూ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- రెండు, మూడు రోజుల్లో పార్టీ సమావేశం
- కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై నిర్ణయం
- భార్యను సీఎం చేసేందుకు డ్రామా: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల్లో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నదని, కానీ.. నవంబర్‌లో మహారాష్ట్రతో పాటే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఆయన రాజీనామా ప్రకటన చేసినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. 'నిర్దోషులుగా నిరూపించుకొనేవరకు నేను సీఎంగా, మనీశ్ సిసోడియా డిప్యూటీ సీఎం పదవి చేపట్టబోం. కొత్త సీఎం ఎంపికపై రెండు, మూడు రోజుల్లో పార్టీ సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో అధికారం చేపట్టేందుకు బీజేపీ కుట్రలు చేసింది. పార్టీని ముక్కలు చేసేందుకు నన్ను జైలుకు కూడా పంపారు. కానీ, ఎన్ని ఎత్తులు వేసినా పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రాజ్యాంగాన్ని కాపాడేందుకు నేను ఇన్ని రోజులు రాజీనామా చేయలేదు. జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడిపించకూడదు అని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించింది. నాకు బీజేపీ ముఖ్యం కాదు. ప్రజలే ముఖ్యం' అని వెల్లడించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అడుగుతానని, తాను నిర్దోషిని అని నమ్మితే ప్రజలు ఓట్లు వేసి ఆప్‌ను గెలిపించాలని కోరారు. ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని స్పష్టంచేశారు.

బీజేపీయేతర సీఎంలకు నా విజ్ఞప్తి

'ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు సాక్షాత్తు భగవంతుడే మాతో ఉండి ముందుకు నడిపించాడు. దేవుడిచ్చిన ధైర్యంతో ప్రత్యర్థులతో పోరాడాం. మన నాయకులు సత్యేంద్ర జైన్, అమానతుల్లా ఖాన్ ఇప్పటికీ జైల్లోనే ఉన్నారు. వారు కూడా త్వరలోనే బయటకు వస్తారని ఆశిస్తున్నా' అని కేజ్రీవాల్ తెలిపారు. 'బీజేపీయేతర సీఎంను గద్దె దించేందుకు వాళ్లు కొత్త ఆటలు ఆడుతున్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. సీఎంలందరికీ నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. మీపై కేసులు నమోదు చేసినా రాజీనామా చేయొద్దు' అని విన్నవించారు.



ఆప్ కార్యకర్తల సమావేశంలో మంత్రులతో కలిసి పాల్గొన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకేనా?

ఆప్ నేతలపై అక్రమ కేసులు బనాయించి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నదనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆప్ భావిస్తున్నది. తద్వారా ప్రజల సానుభూతి పొందాలని యోచిస్తున్నది. ఫిబ్రవరిలో ఎన్నికలకు వెళితే ఆప్ నేతల అరెస్టు ప్రభావం పెద్దగా కనిపించదని భావించే.. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని కేజ్రీవాల్ యోచిస్తున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

కేజ్రీవాల్‌వి పీఆర్ స్టంట్లు: బీజేపీ

కేజ్రీవాల్ తన భార్య సునీతను సీఎం చేసేందుకు ఈ ప్లాన్ వేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పునావాలా మాట్లాడుతూ.. కేజ్రీవాల్‌వి పీఆర్ స్టంట్లు అని, ఎమోషనల్ కార్డును వాడుతున్నారని విమర్శించారు. 'సీఎం హోదాలో ఎలాంటి అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కాబట్టే ఆయన రాజీనామా కార్డును వాడుతున్నారు. ఢిల్లీ ప్రజలకు ఆప్ అవినీతి అర్థమైంది. కేజ్రీవాల్ సోనియాను ఫాలో అవుతున్నారు. అప్పట్లో మన్మోహన్‌సింగ్‌ను ముందుంచి.. తెరవెనుక సోనియా నడిపించారు. అదేవిధంగా, తనకు ఓటు వేయరని తెలిసి కేజ్రీవాల్ రాజీనామా నాటకం ఆడుతున్నారు' అని బీజేపీ నేత ప్రదీప్ భండారీ ఆరోపించారు.

ఢిల్లీ తదుపరి సీఎం ఎవరు?

పరిశీలనలో పలువురు మంత్రుల పేర్లు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: మరో రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ స్థానంలో పార్టీ ఎవర్ని నియమిస్తుందన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లాట్, గోపాల్ రాయ్ పేర్లను ఆప్ పరిశీలిస్తున్నట్టు మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. .



సునీత కేజ్రీవాల్ : కేజ్రీవాల్ అరెస్టుతో ఆప్ నుంచి కీలక నేతగా తెరపైకి వచ్చారు. ఇండియా కూటమి సమావేశాల్లో వివిధ పార్టీల నాయకుల్లో ఒకరిగా నిలబడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున చురుకుగా ప్రచారం పాల్గొన్నారు.

ఆతిశీ: ఆక్స్‌ఫర్డ్‌లో మాస్టర్స్ చేశారు. ఆర్థికం, ప్రజా పనులు, విద్యా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఢిల్లీలో ప్రాథమిక విద్యను మెరుగు పర్చటంలో కీలక పాత్ర పోషించారు.

సౌరభ్ భరద్వాజ్: ఆరోగ్య మంత్రిగా ఉన్నారు. సీఎం పదవికి బలమైన పోటీదారుగా ఆయన పేరు వినిపిస్తున్నది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కెరీర్ మొదలుపెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు.

గోపాల్ రాయ్: పర్యావరణం, సాధారణ పరిపాలన మంత్రిగా ఉన్నారు. విద్యార్థి సంఘం మాజీ నాయకుడిగా పార్టీ వ్యవహారాల్లో గట్టి పట్టు సాధించారు. పార్టీలో, ప్రభుత్వంలో ప్రభావశీల వ్యక్తిగా కొనసాగుతున్నారు.

కైలాశ్ గెహ్లాట్: న్యాయశాఖ, ఐటీ, రెవెన్యూ, ప్లానింగ్ తదితర శాఖల మంత్రిగా ఉన్నారు. సీఎం కేజ్రీవాల్‌కు విశ్వసనీయ వ్యక్తిగా మంత్రి కైలాశ్ గెహ్లాట్‌కు పేరుంది.

ఇనాక్టివ్ జీమెయిల్ ఖాతాల తొలగింపు

- వ్యక్తిగత అకౌంట్లు మాత్రమే
- 20 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: రెండేండ్ల నుంచి ఇనాక్టివ్‌గా ఉన్న వ్యక్తిగత జీమెయిల్ ఖాతాలను సెప్టెంబర్ 20 నుంచి తొలగించాలని గూగుల్ నిర్ణయించింది. సర్వర్ నిర్వహణను ఆప్టిమైజ్ చేయడానికి దీనిని అమలు చేయనుంది. అయితే కేవలం వ్యక్తిగత జీమెయిల్ అకౌంట్లకే దీన్ని వర్తింపజేయనుంది.ఈ-మెయిల్ పంప డం లేదా చదవడం, గూగుల్ ఫొటోస్‌లో ఫొటో అప్‌లోడ్ చేయడం లేదా షేర్ చేయడం, యూట్యూబ్ వీడియో చూడటం, గూగుల్ డ్రైవ్‌ను ఉపయోగించడం లేదా దాని ద్వారా సెర్చ్ చేయడం ద్వారా తొలగింపును తప్పించు కోవచ్చు.

ఇన్సులిన్ నిరోధకతకు

హార్మోన్ చికిత్స

మెనోపాజ్ మహిళలకు ఉపశమనం

న్యూయార్క్, సెప్టెంబర్ 15: హార్మోన్ చికిత్సతో ఇన్సులిన్ నిరోధకతను గణనీయంగా తగ్గించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. రుతు క్రమం ఆగిన(మెనోపాజ్) మహిళల్లో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గిపోవడం వల్ల వారు ఇన్సులిన్ నిరోధకత సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారు. అమెరికాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడిసిన్, రీడింగ్ హాస్పిటల్ టవర్ హెల్త్ పరిశోధకుడు డాక్టర్ జియాంగ్ మాట్లాడుతూ కొత్త మెటా పద్ధతిలో చేసిన ఈ అధ్యయనంలో ఆరోగ్యవంతులైన మెనోపాజ్ మహిళల్లో ఇన్సులిన్ నిరోధకత గణనీయంగా తగ్గిందని తెలిపారు.

కేరళలో నిఫా కలకలం

మలప్పురంలో ఒకరి మృతి

మలప్పురం: కేరళలోని మలప్పురంలో ఈ నెల 9న మరణించిన 24 ఏళ్ల యువకునికి నిఫా వైరస్ సోకినట్లు ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఈ వ్యక్తి మరణానంతరం ప్రాంతీయ వైద్యాధికారి నిర్వహించిన దర్యాప్తులో నిఫా వైరస్ గురించి అనుమానం వచ్చిందన్నారు. వెంటనే నమూనాలను పరీక్షల కోసం పంపించామని చెప్పారు. కొజికోడ్‌లో నిర్వహించిన పరీక్షల్లో నిఫా వైరస్ పాజిటివ్ అని నిర్ధారణ అయిందని వివరించారు. పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కూడా ఇది నిఫా వైరస్ ఇన్ఫెక్షన్ అని ఆదివారం ధ్రువీకరించింది. మృతుని స్వస్థలం మలప్పురం. ఆయన స్నేహితులతో కలిసి బెంగళూరులో కొన్ని రోజులు గడిపారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ప్రాణాలు కోల్పోయారు.

అందుబాటులోకి మరో 6 వందేభారత్ రైళ్లు

రాంచీ: దేశంలో మరో ఆరు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. జార్ఖండ్, ఒడిశా, బీహార్, యూపీల నుంచి నడిచే ఈ రైళ్లను ప్రధాని మోదీ ఆదివారం రాంచీ విమానాశ్రయం నుంచి వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. వాస్తవానికి ఈ రైళ్లను ఆయన టాటానగర్ స్టేషన్ నుంచి ప్రారంభించాల్సి ఉన్నా వాతావరణం అనుకూలించక ఆయన హెలికాప్టర్ బయలుదేరలేదు. ఈ కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు టాటానగర్-పాట్నా, బ్రహ్మపూర్-టాటానగర్, రూర్కెలా-హౌరా, డియోఘర్-వారణాసి, భాగల్పూర్-హౌరా, గయా-హౌరా రూట్లలో నడుస్తాయి. డియోఘర్, వారణాసి, కాళీఘాట్, బెలూర్ మఠం (కోల్‌కతా) తదితర పుణ్యస్థలాలకు వెళ్లేందుకు ఈ రైళ్లు ఎంతో ఉపయోగపడతాయని రైల్వే శాఖ తెలిపింది.

త్వరలోనే జనగణన

- కులగణనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- కేంద్ర వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: నాలుగేండ్ల క్రితం మొదలవ్వాల్సిన దేశ జనాభా లెక్కల ప్రక్రియపై మోదీ సర్కార్ ఎట్టకేలకు కసరత్తు మొదలుపెట్టింది! జనగణన ప్రక్రియ త్వరలో ప్రారంభించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తున్నదని సంబంధిత వర్గాలు ఆదివారం మీడియాకు తెలిపాయి. పౌరుల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు 'రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్' కార్యాలయం 31 ప్రశ్నలను సిద్ధం చేసింది. అయితే.. దీంట్లో కులం అనే కాలమ్ ఉంటుందా? లేదా? అన్నదానిపై కేంద్రం ఎటూ తేల్చుకోలేకపోతున్నదని సమాచారం! దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. మనదేశంలో 1881 నుంచి ప్రతి పదేండ్లకోసారి దేశవ్యాప్తంగా జనాభా లెక్కల్ని సేకరిస్తున్నారు. దీని ప్రకారం జనగణనలో తొలి దశ 2020 ఏప్రిల్ 1న మొదలుకావాలి. కొవిడ్ కారణంగా కేంద్రం పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనాభా లెక్కలతో ముడిపడి ఉందన్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ బిల్లును ఆమోదించిన తర్వాత చేపట్టిన తొలి జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తును పూర్తిచేయాల్సి ఉంటుంది. అటు తర్వాత చట్టసభల్లో మూడింట ఒకవంతు స్థానాల్ని మహిళలకు రిజర్వ్ చేస్తారు. సబ్సిడీ పథకాల అమలుకు 2011 జనాభా లెక్కలను కాకుండా, తాజా గణాంకాల్ని తీసుకొని పథకాల్ని అమల్లోకి తేవాలని వివిధ రాజకీయ పార్టీలు గట్టిగా కోరుతున్నాయి.

మోదీ 3.0లోనే జమిలి!

కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ: 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' విధానాన్ని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే అమలు చేసే అవకాశం ఉన్నది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, జమిలి ఎన్నికలకు పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తుందని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ఏర్పాటైన ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకుంది. మిగిలిన పదవీ కాలం పూర్తయ్యే వరకు మిత్ర పక్షాల మద్దతు ఇదే విధంగా కొనసాగుతుందని బీజేపీ విశ్వాసంతో ఉన్నది. ఓ మీడియా సంస్థ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుత ఎన్డీయే పదవీ కాలంలోనే 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' సంస్కరణలను అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మోదీ ప్రసంగంలో కూడా దీనిని ప్రస్తావించారు. పదే పదే ఎన్నికలు జరుగుతుండటం వల్ల దేశ ప్రగతికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలకు దేశం ముందుకు రావాలన్నారు.

కోవింద్ కమిటీ ఏం చెప్పిందంటే?

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ కూడా దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని సిఫారసు చేసింది. మొదట లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను 100 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 18 రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయని కోవింద్ కమిటీ చెప్పింది. వీటిలో చాలా సవరణలకు రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు. కేవలం పార్లమెంటు ఆమోదిస్తే సరిపోతుంది. లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, శాసనసభలు, పురపాలక సంఘాలు, పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హంగ్ హౌస్ ఏర్పడినపుడు లేదా అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందినపుడు ఐక్యతా ప్రభుత్వాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని చెప్పవచ్చు.

రాహుల్ గాంధీ నం.1 ఉగ్రవాది

కేంద్రమంత్రి బిట్టు

భాగల్పూర్: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నంబర్ వన్ ఉగ్రవాది అని కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఆరోపించారు. ఆదివారం మీడియతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారత్‌లోని సిక్కుల పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేర్పాటువాదుల మద్దతు ఇప్పుడు రాహుల్‌కు లభించిందని, సిక్కులకు వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలను వేర్పాటువాదులు, మోస్ట్ వాంటెడ్ పర్సన్స్ ప్రశంసిస్తున్నారని చెప్పారు. అందువల్ల ఆయన మన దేశానికి నంబర్ వన్ టెర్రరిస్ట్ అని, కాబట్టి ఆయనను పట్టుకున్నవారికి బహుమతి ప్రకటించాలన్నారు. బిట్టు వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది.

ప్రధాని పదవికి ఆఫర్!

- విపక్ష నేత ఒకరు అడిగితే నేనే తిరస్కరించా
- కేంద్రమంత్రి గడ్కరీ
- మోదీజీకి సందేశం పంపేందుకే ఈ వ్యాఖ్యలు
- శివసేన యూబీటీ నేత ప్రియాంక చతుర్వేది



నాగ్‌పూర్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ప్రధానమంత్రి పదవిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆ పదవికి పోటీపడితే మద్దతిస్తామంటూ గతంలో ఓ ప్రతిపక్ష నేత నుంచి ఆఫర్ వచ్చిందని, కానీ ప్రధాని పదవిని చేపట్టడం తన ఆశయం కానందున ఆ ఆఫర్‌ను తిరస్కరించానని తెలిపారు. నాగ్‌పూర్‌లో శనివారం జర్నలిజం అవార్డుల కార్యక్రమంలో ప్రసంగిస్తూ గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నాకు ఓ సంఘటన గుర్తున్నది. నేను ఎవరి పేరునూ చెప్పను. మీరు ప్రధానమంత్రి కావాలనుకుంటే మద్దతిస్తాం అని ఆ వ్యక్తి చెప్పారు. దీంతో మీరు నాకు ఎందుకు మద్దతివ్వాలి? మీ మద్దతును నేను ఎందుకు స్వీకరించాలి? అని నేను ప్రశ్నించా. ప్రధానమంత్రి కావడమే నా జీవితాశయం కాదు. నేను నా విశ్వాసానికి, నా సంస్థకు విధేయుడిని. ఆ విషయంలో నేను రాజీపడను. ఏదైనా పదవి కంటే నా విశ్వాసమే నాకు ముఖ్యమైనది' అని చెప్పారు. అయితే ఆ సంభాషణ ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో జరిగిందో గడ్కరీ చెప్పలేదు.

గడ్కరీ నాటకం అద్భుతం : ప్రియాంక చతుర్వేది

ప్రధాని పదవికి పోటీపడితే మద్దతిస్తామంటూ గతంలో ఓ ప్రతిపక్ష నేత నుంచి ఆఫర్ వచ్చిందని గడ్కరీ ప్రకటించడంపై శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది ఘాటుగా స్పందించారు. దేశ ప్రధాని కావాలన్న సొంత కోర్కెను వ్యక్తం చేసేందుకే గడ్కరీ ఈ ప్రకటన చేశారని, తద్వారా తన కోర్కెను తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సందేశాన్ని పంపారని ఆమె పేర్కొన్నారు. 'నితిన్ జీ.. ప్రతిపక్షాలను అడ్డం పెట్టుకుని మీరు ఆడిన నాటకం అద్భుతంగా ఉన్నది. దేశాన్ని నడిపించగలిగే సమర్థ నాయకులు ఇండియా కూటమిలో ఎంతో మంది ఉన్నారు. బీజేపీ నుంచి నాయకులను అరువు తెచ్చుకోవాల్సిన అగత్యం మాకు పట్టలేదు' అని ప్రియాంక చతుర్వేది 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఐదేండ్లలో 5 వేల నకిలీ వీసాలు


- రూ.300 కోట్ల అక్రమార్జన
- ఢిల్లీలో ముఠా గుట్టు రట్టు

న్యూఢిల్లీ: నకిలీ వీసాలు తయారు చేస్తున్న ఒక ముఠా గుట్టును ఢిల్లీ పోలీసులు రట్టుచేశారు. ఐదుగురు సభ్యుల ఈ ముఠా గత ఐదేండ్లుగా 5 వేల నకిలీ వీసాలు తయారు చేసి 300 కోట్లు ఆర్జించిందన్న విషయం తెలిసి పోలీసులు విస్తుపోయారు. ఈ నెల 2న ఢిల్లీ ఎయిర్‌పోర్టులో నకిలీ వీసాతో స్వీడన్ వెళ్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేయగా, ఈ నకిలీ వీసా తయారీ ముఠా గుట్టు రట్టయ్యింది. తొలుత బల్బీర్ సింగ్, జస్వీందర్ సింగ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తిలక్‌నగర్‌లోని ఒక ఫ్యాక్టరీలో మనోజ్ మోంగా అనే వ్యక్తి వీటిని తయారు చేస్తున్నట్టు వారు తెలిపారు. పోలీసులు ఫ్యాక్టరీపై దాడి చేసి మనోజ్ మోంగాను అరెస్టు చేశారు. ముఠా సభ్యులు ప్రతినెలా 30 నుంచి 60 నకిలీ వీసాలు తయారు చేస్తారు. వీసాల స్టిక్కర్‌ను 20 నిమిషాల్లో తయారు చేయడం విశేషం. ప్రతి నకిలీ వీసాను రూ.8-10 లక్షలకు అమ్మేవారు. ఇలా గత ఐదేండ్లలో ఐదు వేల మందిని ఈ నకిలీ వీసాల ద్వారా విదేశాలకు పంపినట్టు వారు చెప్పారు.

రామజన్మభూమి పారిశుధ్య మహిళ పై

గ్యాంగ్‌రేప్

- సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఐదుగురు
- తొలుత కేసు నమోదు చేయని పోలీసులు
- వారం తర్వాత నమోదు.. ఐదుగురి అరెస్ట్
- నిందితులను కఠినంగా శిక్షించాలన్న అఖిలేశ్
- స్పందించని పోలీసులపై చర్యలకు డిమాండ్



అయోధ్య, సెప్టెంబర్ 15: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లాలో దారుణం చోటు చేసుకున్నది. రామాలయంలో పారిశుధ్య సిబ్బందిగా పనిస్తున్న మహిళపై ఐదుగురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. బీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అయిన బాధితురాలి కథనం ప్రకారం.. అయోధ్య జిల్లా సహదత్‌గంజ్‌కు చెందిన వాన్ష్ చౌదరి ఆమెకు గత నాలుగేండ్లుగా స్నేహితుడు. ఆగస్టు 16న అతడు ఆమెను ఒక గెస్ట్‌హౌస్‌లోకి తీసుకువెళ్లి అక్కడే నిర్బంధించాడు. కొద్ది సేపటి తర్వాత వాన్ష్, మరో ఇద్దరు కలిసి ఆమెపై లైంగిక దాడి చేశారు. తర్వాత వారు మరో ముగ్గురిని పిలవటంతో వారు కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. తర్వాత ఆమెను గెస్ట్‌హౌస్ నుంచి బన్వీర్‌పూర్ బ్యారేజ్‌కు తీసుకువెళ్లి అక్కడ మరోసారి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆగస్టు 18న ఆమెను విడిచిపెట్టారు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఆమె సోదరితో పాటు కుటుంబ సభ్యులను చంపేస్తామంటూ బెదిరించారు. అక్కడితో ఆమె కష్టాలు తీరిపోలేదు. ఆగస్టు 25న సైతం ఆమెను రామజన్మభూమి ఆలయ మార్గంలో అడ్డుకున్న వాన్ష్, మరో ముగ్గురు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించి లైంగిక దాడికి యత్నించారు. అదే సమయంలో కారుకు చిన్న ప్రమాదం జరగడంతో ఆమె తప్పించుకుంది. ఆగస్టు 26న బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా వారు కేసు నమోదు చేసుకోలేదు. ఎట్టకేలకు సెప్టెంబర్ 2న కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ప్రధాన నిందితుడు వాన్ష్ సహా వినయ్, షరీక్, శివ, ఉదిత్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని, సకాలంలో స్పందించని పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి ఆవేదనకు సంబంధించి 13 సెకండ్ల క్లిప్‌ను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.

వరికి బదులు ఇతర పంటలతో

భూగర్భ జలాలు మెరుగు

ఐఐటీ గాంధీనగర్ పరిశోధకులు

న్యూఢిల్లీ: ప్రస్తుతం వరి పంటను పండిస్తున్న భూభాగంలో 40 శాతం భూమిలో దానికి బదులు ఇతర పంటలను పండించాలని పరిశోధకులు చెప్పారు. దీనివల్ల ఉత్తరాదిలో 2000 సంవత్సరం నుంచి కోల్పోయిన భూగర్భ జలాల్లో 60-100 క్యూబిక్ కిలోమీటర్ల భూగర్భ జలాలను పునరుద్ధరించవచ్చునని తెలిపారు. ఐఐటీ, గాంధీనగర్ పరిశోధకులు కూడా ఈ బృందంలో ఉన్నారు. భూమి వేడెక్కడం ఇదే విధంగా కొనసాగితే, ప్రస్తుత పంటల సాగు పద్ధతుల వల్ల 13-43 క్యూబిక్ కిలోమీటర్ల భూగర్భ జలాలను నష్టపోవలసి ఉంటుంది. వరి సాగుకు అత్యధికంగా భూగర్భ జలాలపైనే ఆధారపడతామనే సంగతి తెలిసిందే. పంటల సాగు పద్ధతులను మార్చడం రైతుల లాభదాయకత కూడా పెరుగుతుందని ఈ నివేదిక తెలిపింది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ మార్పులను అమలు చేయాలని సూచించింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ప్రభావం చెప్పుకోదగినంతగా ఉండదని ఈ పరిశోధకులు గుర్తించారు.

భర్త రోజూ స్నానం చేయడం లేదని విడాకులు

ఆగ్రా: యూపీలోని ఆగ్రాకు చెందిన ఓ భార్య తన భర్త రోజూ స్నానం చేయడం లేదని, తనకు విడాకులు ఇప్పించాలని పెండ్లయిన 40 రోజులకే కోర్టుకెక్కింది. తన భర్త ఒంటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నానని వాపోయింది. దీనిపై భర్త స్పందిస్తూ తాను సాధారణంగా నెలకు ఒకసారో, రెండుసార్లో స్నానం చేస్తానని చెప్పాడు. అధికారుల కౌన్సిలింగ్ ఇవ్వడంతో పరిశుభ్రంగా ఉండటానికి అతడు అంగీకరించాడు. అయినా కలిసి ఉండటానికి అతడి భార్య విముఖత వ్యక్తం చేసింది.

జీఆర్‌ఎల్ ఎప్పుడిస్తారు?

- 8 నెలలుగా గురుకుల అభ్యర్థుల ఎదురుచూపులు
- 90 రోజుల్లో వెల్లడిస్తామని చెప్పి ఇప్పటికీ ట్రిబ్ మౌనం
- ఆర్టీఐలో దరఖాస్తు చేసినా సమాధానం చెప్పని వైనం
- తప్పులను కప్పిపుచ్చుకునేందుకేనని అభ్యర్థుల అనుమానం
- జీఆర్‌ఎల్, మార్కులను వెంటనే ప్రకటించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురుకుల ఉద్యోగం కోసం పరీక్ష రాసిన అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలు ఆ ఉద్యోగాలకు వారు ఎందుకు ఎంపిక కాలేదో ఇప్పటికీ తెలియడం లేదు. ఈ రాత పరీక్షను నిర్వహించిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) ఇప్పటివరకు జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్‌ఎల్)ను ప్రకటించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. వారు ఎక్కడ ఎలాంటి పొరపాట్లు చేశారో? ఏ కారణం వల్ల ఉద్యోగాలు రాలేదో తెలియక మథనపడుతున్నారు. జీఆర్‌ఎల్‌ను ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నప్పటికీ ఏ రిక్రూట్‌మెంట్ బోర్డులోనూ లేనివిధంగా మొత్తం నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకూ ప్రకటించబోమని ట్రిబ్ తేల్చిచెప్తుండటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. దీంతో పారదర్శకతను పాటించడమంటే ఇదేనా? అని అభ్యర్థులు నిలదీస్తున్నారు. ఇతర బోర్డులు పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తుంటే అందుకు విరుద్ధంగా ట్రిబ్ వ్యవహరిస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీఆర్‌ఎల్‌పై ఎందుకీ గోప్యత?

సాధారణంగా రాతపరీక్షకు సంబంధించి తొలుత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానిస్తారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు సంబంధించి 1:1 నిష్పత్తిలో జాబితాను ప్రకటిస్తారు. ఆ సందర్భంగా పోస్టుకు ఎంపికైన అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, రాతపరీక్షలో సాధించిన జనరల్ ర్యాంకు, అభ్యర్థికి వచ్చిన మార్కులను ప్రకటిస్తారు. నియామక పత్రాలను అందించిన తర్వాత మొత్తంగా ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు, రాతపరీక్షలో వారికి వచ్చిన మార్కులు, ఓవరాల్‌గా సాధించిన జనరల్ ర్యాంకులు, ఏ రిజర్వేషన్ క్యాటగిరీలో పోస్టులకు ఎంపికయ్యారు? తదితర వివరాలన్నింటి జాబితాను బోర్డు సైట్‌లో పొందుపరుస్తారు. కానిస్టేబుళ్ల నియామకాల కోసం ఇటీవల పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాతపరీక్షను నిర్వహించింది. ఆ వెంటనే ఫలితాలతోపాటు దాదాపు లక్షల మంది అభ్యర్థుల జీఆర్‌ఎల్ జాబితాను ప్రకటించింది. గ్రూప్-4 పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ కూడా ఇదే విధానాన్ని పాటించింది. ఇవే కాకుండా అన్ని రిక్రూట్‌మెంట్ బోర్డులు సైతం అభ్యర్థుల తుదిఫలితాలతోపాటు జీఆర్‌ఎల్‌ను వెంటనే ప్రకటిస్తున్నాయి. 2018, 2019లో ట్రిబ్ సైతం ఈ విధానాన్ని పాటించింది. కానీ, ఇటీవల చేపట్టిన నియామకాలకు సంబంధించిన జీఆర్‌ఎల్‌ను మాత్రం నెలలు గడుస్తున్నా బహిర్గతం చేయడం లేదు. ప్రస్తుతం భర్తీ చేసిన పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు మినహా మిగతా పోస్టులకు సంబంధించిన అభ్యర్థులకు ఆ వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించలేదు. డీఎల్ పోస్టులకు సంబంధించి పేపర్-1, డెమో మార్కులను మాత్రమే అభ్యర్థుల ఐడీలో వెల్లడించింది. పేపర్-2 మార్కులను మాత్రం ఇప్పటికీ ప్రకటించలేదు. అదేవిధంగా జేఎల్, పీజీటీ పోస్టులకు సంబంధించి పేపర్-1, పేపర్-2, డెమో మార్కులను ప్రకటించినప్పటికీ పేపర్-3 మార్కులను ఐడీల్లో పొందుపరచలేదు. ఇక టీజీటీకి సంబంధించిన 3 పేపర్లలో ఒక్క పేపర్ మార్కులను కూడా అభ్యర్థుల వ్యక్తిగత ఐడీల్లో పొందుపరచకుండా పూర్తి గోప్యతను పాటిస్తున్నది.

అక్రమాలు బయటపడతాయనేనా?

గురుకుల పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం మొదలుకొని ఆ తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్, డెమోల నిర్వహణ వరకు ఏ ఒక్క అంశంలోనూ ట్రిబ్ పారదర్శకత పాటించలేదని అభ్యర్థులు గత 9 నెలల నుంచి ఆరోపిస్తున్నారు. ఒకే రోజులో అర్ధరాత్రి వరకు హడావుడిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించడంతో అనేక తప్పులు దొర్లాయని నిప్పులు చెరుగుతున్నారు. ఈ నియాకమ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇప్పటికే ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జేఎల్ బోటనీ, జువాలజీ, టీజీటీ, పీజీటీకి చెందిన అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం ఆయా కేసుల విచారణ కొనసాగుతున్నది. జీఆర్‌ఎల్‌ను ప్రకటిస్తే కేసుల సం ఖ్య మరింత పెరగవచ్చని, అందుకే వ్యక్తిగత ఐడీల్లో మార్కులను ప్రకటించేందుకు ట్రిబ్ జంకుతున్నదని తెలుస్తున్నది.

సిటీ గస్తీ.. పోలీసుల కుస్తీ

- నేడు మిలాద్ ఉన్ నబీ.. రేపు గణేశ్ నిమజ్జనం, ప్రజాపాలన, తెలంగాణ విమోచన దినోత్సవాలు
- కత్తి మీద సాములా మారిన హైదరాబాద్ బందోబస్తు
- రెండు రోజులు నిరంతరంగా పోలీసుల పహారా
- సిబ్బందికి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ దిశానిర్దేశం


పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం ఫైనల్ డేకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ సారి సోమవారం మిలాద్ ఉన్ నబీ, మంగళవారం నిమజ్జన శోభాయాత్ర ఉండగా, 17న ప్రభుత్వం ప్రజాపాలన అంటూ పబ్లిక్ గార్డెన్‌లో, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవమంటూ పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దీంతో 48 గంటల పాటు హైదరాబాద్ పోలీసులు కంటిమీద కునుకులేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుంది. నిమజ్జనాన్ని ప్రశాంత వాతవారణంలో నిర్వహించడం పోలీసులకు కత్తి మీద సాముగా మారింది. గత ఏడాది మిలాద్ ఉన్ నబీ, గణేశ్ నిమజ్జనం ఒకే రోజు వచ్చినా పోలీస్ వ్యవస్థ ముందుచూపుతో వ్యవహరించి రెండు పండుగలు ఒకే రోజు కాకుండా చర్యలు తీసుకున్నది. అయితే ఈ సారి కూడా అలాంటి పరిస్థితే ఉన్నా.. అదనంగా సెప్టెంబర్ 17 వచ్చింది. కేంద్రం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమాలకు కేంద్రమంత్రులు, బీజేపీ శ్రేణులు హాజరవుతాయి. ప్రజాపాలనకు సీఎం హాజరయ్యే అవకాశాలున్నాయి. దీంతో అన్ని కార్యక్రమాలకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నది. నిమజ్జనాలు బుధవారం ఉదయం వరకు జరిగే అవకాశాలుంటాయి. దీంతో సోమవారం ఉదయం పోలీసుల పహారా మొదలైతే.. బుధవారం ఉదయం వరకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

48 గంటలు అప్రమత్తం: సీవీ ఆనంద్

సిటీ పోలీసులు బందోబస్తులో ఫైనల్ ఫేజ్‌లోకి వచ్చేశారని, ఇక 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలంటూ డీసీపీ, ఎస్‌హెచ్‌లో, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో సీపీ సీవీ ఆనంద్ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఆదివారం రాత్రి నుంచే మిలాద్ ఉన్ నబీ ప్రారంభమవుతుంది. 17న నిమజ్జనంతో పాటు పబ్లిక్ గార్డెన్స్, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించటాన్ని చాలెంజ్‌గా తీసుకోవాలి. మిక్స్‌డ్ కమ్యూనిటీ ఉన్న ప్రాంతాలలో బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బందిని పెంచాలి. ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్‌తో క్షేత్రస్థాయిలో జరిగే ఘటనలను తెలుసుకుంటూ అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. క్రిటికల్ జంక్షన్స్, క్రాస్‌రోడ్స్‌లో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలి. బషీర్‌బాగ్ చౌరస్తా, ఎంజే మార్కెట్‌లో చాలా కీలకం. కమ్యూనికేషన్ సిస్టం బాగుండాలి. చెకింగ్స్, సోషల్‌మీడియా మానిటరింగ్, షీ టీమ్స్ పకడ్బంధీగా విధులు నిర్వర్తించాలి. డ్రోన్ కెమెరాలు, మౌంటెడ్ కెమెరాలు, కెమెరా మౌంటెడ్ వాహనాలను ఏర్పాటుచేస్తున్నాం' అని వివరించారు. 19న జరిగే మిలాద్ ఉన్ నబీ ర్యాలీపైనా సీపీ సిబ్బందితో మాట్లాడారు. సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్‌మాన్, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గుట్ట' ప్రసాద విక్రయాలకు
క్యూఆర్ కోడ్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రసాదాన్ని మరింత పాదర్శకతతో విక్రయించే ప్రక్రియను దేవస్థానం ఆదివారం ప్రారంభించింది. గతంలో మ్యానువల్ టికెట్ పద్ధతికి స్వస్తి పలుకుతూ కంప్యూటరైజ్డ్ టికెట్‌తో పాటు క్యూఆర్ కోడ్ పద్ధతిని అమలు చేస్తున్నది. దీనికి సంబంధించిన ట్రయల్ రన్ కొనసాగుతున్నది. ప్రస్తుతం ఉదయం సమయంలో విక్రయించే దద్దోజనం, కట్టె పొంగలి, కేసరి బాత్ ప్రసాదాలకు మాత్రమే మ్యానువల్ టికెట్లతో విక్రయిస్తున్నారు. రూ.30 లడ్డూలు, రూ.150 అభిషేకం లడ్డూ, పులిహోర, వడ, మిల్లెట్ లడ్డూలను క్యూఆర్ కోడ్ కలిగిన కంప్యూటరైజ్డ్ టికెట్లతో విక్రయాలు చేపట్టారు. కొండపైన శివాలయం ఎదురుగా టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదాల కంప్యూటరైజ్డ్ టికెట్లను విక్రయిస్తున్నారు. భక్తులు క్యూఆర్ కోడ్ కలిగిన టికెట్‌తో ప్రసాద కౌంటర్ల వద్దకు వెళ్లాలి. అక్కడ కౌంటర్‌లో దేవస్థాన సిబ్బంది టికెట్‌ను స్కాన్ చేస్తే.. ఎన్ని రకాల ప్రసాదాలు, వాటి సంఖ్య వివరాలు స్క్రీన్‌లో చూసి అందజేస్తున్నారు. మొత్తం 5 కౌంటర్లలో ఈ విక్రయాలు కొనసాగిస్తున్నారు.

తీరిన గడువు.. పూర్తికాని భూసేకరణ!

- ట్రిపుల్ ఆర్ భూసేకరణపై తొలగని ప్రతిష్ఠంభన
- ఉత్తర భాగంలో ఇంకా 20% సేకరణ మిగులు
- బలవంతంగా సేకరించేందుకు అధికారుల సన్నాహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం భూసేకరణ కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు ఆదివారంతో పూర్తయింది. కానీ, పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగానే ఉన్నది. ఆరు నెలల క్రితం నాటి పరిస్థితే నేటికీ కొనసాగుతున్నది. ఇంకా 20% భూమిని సేకరించాల్సి ఉన్నది. ఈ భూసేకరణకు జాతీయ రహదారుల శాఖ నోటిఫికేషన్ జారీచేసి చేతులు దులుపుకోవడం, రైతుల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత, కోర్టు కేసుల వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు. ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ హయాంలోనే ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలన్న పట్టుదలతో ఉన్నది. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తరచూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆగస్టులో గడువు నిర్దేశించారు. మొత్తం 348 కి.మీ. పొడవైన ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి దాదాపు 10 వేల ఎకరాల భూములు అవసరమవుతాయి. అందులో 158.65 కి.మీ. పొడవైన ఉత్తర భాగం నిర్మాణానికి సుమారు 4,600 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 3,500 ఎకరాలు మాత్రమే సేకరించారు. మిగిలిన 1,000 ఎకరాల్లో దాదాపు 200 ఎకరాలు అటవీ భూమి ఉండటంతో దానికి దీనికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూములు గుర్తించారు. మిగిలిన చోట్ల భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ధరకు మూడు రెట్లు అధికంగా చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధంగా ఉన్నప్పటికీ రైతులు ససేమిరా అంటున్నారు. ఈ ప్రతిష్ఠంభనను తొలగించేందుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ప్రభుత్వం అర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు, ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించిన ధరలకు పొంతన లేకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి ఇంకా 20% భూసేకరణ పెండింగ్‌లో ఉన్నదని, ఇది పూర్తయ్యాకే టెండర్ల ప్రక్రియ చేపడతామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు.

బలవంతంగా భూసేకరణకు యత్నాలు

ట్రిపుల్‌ఆర్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండటంతో నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్లు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. రైతులను సంతృప్తిపర్చడం సాధ్యంకాదని నిర్ధారణకు వచ్చిన అధికారులు.. చట్టంలో ఉన్న వెసులుబాటును ఆధారంగా చేసుకొని ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన రైతులకు మద్దతు తెలిపారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చుతామని అప్పట్లో వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారులు బలప్రయోగం ద్వారా భూసేకరణకు సన్నాహాలు చేస్తున్నారన్న వార్తలు రైతులకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి.

ఏపీలో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : అభియోగాలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధుల నుంచి సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్‌ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ ఉన్నారు. కాంతిరాణా, విశాల్ గున్నీపై ముంబైకి చెందిన నటి కాదంబరి జత్వానీని అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలుండగా, ఆంజనేయులు గత వైసీపీ ప్రభుత్వ హయా ంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.

తిరుమల భక్తులకు దళారీ టోకరా
వస్త్రాలంకార సేవ కల్పిస్తానని మోసం

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : వస్త్రాలంకార సేవల పేరుతో భక్తులను మోసగించిన దళారిపై తిరుమల రెండో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుమలలో ఓ దళారి తిరుమల ఆలయంలో వస్త్రాలంకార సేవ కల్పిస్తానని చెప్పి గుంటూరు జిల్లా పట్టాభిపురానికి చెందిన భక్తులతో రూ.7లక్షలకు ఒప్పం దం కుదుర్చుకున్నాడు. ముం దస్తుగా రూ.4లక్షలు వసూలు చేసి ఆ తర్వాత అదృశ్యమయ్యాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

ప్రవక్త బోధనలు ప్రపంచానికి దిక్సూచి
ముస్లింలకు సీఎం రేవంత్ మిలాద్ ఉన్ నబీ విషెస్

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): శాంతి, సోదర భావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటిచెప్పే మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి దిక్సూచి అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జన్మదినం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బంగారమే శ్రీరామరక్ష!



ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటి కోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టు కింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జిలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్న వారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

రాబడి



ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.

కొత్త పీపీఎఫ్ రూల్స్
అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా
లాభాలు, పరిమితులు తెలుసా?

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.



చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

మసీదుల్లో గణేశ్ నవరాత్రులు!

- 40 ఏండ్లుగా మసీదుల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన
- మహారాష్ట్రలోని గోటిఖిండీలో మత సామరస్యం
- వారిని చూసి మరికొన్ని గ్రామాలు ముందుకు
- నిమజ్జనం రోజున ఊళ్లన్నీ కలిసి భోజనాలు

ముంబై, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గణేశ్ నవరాత్రుల సందర్భంగా మహారాష్ట్రలోని కొల్హాపూర్, సాంగ్లీ జిల్లాలకు చెందిన కొన్ని గ్రామాల్లో హిందూ-ముస్లింల సౌభ్రాతృత్వానికి సంబంధించిన విశిష్ట సంప్రదాయాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి కొన్ని మసీదుల్లో 40 ఏండ్లకు పైగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగుతున్నది. 1982లో ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని ప్రస్తుత తరం ముందుకు తీసుకెళుతుంది. వివరాల్లోకి వెళ్తే.. సాంగ్లీ జిల్లా వాల్వా తాలూకాలో గోటిఖిండీ అనే గ్రామం ఉంది. ఇక్కడి జుజర్ ఖోలో ఉన్న మసీదులో ప్రతీ ఏడాది పది రోజుల పాటు న్యూ గణేశ్ మండలి వారు గణపతిని ప్రతిష్ఠిస్తారు. 44 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. గణపతి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో హిందూ, ముస్లింలు ఇక్కడికి వస్తుంటారు.



మహారాష్ట్రలోని గోటిఖిండీ గ్రామంలోని ఓ మసీదులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి పూజలు చేస్తున్న ముస్లింలు

ఎలా మొదలైందంటే..?

ఈ సంప్రదాయం ఎలా మొదలైందనే దాని వెనక ఆసక్తికరమైన కథను గోటిఖిండీ గ్రామానికి చెందిన అశోక్ పాటిల్ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ఒకసారి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఒకరోజు భారీ వర్షం కురిసింది. మండపం లేకపోవడంతో వర్షానికి వినాయకుడి విగ్రహం తడిచిపోయింది. గ్రామానికి చెందిన ఒక ముస్లిం వ్యక్తి ఆ దృశ్యాన్ని చూశారు. గణేశ్ మండలికి చెందిన భక్తులకు ఈ విషయం చెప్పారు. అప్పుడే నిజామ్ పఠాన్ అనే ఆయన వర్షంలో పూర్తిగా తడిచిపోయిన వినాయకుడి విగ్రహాన్ని దగ్గరలోని మసీదులో ఉంచాలని కోరారు. అక్కడున్న వారంతా ఆలోచించి, గణపతి విగ్రహాన్ని సమీపంలోని మసీదులో ఉంచారు. నిమజ్జనం వరకు ఆ ఏడాది వినాయకుడిని ఆ మసీదులోనే ఉంచి పూజలు చేశారు. 1961లో గోటిఖిండీ గ్రామంలో గణేశ్ ఉత్సవాలను మొదలుపెట్టిన బృందంలో అశోక్ పాటిల్ తండ్రి కూడా సభ్యుడు. 1986లో ఇదే గ్రామానికి చెందిన కొందరు యువకులు పొరుగున ఉన్న బావ్చీ గ్రామంలో గణేశ్ ఉత్సవాల కార్యక్రమాన్ని చూడటానికి వెళ్లారు. హిందూ, ముస్లిం వర్గాలకు చెందిన వారు ఆ కార్యక్రమంలో కలిసి పాల్గొనడాన్ని వారు గమనించారు. వారి స్ఫూర్తితో గ్రామంలోని మసీదులో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం మొదలుపెట్టారు. 1961లో గణపతి ఉత్సవాలను జరిపిన వారి తరవాత రెండో తరం వారు 1986లో గణేశ్ ఉత్సవాలను నిర్వహించారు. ఇప్పుడు మూడో తరం వారు కూడా ఈ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు గణపతి పండుగ సమయంలోనే బక్రీద్ పండుగ కూడా వస్తుండేది. ఆ సమయంలో ముస్లింలు మేకలను కోయడం, ఖుర్బానీ చేయడం వంటివి నిలిపివేసేవారు. గణపతి నిమజ్జనం తర్వాత ఊరంతా కలిసి భోజనాలు చేస్తారు. ఊళ్లోని పురుషులు, మహిళలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రతి రోజూ ఒక్కో కుటుంబం హారతి సేవలో పాల్గొంటుంది. రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు హారతి ఇస్తారు. 'రెండు వర్గాలకు చెందిన పూర్వీకులు తర్వాతి తరాలకు గొప్ప కీర్తిని వారసత్వంగా ఇచ్చారు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది' అని స్థానికుడు గణేశ్ థోరాట్ చెప్పారు.

కురుంద్వాడ్‌లోనూ..

కొల్హాపూర్ జిల్లాలోని కురుంద్ వాడ్‌లోని 5 మసీదుల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని కుదేంఖా బడేనల్ సాహెబ్ మసీదు, ఢపణపూర్ మసీదు, బైరాగ్దార్ మసీదు, శెల్కే మసీదు, కరకన్యా మసీదులలో వినాయకుడిని పెట్టారు. కురుంద్వాడ్ సంస్థానం కథ కూడా గోట్ ఖిండి తరహాలోనే ఉంటుంది. 1982 తర్వాతి ఏడాది నుంచి గ్రామంలోని 5 మసీదుల్లో గణపతి మండపాలను ఏర్పాటు చేయడం మొదలైంది. గ్రామానికి చెందిన పాతతరం పెద్దలు ఈ ఆచారాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని గణేశ్ థోరాట్ అన్నారు. 2018, 2019, 2020లలో గణపతి ఉత్సవాలు, మొహర్రం కలిసి వచ్చాయి. ఈ పండుగలను అక్కడి ప్రజలు కలిసిమెలిసి జరుపుకున్నారు. ఆ సమయంలో వినాయకుని మోదకాలు, పీరీలలో పంచే చోంగ్యా ప్రసాదం రెండూ కలిపి ప్రజలకు పంపిణీ చేసినట్టు జమీర్ పఠాన్ చెప్పారు.

క్షుద్రపూజలు చేస్తున్నారని ఐదుగురి హత్య

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మంత్ర విద్యలు ప్రదర్శిసున్నారని, క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఇక్కడి ఓ గ్రామంలో ఐదుగురు వ్యక్తులను తీవ్రంగా కొట్టి చంపేశారు. గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న సుక్మా జిల్లా ఇక్తాల్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుందని జిల్లా పోలీసులు తెలిపారు. ఇద్దరు దంపతులను, మరో మహిళను తీసుకొచ్చి దారుణంగా హింసించి, చంపేశారని, ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని జిల్లా పోలీసు అధికారి ఒకరు చెప్పారు. తాజా ఘటన రాష్ట్రంలో పెను సంచలనం రేపింది. మూడు రోజుల క్రితం ఇదే విధమైన ఘటన భాతపరా జిల్లాలో చోటుచేసుకుంది. చేతబడి చేస్తున్నాడని ఆరోపిస్తూ ఓ కుటుంబానికి చెందిన నలుగురిని కొంతమంది హత్య చేశారు.

లీకైన ఆయిల్ పట్టుకుంటుండగా పేలిన ట్యాంకర్

మిరాగోనే (హైతీ), సెప్టెంబర్ 15: ట్యాంకర్ ట్రక్కు నుంచి లీకవుతున్న ఆయిల్‌ను పట్టుకోవడానికి కొందరు పౌరులు ఎగబడ్డారు. అయితే అదే సమయంలో ఆ ట్యాంకర్‌కు నిప్పంటుకుని పేలుడు సంభవించింది. హైతీ దేశంలోని మిరాగోనే పట్టణంలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో 25 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద స్థలిని హైతియన్ ప్రధాని గ్యారీ కొనిల్లే సందర్శించారు. ప్రమాదస్థలి చాలా భయానకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. క్షతగాత్రులను హెలికాప్టర్ ద్వారా దగ్గరలోని దవాఖానలకు తరలించామని, అత్యవసర బృందాలు ప్రమాద స్థలిలో పనిచేస్తున్నాయని చెప్పారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు.



పొలాల్లో రైలు ఇంజిన్

న్యూఢిల్లీ: పొలాల మధ్యలో రైలు ఇంజిన్ కనిపించడంతో స్థానికులు, అధికారులు అవాక్కయ్యారు. అది అక్కడికి ఎలా వచ్చిందబ్బా! అని ఆశ్చర్యపోయారు. బీహార్‌లోని గయ జిల్లా, రఘునాథ్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. వజీర్‌గంజ్ స్టేషన్-కొల్హన హాల్ట్ మధ్యలో జరిగిన ఈ సంఘటనలో అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడలేదు. బోగీలు లేకుండా ఇంజిన్ మాత్రమే ప్రయాణించిందని, నియంత్రణ కోల్పోయి, పట్టాలు తప్పడంతో, పొలాల మధ్యలోకి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. స్థానికులు దీనిని ఆసక్తిగా గమనిస్తూ, ఫొటోలు తీసుకుని, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఇప్పుడు రైలింజన్లు భూమిని దున్నడానికి వస్తున్నాయని సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. రైల్వే రిలీఫ్ టీమ్ ఈ ఇంజిన్‌ను తిరిగి పట్టాలపైకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నది.

భయం వల్ల సమ్మతించిన మహిళతో సంబంధం అత్యాచారమే

అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్ : పురుషునితో లైంగిక సంబంధానికి మహిళ అంగీకరించినప్పటికీ, అటువంటి అంగీకారానికి కారణం ఆమె భయపడటం లేదా తప్పుడు తలంపు అయినట్లయితే, ఆ లైంగిక సంబంధం అత్యాచారమే అవుతుందని అలహాబాద్ హైకోర్టు చెప్పింది. పెండ్లి చేసుకుంటాననే సాకుతో అత్యాచారానికి పాల్పడినట్లు తనపై నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ రాఘవ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ కేసు 2018 డిసెంబరులో ఆగ్రా జిల్లాలో నమోదైంది. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటుపై ఆగ్రా జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరుగుతున్నది. రాఘవ్ కుమార్ మొదట బాధితురాలిని స్పృహలేకుండా చేసి, శారీరక సంబంధం పెట్టుకున్నాడని, ఆ తర్వాత పెండ్లి చేసుకుంటానని చెప్తూ ఆమెను అనేకసార్లు శారీరకంగా దోచుకున్నాడని ఈ ఛార్జిషీటులో ఆరోపించారు. రాఘవ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, వీరిద్దరూ సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం శిక్షణ పొందుతున్నారని, చాలా కాలం నుంచి పరస్పర సమ్మతితో శారీరక సంబంధం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇది ఐపీసీ సెక్షన్ 376 క్రిందకు వచ్చే అత్యాచార నేరం కాదని వాదించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, వీరిరువురి మధ్య సంబంధం మోసపూరితంగా ప్రారంభమైందని తెలిపారు. రాఘవ్ బలవంతం చేశాడని చెప్పారు. బాధితురాలి సమ్మతి లేదన్నారు. హైకోర్టు ఈ నెల 10న తీర్పు చెప్తూ, రాఘవ్ ప్రారంభంలో మోసపూరితంగా, భయపెట్టి సంబంధం పెట్టుకున్నాడని, ఇది ఐపీసీ సెక్షన్ 376 పరిధిలోకి వచ్చే నేరం అవుతుందని స్పష్టం చేసింది. తదనంతర కాలంలో పెండ్లి చేసుకుంటాననే హామీతో ఇరువురి మధ్య పరస్పర సమ్మతితో సంబంధం ఏర్పడినట్లు కనిపించినప్పటికీ, రాఘవ్ భయపెట్టడం వల్ల అటువంటి సమ్మతిని తెలిపినట్లుగా చెప్తున్నారని వివరించింది. ఈ నేపథ్యంలో ఈ కేసును రద్దు చేయాలనే పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

కోహ్లీ నా కెప్టెన్సీలో ఆడాడు!

తేజస్వీ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఒకప్పుడు నేనూ క్రికెట్ ఆటగాడ్నే, దేశవాళీ క్రికెట్‌లో నా కెప్టెన్సీలో విరాట్ కోహ్లీ ఆడాడు.. అంటూ ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం ఇండియా క్రికెట్ జట్టులో చాలామంది.. ఒకప్పుడు నా బ్యాచ్‌మెట్స్' అని 'ఎక్స్'లో ఆయన చేసిన పోస్ట్ వైరల్ అయ్యింది. 'ఢిల్లీ తరపున నా సారథ్యంలో విరాట్ కోహ్లీ ఆడాడు. కొంత కాలం విరాట్, నేను కలిసి ఆడాం. గాయాల కారణంగా క్రికెట్ నుంచి వైదొలగాల్సి వచ్చింది' అని 'ఎక్స్' పోస్ట్‌లో వివరించారు. 2009లో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌తో తేజస్వీ క్రికెట్ కెరీర్ ఆరంభమైంది. ఐపీఎల్ 2008 సీజన్‌కు 'ఢిల్లీ డేర్‌డెవిల్స్' తేజస్వీతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి చాలామందికి తెలియదు. అయితే తేజస్వీ యాదవ్ 2008 నుంచి 2012 వరకు ఒక్క గేమ్ ఆడకుండా కేవలం డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యాడు.

అసోంలో కోటి మొక్కల ఉద్యమం ఉధృతం

- 2030 నాటికి లక్ష్యం పూర్తి చేస్తాం
- తూర్పు హిమాలయాల్లో జీవవైవిధ్యమే లక్ష్యం
- గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్
- తముల్‌పూర్‌లో పద్మశ్రీ జాదవ్‌తో కలసి మొక్కలు నాటే కార్యక్రమం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసోం రాష్ట్రంలో 2030 నాటికి కోటి మొక్కలు నాటనున్నట్టు గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ వెల్లడించారు. అసోంలోని తముల్‌పూర్‌లో ఆదివారం గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, స్థానిక ఎమ్మెల్యే జోలెన్ దోయినరీతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నిరుడు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 2.5 లక్షల మొక్కలు నాటామని సంతోష్‌కుమార్ తెలిపారు. పద్మశ్రీ జాదవ్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. స్థానిక సంస్థలు, ఎన్జీవోల సహకారంతో 2030 నాటికి అసోంలో కోటి మొక్కలు నాటాలని నిర్ణయించినట్టు తెలిపారు. మజులీ ప్రాంతంలో జాదవ్ మొక్కలు నాటి అభివృద్ధి చేసిన మలైకోతాని తరహాలో మియావాకి విధానంలో చిక్కటి అడవుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తామని, తద్వారా తూర్పు హిమాలయాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడుతామని వివరించారు. ఇందుకు నవోదయ సంస్థ సహకారం తీసుకుంటామని చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ కృషి అభినందనీయమని పద్మశ్రీ జాదవ్ కొనియాడారు. కార్యక్రమంలో తముల్‌పూర్ జిల్లా కలెక్టర్ బికాస్ భగవత్, ఇగ్నైటింగ్ మైండ్స్ నుంచి రీతురాజ్ పుకాన్, నవోదయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



అసోంలోని తముల్‌పూర్‌లో పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, స్థానిక ఎమ్మెల్యే జోలెన్‌తో కలిసి మొక్క నాటుతున్న మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం వాగొడ్డురామన్నపల్లి వద్ద వర్షాలకు నాలాకు గండి పడగా సొంత డబ్బుతో పూడ్చుతున్న చేస్తున్న రైతులు

శ్రమదానం చేసి.. గండిని పూడ్చేసి

- ఇల్లందకుంట మండలంలో రైతుల శ్రమదానం
- వెంకటేశ్వర నాలాకు అన్నదాతల మరమ్మతులు

ఇల్లందకుంట సెప్టెంబర్ 15: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని వాగొడ్డురామన్నపల్లి, మల్యాల, కనగర్తి, లక్ష్మాజీపల్లి గ్రామాల రైతులకు సాగు నీరందించే వెంకటేశ్వర నాలాకు ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడింది. దీనికి మరమ్మతులు చేసేందుకు అధికారులెవ్వరూ ముందుకు రాకపోవడంతో రైతులే శ్రమదానం చేసి గండిని పూడ్చారు. వివరాల్లోకి వెళ్తే.. వాగొడ్డురామన్నపల్లి వద్ద గతంలో స్థానిక వాగుపై వెంకటేశ్వర నాలా నిర్మించారు. దీని కింద 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవలి వర్షాలకు నాలాకు గండి పడింది. దీంతో ఆయకట్టు కింద నీరు లేక పొలాలు ఎండిపోవడంతో రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో పంటలను బతికించుకోవడానికి మూడు గ్రామాలకు చెందిన 50 మంది రైతులు శ్రమదానం చేసి తాత్కాలికంగా గండిని పూడ్చారు. నాలా గండిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చేయాలని అయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిని హత్యచేసిన మావోయిస్టులు

ఇన్ఫార్మర్ నెపంతో ప్రజా కోర్టులో కర్రలతో కొట్టి దారుణ హత్య

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 15: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు మరో దారుణానికి ఒడిగట్టారు. సుక్మా జిల్లాలో ఇన్ఫార్మర్ నెపంతో ఓ ఉపాధ్యాయుడిని దారుణంగా హతమార్చారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ప్రాథమిక వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్‌గూండకు చెందిన ఉపాధ్యాయుడు దూది అర్జున్‌ను మావోయిస్టులు ఆయన ఇంటి నుంచి అపహరించారు. శనివారం ఆ గ్రామ సమీపంలో ప్రజాకోర్టు నిర్వహించిన మావోయిస్టులు.. అర్జున్‌పై కర్రలతో దాడి చేసి కొట్టి అతి దారుణంగా హత్య చేశారు. అర్జున్ పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో అతడిని దారుణంగా హత్య చేసిన మావోయిస్టులు.. అతడి కుటుంబీకులపై సైతం ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరికలు జారీ చేసినట్టు గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై జగర్‌గుండా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూర్యనాయక్ తండాలో ఇల్లు కూలి నిరాశ్రయులైన బాలు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న తండావాసులు

ఇల్లు కూలింది.. ఊరు సాయం చేసింది!

- కట్టుబట్టలతో రోడ్డున పడ్డా కనికరించని అధికారులు
- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు

శాయంపేట, సెప్టెంబర్ 15: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాత ఇల్లు నేలమట్టమైంది. దీంతో ఆ పేద కుటుంబం కట్టుబట్టలతో వీధినపడింది. సాయం చేస్తారనుకున్న అధికారులు ఒక్కరూ దయచూపలేదు. దీంతో బాధిత కుటుంబానికి తామున్నామంటూ ఆ ఊరి ప్రజలే అండగా నిలిచారు. ఈ ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూర్యనాయక్ తండాలో జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తండాలోని జుర్పుల బాలు పాత ఇల్లు నేలమట్టమైంది. కూతురు, కుమార్తె, భార్యతో కలిసి బాలు పాత పెంకుటింటిలో ఉంటూ రోజు కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. వానలకు తడిసిన ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు కూలడంతో ఇంట్లోని సామగ్రి, బట్టలతోపాటు ఇతర వస్తువులు పనికిరాకుండా పోయాయి. దీంతో నిలువ నీడ లేక గ్రామంలోని ఒకరి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఉన్న ఇల్లు కూలిపోయింది.. చేతిలో చిల్లిగవ్వ లేదు.. అధికారులు సాయం చేయాలని పలుమార్లు బాలుతోపాటు గ్రామస్థులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఎవరూ ఆదుకోలేదు. దీంతో తండాలోని యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ పెద్దలు మానవత్వంతో వారికి అండగా నిలిచారు. తలా కొంత వసూలు చేసి రూ.25 వేలు బాలు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ భూక్యా రమేశ్, మాజీ ఉప సర్పంచ్ వస్రం, మాజీ ఎంపీటీసీ రెడ్డినాయక్, సుమన్, రవీందర్, దేవ్‌సింగ్, సునీల్, బాష పాల్గొన్నారు.

గూడు చెదిరి.. ఆగిన గుండె

- మున్నేరు ముంచింది.. సర్కారు చేతులెత్తేసింది
- సాయం కోసం ఎదురుచూసి తీవ్ర ఆందోళన
- నష్టం భరించలేక గుండెపోటుతో కోటయ్య కన్నుమూత
- దహన సంస్కారాలకు బీఆర్ఎస్ నేతల ఆర్థిక సాయం
- ఖమ్మం జిల్లా కేంద్రంలో విషాదం



మృతుడు కోటయ్య సతీమణికి ఆర్థిక సాయం అందించి అతడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, స్థానిక మాజీ కార్పొరేటర్ తోట రామారావు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 15: ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌కు చెందిన దోరేపల్లి కోటయ్య (70) దశాబ్దాలుగా దానవాయిగూడెం పార్కు ఏరియాలోని గణేశ్‌నగర్‌లో ఓ రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన ఆయన.. వృద్ధాప్యం కారణంగా కొన్నేండ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా ఓ కొడుకు మరణించాడు. కుమార్తెకు వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. అవివాహితుడైన మరో కుమారుడు తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాడు. భార్య శాంతమ్మతో కలిసి కోటయ్య రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. తనకు వచ్చే రూ.2 వేల ప్రభుత్వ ఆసరా పింఛన్‌తోనే జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 31న వచ్చిన మున్నేరు వరద వీరి ఇంటిని ముంచెత్తింది. కోటయ్య, అతటి భార్య శాంతమ్మ ఆ రాత్రి కట్టుబట్టలతో బయటికెళ్లారు. తెలిసిన వారి ఇంట్లో కొద్దిరోజులు తలదాచుకున్నారు. వరద తగ్గాక ఇంటికి రావడంతో ఇంటి గోడలన్నీ పగుళ్లతో కనిపించాయి. బాత్‌రూం కూలిపోయింది. అతడి మోపెడ్ వాహనం బురదలో కూరుకుపోయింది. నిత్యావసర సరుకులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. వీరు వృద్ధాప్యంలో ఉన్నందున బంధువులు వచ్చి ఇంట్లోని బురదను శుభ్రం చేసి వెళ్లారు. సర్వస్వం కోల్పోయి తీవ్రమైన ఒత్తడికి గురైన కోటయ్య.. ఐదు రోజులుగా మనోవేదనతో ఉంటున్నాడు. గుండె సంబంధిత వ్యాధికి గురైనట్టు తెలిసింది. ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తరలించగా మూడురోజులపాటు చికిత్స పొందినట్టు సమాచారం. శనివారం డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నప్పటికీ ఇంటి పరిస్థితిపై ఆందోళన చెందాడు. ఆదివారం తీవ్రమైన గుండెపోటు రావడంతో కోటయ్య ప్రాణాలు వదిలాడని స్థానికులు, కటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాణం తీసింది : బీఆర్ఎస్ నేతలు

కోటయ్య మృతికి ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ కార్పొరేటర్, ప్రస్తుత కార్పొరేటర్ భర్త తోట రామారావు ఆరోపించారు. కోటయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన తోట రామారావు దహన సంస్కారాల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వరదలో మునిగిన కోటయ్య ఇల్లును పరిశీలించారు. వరదలు తగ్గి పక్షం రోజులైనా ఒక్క అధికారి గణేశ్‌నగర్‌లో పర్యటించలేదని మండిపడ్డారు. ఆర్థిక సాయం చేశామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు వాస్తవాలు తెలుసుకోవాలంటున్నారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

అన్నంలో పురుగులు వస్తున్నయ్!

గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

గన్నేరువరం, సెప్టెంబర్15: విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు వస్తున్నాయని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేశారు. 400 మంది బాలికలు ఉన్న ఈ పాఠశాలలో సమస్యలు పట్టించుకోకుండా అధికారులు ఏం చేస్తున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చుక్కల్ల శ్రీశైలం ప్రశ్నించారు. పురుగుల అన్నం తింటే తమ పిల్లల ఆరోగ్యం ఏం కావాలని తల్లిదండ్రులు మండిపడ్డారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఘటనపై ప్రిన్సిపాల్ నవీనను సంప్రదించగా.. రోజూ కూరగాయలు, బియ్యం శుభ్రం చేశాకే వంటచేస్తున్నట్టు తెలిపారు. ఇకముందు పురుగులు రాకుండా చూస్తామన్నారు.



కరీంనగర్ జిల్లా వీణవంకలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

వీణవంక, సెప్టెంబర్ 15: దళితుల ఆర్థికాభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి సంబంధించిన రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో వారు మీడియాతో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం మొదటి విడత నిధులు ఇచ్చి చాలా రోజులైందని, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు రెండో విడత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. దళితులు ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా, ధర్నాలు, నిరసనలు చేపట్టినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

• తాగునీటి కోసం.. ఖాళీ బిందెలతో నిరసన



కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా కాలనీలో తాగునీరు రావడం లేదని పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయమైన గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగారంను వివరణ కోరగా.. బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైపులు ధ్వంసమైనట్టు తెలిపారు. దీంతో వారం రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని, ఆదివారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసినట్టు పేర్కొన్నారు. – నస్రుల్లాబాద్

లాభాలు తేల్చేదెప్పుడు? వాటా ఇచ్చేదెప్పుడు?

- నిరుడు జూలై 6నే టర్నోవర్‌ను ప్రకటించిన సింగరేణి
- రూ.2,222 కోట్ల లాభాల్లో కార్మికులకు 32% వాటా
- దసరాకు 3 రోజుల ముందే రూ.711 కోట్లు జమ
- 2023-24 ముగిసి ఐదున్నర నెలలైనా తేలని లెక్కలు
- సర్కారు, యాజమాన్యం తీరుపై కార్మిక సంఘాల గుస్సా
- జీఎంల ఆఫీసుల ఎదుట 19న టీబీజీకేఎస్ ధర్నా



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రేయింబవళ్లు శ్రమించి నల్ల బంగారాన్ని వెలికితీస్తున్న సింగరేణి కార్మికుల్లో ఈ ఏడాది దసరా ఉత్సాహం కనిపించడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదున్నర నెలలు గడుస్తున్నా ఇంకా టర్నోవర్‌ను ప్రకటించని యాజమాన్యం.. దసరా సమీపిస్తున్నా లాభాల్లో కార్మికుల వాటాను తేల్చడం లేదు. దీంతో పండుగనాటికి లాభాల్లో వాటా వస్తుందో రాదోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసిన రెండుమూడు నెలల్లో యాజమాన్యం టర్నోవర్‌ను ప్రకటిస్తుంది. దసరాకు రెండు, మూడు వారాల ముందు లాభాల్లో కార్మికుల వాటాను ప్రకటించి, పండుగనాటికి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. కానీ, ఈసారి పండుగకు ఇంకో 3 వారాలే ఉన్నా టర్నోవర్ గానీ, లాభాల్లో వాటాగానీ తేల్చలేదు. దీంతో యాజమాన్యం, ప్రభుత్వ వైఖరిపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నిరుడు జూలైలోనే టర్నోవర్ ప్రకటన

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి యాజమాన్యం గత పదేండ్లలో క్రమం తప్పకుండా టర్నోవర్‌ను ప్రకటించి, లాభాల్లో కార్మికులకు వాటా పంచింది. నిరుడు జూలై 6న యాజమాన్యం టర్నోవర్‌ను ప్రకటించింది. రూ.33 వేల కోట్లకుపైగా టర్నోవర్ సాధించామని, రూ.2,222 కోట్ల లాభాన్ని ఆర్జించామని తెలిపింది. ఈ లాభాల్లో 32% వాటాను కార్మికులకు అందజేస్తున్నట్టు కేసీఆర్ ప్రభుత్వం దసరాకు దాదాపు 3 వారాల ముందుగానే అక్టోబర్ 7న ప్రకటించింది. పండుగకు 3 రోజుల ముందు రూ.711 కోట్లను కార్మికుల ఖాతాల్లో జమ చేసింది. సగటున ఒక్కొక్కరి ఖాతాలో రూ.1.70 లక్షలు జమ అయినట్టు కార్మికులు చెప్పన్నారు. కానీ, ఈ ఏడాది సింగరేణి పద్దుల లెక్కతేల్చడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో పండుగకు ఖాతాల్లో డబ్బులు పడతాయో లేదోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు కార్మిక సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు. రూ.37 వేల కోట్ల వ్యాపారం జరిగిందని, దాదాపు రూ.3 వేల కోట్ల లాభాలు వచ్చాయని చెప్తున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తి జరిగినందున ఈ ఏడాది లాభాల్లో కార్మికులకు కనీసం 35% వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పోరుబాటలో టీబీజీకేఎస్

ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఆదాయ వివరాలను ప్రకటించకపోవడంపై టీబీజీకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఆ వివరాలను ప్రకటించాలని ఇప్పటికే అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడంతో పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నది. ఈ నెల 19న సింగరేణిలోని అన్ని జీఎంల కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగుతామని టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. ఇది ఆరంభమేనని, ప్రభుత్వం, యాజమాన్యం దిగిరాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులను కంటికి రెప్పలా చూసుకున్నారని, దీనికి భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు గని కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు. పండుగకు రెండుమూడు రోజుల ముందే కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

ముందే ప్రకటించిన కోల్ ఇండియా

దేశంలో 85% బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కోల్ ఇండియా సంస్థ.. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల రోజుల్లోనే తమ పద్దుల లెక్కలు తేల్చింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,42,324 కోట్ల వ్యాపారం చేశామని, రూ.37,369 కోట్ల లాభాలు వచ్చాయని మే 2వ తేదీనే వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోని తొలి త్రైమాసికంలో సాధించిన ఉత్పత్తి, ఆదాయం వివరాలను సైతం జూలై 31నే ప్రకటించింది. మరో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ సైతం రూ.1,78,501 కోట్ల వ్యాపారంతో రూ.5,506 కోట్ల లాభాలు ఆర్జించినట్టు జూలై 27నే ప్రకటించింది. కానీ, సింగరేణి యాజమాన్యం మాత్రం 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదున్నర నెలలు గడిచినా ఇప్పటికీ ప్రకటించలేదు.

పద్మావతికి పదోన్నతి కల్పించే ఫైల్‌ను సమర్పించండి

- ఇంటర్ విద్య కమిషనర్ శ్రీదేవసేన ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతికి పదోన్నతి కల్పించే ఫైల్‌ను వెంటనే సమర్పించాలని ఇంటర్ విద్య కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. పద్మావతికి లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యవైఖరిని ఎండగడుతూ ఆదివారం 'అమరుడి భార్యకు అష్టకష్టాలు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఇంటర్ విద్య కమిషనర్.. పద్మావతి పదోన్నతికి సంబంధించి ఆదేశాలిచ్చారు.

గురుకుల సిబ్బందికి బదిలీ ఆర్డర్లు

ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్‌కు ఊరట

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని నాలుగో తరగతి సిబ్బందికి ఎట్టకేలకు బదిలీ ఆర్డర్లు వెలువడ్డాయి. 'బదిలీ అయినట్టా? కానట్టా?' శీర్షికన ఇటీవల 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులను జారీ చేశారు. బోధన సిబ్బంది బదిలీ ప్రక్రియ ముగిసిన 45 రోజుల అనంతరం తాజాగా వీరి బదిలీలకు అవకాశం కల్పించారు. సొసైటీ పరిధిలో నాలుగో తరగతి ఉద్యోగులైన జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్లు మొత్తం కలిపి దాదాపు 400 మందికి పైగా ఉన్నారు. బోధన సిబ్బందితోపాటు బదిలీ కోసం జూలై 31న కౌన్సిలింగ్ నిర్వహించారు. అయితే నెలన్నర రోజులు గడచినా అందుకు సంబంధించిన ఉత్తర్వులను సొసైటీ ఉన్నతాధికారులు వెలువరించలేదు. నమస్తే తెలంగాణ కథనంపై స్పందించిన సొసైటీ ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలను కలెక్టర్లకు పంపించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

- లైంగికదాడి బాధితురాలికి న్యాయం చేయాలి
- గంటకు పైగా గ్రామస్థుల ధర్నా, నిలిచిన రాకపోకలు



ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలి బంధువులు, పెరుకపల్లి గ్రామస్థులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 15: లైంగికదాడి బాధితురాలికి న్యాయం చేయాలని బాధితురాలి బంధువులు, గ్రామస్థులు ఆదివారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం పెరుకపల్లికి చెందిన 60 ఏండ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మూడు రోజులు దాటినా పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులు పట్టించుకోవడం లేదని జిల్లా ఎస్పీ శబరీశ్‌ను కలిసేందుకు వెళ్తున్న 200 మంది గ్రామస్థులను పోలీసులు తాళ్లపాడు వద్ద అడ్డగించారు. ఆగ్రహించిన గ్రామస్థులు వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నిందితుడు గ్రామంలో తిరుగుతూ సాక్ష్యం చెప్తే చంపుతానని బెదిరిస్తున్నాడని, అయినా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు. ఎస్సై జక్కుల సతీశ్ గ్రామస్థులతో మాట్లాడినప్పటికీ ఫలితం లేదు. దీంతో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. నిందితుడిని 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని తెలిపారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీని అమలుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరింది. ఆదివారం హైదరాబాద్ దోమల్‌గూడలోని కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి పాల్గొని.. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దుకింద వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్ టీచర్లు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తీర్మానాలు చేశారు.

ఇండియా 'ఏ' గెలుపు

రికీ భుయ్ పోరాడినా 'డీ'కి తప్పని ఓటమి • 'సీ' వర్సెస్ 'బీ' మ్యాచ్ డ్రా



అనంతపూర్: దులీప్ ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని ఇండియా 'ఏ' జట్టు తొలి గెలుపును రుచిచూసింది. అనంతపూర్ వేదికగా ఇండియా 'డీ'తో జరిగిన మ్యాచ్‌లో అగర్వాల్ సేన 186 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. 488 పరుగుల ఛేదనలో బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్ 'డీ' జట్టు.. ఆఖరి రోజు 301 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు బ్యాటర్ రికీ భుయ్ (113) శతకంతో పోరాడగా శ్రేయస్ (41), సంజూ శాంసన్ (40) రాణించారు. కానీ 'ఏ' బౌలర్లలో తనుష్ కొటియాన్ (4/73), శామ్స్ ములానీ (3/117) శ్రేయస్ సేనను నిలువరించారు. ఈ గెలుపుతో ఏడు పాయింట్లు సాధించిన 'ఏ' జట్టు ఫైనల్ ఆశలను నిలుపుకుంది. కాగా వరుసగా రెండు ఓటములతో 'డీ' జట్టు ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించినట్టే!

అన్షుల్ కంబోజ్‌కు 8 వికెట్లు



ఇండియా 'బీ', 'సీ' మధ్య జరిగిన మ్యాచ్ పేలవమైన డ్రా గా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో 'సీ' 525 పరుగుల భారీ స్కోరు చేయగా 'బీ' జట్టు 332 పరుగులకే ఆలౌట్ అయింది. 'సీ' బౌలర్ అన్షుల్ కంబోజ్ (8/69) ఏకంగా 8 వికెట్లు పడగొట్టాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన 'సీ'.. నాలుగో రోజు 128/4 పరుగులు చేసింది. దులీప్ ట్రోఫీలో మూడో దశ మ్యాచ్‌లు ఇదే వేదికపై ఈనెల 19 నుంచి మొదలవుతాయి.

హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రేసర్ అఖీల్‌కు ట్రోఫీ




చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న ఫార్ములా 4 ఇండియన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రేసర్ అఖీల్ అలీభాయ్ మరోసారి మెరిశాడు. చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన మూడో రౌండ్ నాలుగో రేసులో దక్షిణాఫ్రికాకు చెందిన అఖీల్.. రేసును 27 నిమిషాల 31.329 సెకన్లలో పూర్తిచేయడంతో అగ్రస్థానాన్ని దక్కించుకుని ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అంతకుముందు మిగిలిన మూడు రేసులకు గాను అతడు రెండింట్లో రన్నరప్‌గా నిలిచాడు. నాలుగో రేసులో అహ్మదాబాద్ అపెక్స్ రేసర్ డీవీ నందన్ (27 నిమిషాల 50.567 సెకన్లు) రెండో స్థానంతో సరిపెట్టుకోగా శ్రాచి బెంగాల్ టైగర్స్ రేసర్ రుహాన్ అల్వా (27 నిమిషాల 51.089 సెకన్లు) మూడో స్థానం సాధించాడు. మరోవైపు ఇండియన్ రేసింగ్ లీగ్ మూడో రౌండ్‌లో చెన్నై టర్బో రైడర్స్ జట్టు డబుల్ ధమాకా మోగించింది. తొలి రేసుతో పాటు రెండో రేసునూ ఆ జట్టు గెలిచింది.



స్లాన్ స్పోర్ట్స్ కె రహేజా మైండ్‌స్పేస్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్ కార్పొరేట్ చెస్ టోర్నీ ఉత్సాహంగా ముగిసింది. సుమారు 50 కంపెనీల నుంచి 150 మంది పాల్గొన్న ఈ టోర్నీలో ఆరుపాయింట్లు సాధించిన ఫణి కానూరి (కేర్లోన్) చాంపియన్‌గా నిలువగా అమర్‌నాథ్ (వెల్స్ ఫార్గో)కు రన్నరప్ ట్రోఫీ దక్కింది. సాయి కుమార్ (రియల్ పేజి), కార్తీక్ (ఏడీపీ) వరుసగా 3, 4 స్థానాల్లో నిలిచారు.

రన్నరప్ సహజ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: కరేబియన్ దీవులైన డొమినికన్ రిపబ్లిక్ లోని పుంట కానా వేదికగా జరిగిన డబ్ల్యూ35 టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలంగాణ యువ క్రీడాకారిణి సహజ యమలపల్లి డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీ మహిళల డబుల్స్‌లో సహజ–కులంబయేవ (కజకిస్థాన్) జోడీ.. 1–6, 7–5, 8–10తో అరియానా అర్సెనేల్ట్–కైలా క్రాస్ (కెనడా) చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. సింగిల్స్ విభాగంలో క్వార్టర్స్‌లోనే నిష్క్రమించిన సహజ డబుల్స్‌లో మాత్రం ఫైనల్‌కు చేరింది.

అన్మోల్ ఖర్బ్ సంచలనం



లెవన్ (బెల్జియం): భారత యువ టెన్నిస్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ తన తొలి సీనియర్ టోర్నీలోనే సంచలన ప్రదర్శన చేసింది. బెల్జియం వేదికగా జరుగుతున్న బెల్జియన్ ఇంటర్నేషనల్ 2024 టోర్నీలో భాగంగా తొలి రౌండ్‌లో 17 ఏండ్ల అన్మోల్.. 24–22, 12–21, 21–10తో ప్రపంచ 80వ ర్యాంకర్ అయిన అమలి స్కూల్జ్ (స్విట్జర్లాండ్)ను చిత్తు చేసింది. సీనియర్ టెన్నిస్‌లో 222వ ర్యాంకు కలిగిన అన్మోల్.. సీనియర్ విభాగంలో ఆడుతూ తొలి మ్యాచ్‌లోనే తనకంటే మెరుగైన ర్యాంకర్‌ను మట్టికరిపించి ముందంజ వేయడం గమనార్హం.

ప్రపంచ స్కేట్ గేమ్స్‌కు తెలంగాణ స్కేటర్లు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 18 నుంచి 24 దాకా ఇటలీలో జరిగే వరల్డ్ స్కేట్ గేమ్స్–2024లో తెలంగాణ యువ క్రీడాకారులు ధృవీ లఖోటియా, మోక్షిత్ రామ్‌రెడ్డి చోటు దక్కించుకున్నారు. ధృవీ స్కేట్‌బోర్డ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా మోక్షిత్ రోలర్ ఫ్రీస్టైల్‌లో బరిలోకి దిగనున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఈ గేమ్స్‌లో చోటు దక్కించుకున్నందుకు గాను కోచ్ జితేందర్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

నీరజ్‌కు రెండో స్థానం

ఒక్క సెంటిమీటర్ తేడాతో టైటిల్ కోల్పోయిన చోప్రా

చేతి గాయంతోనే బరిలోకి.. డైమండ్ లీగ్ ఫైనల్స్

మెగా ఈవెంట్లలో బరిలోకి దిగాడంటే పతకం పట్టుకురావడాన్ని అలవాటుగా మార్చుకున్న భారత 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా మరోసారి సత్తా చాటాడు. చాలాకాలంగా గజ్జల్లో గాయం వేధిస్తున్నా పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన ఈ స్టార్ జావెలిన్ త్రోయర్.. తాజాగా ఆ గాయానికి తోడు ఎడమ చేతి ఎముక విరిగినా డైమండ్ లీగ్ ఫైనల్స్ బరిలో నిలిచి రెండో స్థానంలో నిలిచాడు. తుదిపోరులో ఒకే ఒక్క సెంటిమీటర్ తేడాతో అగ్రస్థానాన్ని కోల్పోయినా.. ఏడాది పాటు నిలకడగా రాణించి 2024 సీజన్‌ను విజయవంతంగా ముగించాడు.



బ్రస్సెల్స్ (బెల్జియం) : భారత స్టార్ జావెలిన్ త్రోయర్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా వరుసగా రెండో ఏడాదీ డైమండ్ లీగ్ (డీఎల్) ఫైనల్స్‌లో రెండో స్థానంతో మెరిశాడు. డీఎల్ టైటిల్ పోరులో అతడు ఒకే ఒక్క సెంటిమీటర్ తేడాతో టైటిల్ కోల్పోవడం విచారకరం. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక బ్రస్సెల్స్ వేదికగా జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్.. బరిసెను 87.86 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. కొద్దిరోజుల క్రితమే పారిస్ వేదికగా ముగిసిన ఒలింపిక్స్‌లో రజతం సాధించిన నీరజ్.. డీఎల్ ఫైనల్స్‌లోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాడు. ఇదివరకే గజ్జల్లో గాయం వేధిస్తున్నా.. తుదిపోరుకు ముందు ఎడమ చేతి వేలికి గాయమైనా నొప్పిని ఓర్చుకుని ఫైనల్ బరిలో నిలిచిన నీరజ్ తనపై పెట్టుకున్న అంచనాలను వమ్ము చేయలేదు. పారిస్‌లో కాంస్య పతకం గెలిచిన గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 87.87 మీటర్ల దూరంతో అగ్రస్థానాన నిలిచి టైటిల్ దక్కించుకోగా జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ 85.97 మీటర్ల త్రో తో మూడో స్థానంలో నిలిచాడు.

తృటిలో టైటిల్ దూరం..

ఏడుగురు పోటీపడ్డ డీఎల్ ఫైనల్స్‌లో భాగంగా పీటర్స్ తన తొలి ప్రయత్నంలోనే బరిసెను 87.87 మీటర్లు విసిరాడు. నీరజ్ తన మొదటి త్రో (86.82 మీటర్లు)తో అతడికి దగ్గరిదాకా వచ్చినా ఆ మార్కును దాటలేకపోయాడు. రెండో ప్రయత్నంలో 83.49 మీటర్లే విసిరిన అతడు.. మూడో ప్రయత్నంలో మాత్రం పీటర్స్ త్రోకు అత్యంత సమీపంలోకి వచ్చాడు. ఇక ఆ తర్వాత మూడు త్రో లలోనూ అతడు జావెలిన్‌ను ఆశించిన స్థాయిలో విసరలేక రెండో స్థానంతోనే సరిపెట్టుకుని ఈ సీజన్‌ను ముగించాడు. తాజా ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచిన నీరజ్‌కు ప్రైజ్ మనీ కింద 12వేల యూఎస్ డాలర్లు (భారత కరెన్సీలో రూ. 10.06 లక్షలు) దక్కగా పీటర్స్‌కు డైమండ్ లీగ్ ట్రోఫీతో పాటు 30 వేల యూఎస్ డాలర్లు (రూ. 25.16 లక్షలు) దక్కాయి. ఏడాదంతా నిలకడగా రాణించిన నీరజ్‌కు డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో రెండో స్థానాన నిలవడం ఇది వరుసగా రెండోసారి. 2023లోనూ అతడు సెకండ్ ప్లేస్‌కే పరిమితమయ్యాడు. 2022లో మాత్రం టైటిల్ నెగ్గాడు.

గాయాలు వేధిస్తున్నా..



వరుసగా రెండు ఒలింపిక్స్‌లలోనూ పతకాలు (స్వర్ణం, రజతం) సాధించిన గోల్డెన్ బాయ్ మరోసారి గాయం కారణంగా అగ్రస్థానంలో నిలిచే అవకాశాన్ని కోల్పోయాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు గజ్జల్లో గాయమైనా ఆ నొప్పితోనే విశ్వక్రీడల్లో బరిలోకి దిగి రజతం పట్టుకొచ్చాడు. ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నా దేశం కోసం ఆ నొప్పిని పక్కనబెట్టి మరీ అంతర్జాతీయ క్రీడా యవనికపై మువ్వన్నెల పతకాన్ని రెపరెపలాడించిన నీరజ్.. డీఎల్ ఫైనల్స్‌లోనూ అదే పట్టుదలను ప్రదర్శించాడు. ఈ పోటీ సన్నాహకాల్లో భాగంగా ఐదు రోజుల క్రితమే నీరజ్ ఎడమ చేతి వేలికి గాయమైంది. ఎక్స్‌రేలో నాలుగో వేలు దగ్గర చీలిక వచ్చినట్టు తేలింది. కానీ నీరజ్ మాత్రం తన వైద్య బృందం సూచనలతో బరిలో నిలిచి సత్తా చాటాడు. ఒక్క సెంటిమీటర్ దూరంతో డైమండ్ లీగ్ టైటిల్ కోల్పోయినా దేశం కోసం అతడు చూపిన తెగువకు సలామ్ కొట్టాల్సిందే!

నేడే భారత్, సౌత్ కొరియా సెమీస్ పోరు

ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీ



హులున్‌బుయిర్ (చైనా): ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచిత్తుగా ఓడిస్తున్న భారత జట్టు నేడు కీలక పోరులో దక్షిణ కొరియాతో తలపడనుంది. సోమవారం జరుగనున్న తొలి సెమీస్‌లో భారత్.. కొరియాను ఢీకొననుంది. లీగ్ దశలో చైనా, జపాన్, మలేషియాపై అలవోక విజయాలు సాధించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.. దక్షిణ కొరియాతో పాటు దాయాది పాకిస్థాన్‌నూ ఓడించి దూకుడు మీదుంది. భారత జట్టులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫుల్ జోష్‌లో ఉండగా సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ సింగ్, అరేజిత్ సింగ్, యువ మిడ్ ఫీల్డర్ రాజ్‌కుమార్ పాల్ అంచనాలకు మించి రాణిస్తున్నారు. అంతేగాక ప్రత్యర్థి గోల్స్ యత్నాలను మన డిఫెన్స్ విజయవంతంగా అడ్డుకుంటోంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. కొరియాను ఓడించి ఫైనల్ చేరుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు లీగ్ దశలో తమను ఓడించిన భారత్‌పై ప్రతీకారం తీర్చుకుని షాకిచ్చేందుకు దక్షిణ కొరియా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. రెండో సెమీస్‌లో పాకిస్థాన్.. చైనాతో తలపడనుంది. సెమీస్‌లో గెలిచిన జట్లు.. మంగళవారం ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

ఆసీస్, ఇంగ్లండ్ టీ20 సిరీస్ డ్రా

చివరి మ్యాచ్ వర్షార్పణం

ఓల్డ్ ట్రాఫర్డ్: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1–1తో డ్రాగా ముగిసింది. ఈ సిరీస్ తొలి రెండు మ్యాచ్‌లలో ఇరు జట్లు తలా ఒకటి గెలువగా ఆదివారం ఓల్డ్ ట్రాఫర్డ్ వేదికగా జరగాల్సిన మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య బ్లాక్‌బస్టర్ పోరును చుద్దామనుకున్న క్రికెట్ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఆతిథ్య జట్టుతో ఆస్ట్రేలియా గురువారం నుంచి ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది.

నా బిడ్డను నేనే పెంచుతా..



అమ్మతనాన్ని పరిపూర్ణంగా అనుభవించడం అదృష్టం. ఆ అదృష్టానికి దూరం కాను. నా తల్లి నన్నెలా సాకిందో, నేనూ నా బిడ్డను అలానే సాకుతా. నా బిడ్డకు అమ్మ ప్రేమను సంపూర్ణంగా అందిస్తా.' అంటున్నది బాలీవుడ్ లేడీ సూపర్ స్టార్ దీపికా పదుకొణె. ఈ నెల 8న ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బేబీ పెంపకం విషయంలో దీపిక ఓ బలమైన నిర్ణయాన్ని తీసుకున్నదట. సాధారణంగా సెలబ్రిటీలూ.. తమ పిల్లల్ని చూసుకునేందుకు ఎక్కువ మొత్తంలో డబ్బు వెచ్చించి, నానీ(ఆయమ్మ)లను నియమిస్తుంటారు. కానీ దీపిక.. అలాంటి వాటికి తాను పూర్తి విరుద్ధమని తేల్చి చెప్పేసిందట. 'ఐశ్వర్య రాయ్, అనుష్కశర్మ కూడా తమ బిడ్డలను ఆయమ్మల సహాయం లేకుండానే పెంచుకున్నారు. నేనూ వారి దారిలోనే పయనిస్తా. నా బిడ్డను నేనే పెంచుతా. కెరీర్ కూడా దాని తర్వాతే.' అని పేర్కొన్నదట దీపిక. అంతే కాదు, తన పాపను ఫొటోలకు కూడా దూరంగా ఉంచాలని ఆమె నిర్ణయం తీసుకున్నదట. సరైన సమయం వచ్చినప్పుడే తమ బిడ్డను ప్రపంచానికి పరిచయం చేయాలని దీపిక దంపతులు భావిస్తున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.



ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే సంతోషంగా ఉంది

'సినిమా చూసి అందరూ హార్ట్‌ఫుల్‌గా నవ్వుకుంటున్నారు. 'మత్తువదలరా' వరల్డ్‌లో బాబు లాంటి పాత్రను నాకిచ్చిన దర్శకుడు రితేష్‌కి, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. సత్యతో వర్క్ చేయడం వెరీ వెరీ హ్యాపీ. మా సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్.' అని కథానాయకుడు శ్రీసింహ కోడూరి అన్నారు. ఆయన, సత్య ప్రధానపాత్రధారులుగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన హిలేరియర్స్ థ్రిల్లర్ 'మత్తు వదలరా 2'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు కలిసి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. స్టార్ దర్శకులు గోపీచంద్ మలినేని, శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయ, అనుదీప్, మహేశ్‌బాబు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు అందించారు. రితేష్ రానా వంటి క్లారిటీ ఉన్న దర్శకుడు దొరకడం తమ అదృష్టమని, విజువల్ ఫీస్ట్‌లా సినిమా తీశాడని, థియేటర్లలో ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని, ప్రతి చోటా అద్భుతమైన స్పందన వస్తున్నదని నిర్మాతలు తెలిపారు. ఇంకా దర్శకుడు రితేష్ రానా, సత్య, సంగీత దర్శకుడు కాలభైరవ, పంపిణీదారుడు శశిధర్‌రెడ్డి, నటుడు రాజా కూడా మాట్లాడారు.

చిత్రం



యువహీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి కథానాయిక. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన తొలి పాటకూ, ఇతర ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నది. ఈ నెల 18న ఈ సినిమాలోని సెకండ్ సింగల్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. 'ఓ పిల్లో..' అంటూ సాగే ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, జెక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ పాటలో విశ్వక్‌సేన్, మీనాక్షి చౌదరిల లవ్లీ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కటసాని, నిర్మాణం: ఎస్ఆర్‌టి ఎంటర్టైన్మెంట్స్.

పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్




కార్తీ కథానాయకుడిగా ఓ భారీ పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కనుంది. ఇది కార్తి 29వ చిత్రం కావడం విశేషం. 'తానక్కరన్' సినిమాతో విమర్శకుల ప్రశంసలందుకున్న డైరెక్టర్ తమిళ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు, ఎషాన్ సక్సేనా, సునీల్ షా, రాజా సుబ్రమణియన్ నిర్మాతలు. కార్తీకి 'ఖైదీ' వంటి బ్లాక్‌బాస్టర్ అందించిన సంస్థలో నిర్మితమవుతున్న సినిమా కావడంతో ఈ సినిమాపై తమిళనాట భారీ అంచనాలు ఏర్పాడ్డాయి. ఈ సినిమాను 2025లో విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ పానిండియా సినిమా షూటింగ్ మొదలుకానుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్టైన్మెంట్, బిఫోర్‌యు మోషన్ పిక్చర్స్ ప్రతాకాలపై ఈ చిత్రం రూపొందనుంది.

ప్రతిష్టాత్మక గీతాఆర్ట్స్‌లో?



'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత నవీన్ పోలిశెట్టి విరామం తీసుకున్నారు. ఆయన చేతికి గాయం కావడమే ఈ విరామానికి కారణం. ఇప్పుడు నవీన్ పూర్తిగా తేరుకున్నారు. సినిమాలు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. తాజాగా గీతా ఆర్ట్స్‌లో ఓ సినిమా చేయడానికి ఆయన పచ్చ జెండా ఊపారని విశ్వసనీయ సమాచారం. ఇటీవల గీతా ఆర్ట్స్2 నుంచి వచ్చిన మంచి హిట్ 'ఆయ్'. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన అంజి దర్శకత్వంలోనే మరో సినిమా చేస్తామని 'ఆయ్' ప్రమోషన్‌లో నిర్మాత బన్నీ వాసు ప్రకటించారు. దానికి అనుగుణంగానే నవీన్ పోలిశెట్టి కథానాయకుడిగా అంజి దర్శకత్వంలోనే ఓ సినిమా చేయడానికి బన్నీవాసు పావులు కదుపుతున్నారట. నవీన్ కూడా అంజి దర్శకత్వంలో నటించేందుకు సుముఖంగానే ఉన్నట్టు సమాచారం. అయితే.. నవీన్‌ను మెప్పించే కథను అంజి చెప్పగలిగితే ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కే అవకాశం ఉంది.

వర్మ భయానక ప్రేమ



ప్రఖ్యాత దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందుతోన్న చిత్రం 'శారీ'. 'టూమచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి సమర్పకుడు కూడా రామ్‌గోపాల్‌వర్మే కావడం విశేషం. సత్యా యాదు, ఆరాధ్యదేవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవివర్మ నిర్మాత. నవంబర్‌లో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్జీవీ డెన్‌లో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఇది నిజజీవిత సంఘటనల మేళవింపుతో తెరకెక్కుతోన్న సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ఉత్తరప్రదేశ్‌లో ఎంతోమంది అమాయక మహిళలను మానభంగం చేసి, అతి క్రూరంగా చంపిన శారీ కిల్లర్ ఉదాంతానికి తెరరూపమే ఈ సినిమా అనీ, ఇందులో శారీ కిల్లర్‌గా సత్యా యాదు నటిస్తుండగా, తన అందంతో అతన్ని ఉన్మాదిగా మార్చిన అమ్మాయి పాత్రలో ఆరాధ్యదేవి కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. ఈచిత్రానికి కెమెరా: శబరి.



మా నమ్మకం నిజమైంది

ధృవ వాయు స్వీయదర్శకత్వంలో నటించిన చిత్రం 'కళింగ'. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ కలిసి నిర్మించిన ఈ సినిమా ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో, దర్శకుడు ధృవ వాయు మాట్లాడుతూ 'మౌత్ టాక్‌తో ఈ సినిమా అందరికీ చేరువ అవుతున్నది. ఈ సినిమలోని విజువల్స్, అమ్మవారిని చూపించిన తీరు.. ఇలా ప్రతి అంశం గురించీ ఆడియన్స్‌ని మాట్లాడుకుంటున్నారు. అందరూ ప్రాణంపెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం. కంటెంట్ ఉన్న సినిమాను ఆడియన్స్ కచ్చితంగా హిట్ చేస్తారు. ఈ సినిమాతో అది రుజువైంది.' అని చెప్పారు. దర్శకుడిపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ విజయంతో నిజమైందని నిర్మాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా హీరోయిన్ ప్రగ్యా నయన్, చీఫ్ మార్కెటింగ్ హెడ్ వంశీ, కెమెరామేన్ అక్షయ్ కూడా మాట్లాడారు.

తెలుగు తెరపై తమిళ మందారం






ఈ అమ్మాయి పేరు అతిథి శంకర్. ఈ అందాలబొమ్మది సామాన్యమైన నేపథ్యం కాదు. దక్షిణాది సినిమాను పాన్ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గ్రేట్ డైరెక్టర్ శంకర్ ముద్దుల తనయే ఈ ముద్దుగుమ్మ. ఈమె మంచి గాయని కూడా. వరుణ్‌తేజ్ నటించిన 'గని' సినిమాలో ఓ పాట కూడా పాడింది. ఎంబీబీఎస్ చదివింది. అసలు విషయం ఏంటంటే.. ఈ చెన్నై చందమామ త్వరలో కథానాయికగా తెలుగుతెరపై అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. సినిమా పేరు 'వీర ధీర శూర'. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఇందులో కథానాయకులు. ఇది తమిళ చిత్రం 'గరుడన్'కి రీమేక్. విజయ్ కనకమేడల దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. అతిథి కూడా సెట్లోకి అడుగుపెట్టింది. ముగ్గురు స్నేహితుల కథగా ఈ సినిమా రూపొందుతున్నదని, స్నేహం, స్వార్థం, ప్రతీకారం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ సినిమాలో మరో కథానాయిక కూడా ఉందట. ఆమె పేరు త్వరలో ప్రకటిస్తారట.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 16 సెప్టెంబర్ 2024
www.ntnews.com

కథాసుధ

చీమ తెలివి

ఓ పల్లెటూరి విద్యార్థి మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. ఉన్నత చదువుల కోసమని వసతి గృహంలో చేరడానికి పట్నానికి బయల్దేరాడు. వెళ్తూ తల్లి దగ్గర ఆశీస్సులు అందుకున్నాడు. 'అమ్మా! నేను పుట్టినప్పటి నుంచి ఊరు దాటింది లేదు. ఇక్కడే పుట్టి, పెరిగాను. ఈ వీధుల్లోనే తిరిగాను. పట్నం నాకు కొత్త. ఎలా మెలగాలో తెలియడం లేదు' అని వాపోయాడు కొడుకు. 'మంచివారితో స్నేహం చేస్తే చాలు నాయనా! నువ్వు అనుకున్న లక్ష్యం సాధిస్తావు. అదే చెడు సావాసం చేస్తే నష్టపోతావు' అని హెచ్చరించింది. 'ఎవరు మంచివాళ్లో, ఎవరు చెడ్డవాళ్లో గుర్తించడం ఎలా? దానికి నేనేం చేయాలి?' అని ప్రశ్నించాడు కొడుకు. అప్పుడు తల్లి.. గోడ వారగా వెళ్తున్న చీమల బారును చూపించి 'ఈ చీమంత తెలివి ఉంటే ఏ చీకూచింతా లేకుండా లోకమంతా చుట్టి రావొచ్చు' అని ధైర్యం చెప్పింది. ఆశ్చర్యంగా తల్లి వంక చూశాడు కొడుకు. వెంటనే ఆమె కాస్త చక్కెర తెచ్చి చీమల ముందుపోసింది. చకచకా వచ్చిన చీమలు చక్కెర ముక్కల్ని గబగబా తీసుకుని వెళ్లాయి. ఆ తర్వాత ఆమె... చక్కెర, ఉప్పురాళ్ల ముక్కలు కలిపి చీమల ముందర చల్లింది. చీమలు చక్కెర ముక్కల్ని మాత్రం తీసుకెళ్లి ఉప్పురాళ్ల ముక్కల్ని అక్కడే వదిలేశాయి. చీమలు చేస్తున్న పనిని కొడుక్కు చూపుతూ.. 'లోకమనేది మంచి చెడ్డల కలయిక. ఎక్కడికి వెళ్లినా.. మంచీ, చెడూ రెండూ ఉంటాయి. నీవు చేయాల్సినదంతా చీమలు చక్కెరను, ఉప్పును విడదీసినట్లు మంచి, చెడ్డ స్నేహితులను గుర్తించు. కళాశాలలో కొత్తగా స్నేహితులు పరిచయం అవుతారు. వారి నేపథ్యాలు, అభిరుచులు విభిన్నంగా ఉంటాయి. కాబట్టి వారిని కొన్నాళ్లపాటు జాగ్రత్తగా గమనించు. మంచివారు అనిపిస్తేనే వారితో స్నేహం చెయ్! చెడ్డవారిని దూరం పెట్టు!' అని సలహా ఇచ్చింది. ఆ మాటలతో విద్యార్థి ముఖం వెలిగిపోయింది. 'అలాగే అమ్మా!' అని తల్లి ఆశీస్సులు తీసుకొని పట్నం బయల్దేరాడు.



... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821



అనంత వ్రతం.. అద్భుత ఫలప్రదం

మంగళవారం అనంత పద్మనాభ స్వామి వ్రతం

అనంతుడిపై అత్యంత సుందరంగా పవళించి.. అనంత విశ్వాలనూ కాపుకాసే దేవుడు అనంత పద్మనాభుడు. స్వామి రూపంలో స్థితి మాత్రమే గోచరించదు. సృష్టికర్తతోపాటు, లయకారుడి తత్వాలూ స్వామి చిత్తరువులో దర్శనమిస్తాయి. అంటే సృష్టి, స్థితి, లయ తత్వాలకు ప్రతిబింబం స్వామి. పన్నగ శయనుడికి కావేరీ తీరం అచ్చొచ్చిందేమో! ఈ నదీమతల్లి తటిపై ఆది (శ్రీరంగపట్నం), మధ్య (శివసముద్రం), అంత్య (శ్రీరంగం) రంగాల్లో కొలువుదీరి భక్తుల హృదయాంతరంగాల్లో నయన మనోహరుడిగా పేరొందాడు. కావేటి రంగడు మన తెలుగు రాష్ట్రాల్లో రంగనాథుడిగా పలు ఆధ్యాత్మిక కేంద్రాల్లో వెలిసి నిత్యపూజలు అందుకుంటున్నాడు. ఆ స్వామి సేవలో తరించే అవకాశం కల్పిస్తుంది 'అనంత పద్మనాభ వ్రతం'. భాద్రపద శుద్ధ చతుర్దశి సందర్భంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. కష్టాలు తీరిపోవాలని, కోరికలు నెరవేరాలని ఈ వ్రతం నిర్వహిస్తారు. అరణ్యావాసంలో ఉన్న పాండవులు.. శ్రీకృష్ణుని సలహా మేరకు అనంత పద్మనాభ వ్రతం చేశారని పురాణ కథనం. ఆధ్యాత్మిక సాధనకు, ధర్మ కామ్య సిద్ధికి అనంత వ్రతం ఉత్తమ సాధనంగా చెబుతారు.

పద్మనాభుడి అర్చనలో మహావిష్ణువు పానుపు అయిన అనంతుడిని ఆరాధిస్తారు. వ్రతం విధివిధానాలు భవిష్యోత్తర పురాణంలో వివరించారు. పిండితోగానీ, దర్భలతోగానీ ఏడు పడగల సర్పాన్ని తయారుచేసి అష్టదళ పద్మ మంటపంపై గానీ, కలశంపై గానీ అనంతస్వామిని ప్రతిష్ఠించి షోడశోపచార పూజలు నిర్వర్తిస్తారు. కలశంలో పవిత్ర జలాలలో యమునా నదిని ఆవాహన చేసి వ్రతం కొనసాగిస్తారు. పూజలో భాగంగా 14 ముడులు కలిగిన ఎర్రని తోరాలను స్వామి దగ్గర ఉంచుతారు. తోరాలలోని 14 ముడులు ఒక్కో దేవతకు సంకేతంగా చెబుతారు. దిక్పాలకులు, రవి, వరుణుడు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, యముడు, బ్రహ్మ, చంద్రుడు, జీవుడు, శివుడు, వాయువు, అశ్విని దేవతల సాక్షిగా వ్రతాన్ని ఆచరిస్తున్నామని ఈ ముడుల ద్వారా తెలియజేస్తారు. వ్రత పరిసమాప్తి తర్వాత వాటిని దంపతులు తమ చేతులకు ధరిస్తారు. ఈ వ్రతాన్ని పాలీ చతుర్దశి వ్రతం అనీ, కదళీ వ్రతం అనీ పిలుస్తారు. ఒకసారి వ్రత దీక్షను స్వీకరించిన దంపతులు ఏటా తప్పకుండా ఆచరించాల్సి ఉంటుంది. కుదరని పక్షంలో ఎవరైనా వ్రతంలో ఉంచిన తోరాలనైనా తప్పనిసరిగా ధరించాలని పెద్దలు చెబుతారు. పౌర్ణమితో కూడుకున్న చతుర్దశి అయితే అనంత వ్రతానికి మరింత శ్రేష్ఠమని పెద్దల మాట.

... శ్యామ్‌ప్రసాద్

క్రీస్తు సందేశం



సాటివాని ప్రేమ

'నీవలె నీతోటి మనిషిని ప్రేమించాలి' అంటాడు ప్రభువు. మనల్ని మనం ఎంత ప్రేమగా చూసుకోగలమో, అంతే ప్రేమతో సాటి వారినీ చూడాలి అని చెప్పడం తేలికే! కానీ, ఆచరణలో ఇది చాలా కష్టం. కానీ, ప్రేమ ఉంటే అది సాధ్యమే! ఆ ప్రేమ.. దేవుణ్ని ప్రేమించే ప్రేమ. అదే ప్రేమతో మనిషినీ చూడాలి. మనిషిలో దేవుణ్ని చూడగలిగితే, ప్రతిమనిషిలోనూ దేవుడున్నాడని నమ్మగలిగితే, అదే దేవుడు నీలో, నాలో, అందరిలోనూ ఉన్నాడనీ విశ్వసిస్తే.. మనిషికి శత్రువులు ఎందుకు ఉంటారు! అందరిలోనూ ప్రేమమయుడైన దేవుడున్నాడని నమ్మగలిగితే.. ద్వేషానికి తావులేదు. హింసకు అవకాశమే ఉండదు. ఒకడు మరొకణ్ని దోపిడీ చేయలేడు. సర్పాన్ని చూసి మనం భయపడతాం. వాస్తవానికి మనిషి అలికిడి కాగానే.. సర్పమే పక్కకు జారుకుంటుంది. అంతేగాని కనిపించిన మనిషిపైకి వచ్చి కాటువేయదు. కారణం మనం అంటే దానికీ భయమే! కానీ, మనిషి.. మరో మనిషికి భయపడుతున్నాడు. అందుకు కారణం ప్రేమ లేకపోవడమే. మానవత్వం అంటే ఏంటో తెలియకపోవడం, సానుభూతి మృగ్యం కావడంతోనే మనిషి.. మనిషికి శత్రువుగా మారుతున్నాడు. అందుకే ప్రభువు 'నీ దేవుణ్ని ఆరాధించు, పక్కవాణ్ని ప్రేమించు, దైవారాధనను ప్రేమలా మార్చుకో' (మార్కు 12:30-31) అని బోధించాడు. ఈ సత్యాన్ని గ్రహిస్తే అప్పుడు వైషమ్యాలు లేని సమాజం ఏర్పడుతుంది.

... ప్రొ|| బెర్నార్డ్ రాజు,
98667 55024

మానసిక సమత్వమే కర్మయోగం

యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః।
సమః సిద్ధా వసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే॥

(భగవద్గీత 4-22)

అయాచితంగా లభించిన పదార్థాలతో సంతృప్తి చెందినవాడు, అసూయ లేనివాడు, సంతోషం-దుఃఖాలకు అతీతమైనవాడు, చేసే పని సిద్ధించినా, సిద్ధించకపోయినా సమంగా తీసుకునేవాడినే కర్మయోగి అంటారు. అలాంటి కర్మయోగి కర్మలను ఆచరించినా వాటి బంధనాల్లో చిక్కుకోడు. పనులు చేసేప్పుడు మన ప్రయత్నం ఏమీ లేకపోయినా విజయం కలగవచ్చు. ఒక్కోసారి ఎంత ప్రయత్నించినా అపజయం పాలుకావచ్చు. విజయం కలిగితే సంతోషం, అపజయంలో దుఃఖం కలగడం సాధారణమే. మనకు దక్కని విజయం ఇతరులకు దక్కినప్పుడు వారిపై అసూయ కలగడమూ కొంతవరకు సహజమే. అయితే ఎవరైతే వీటికి అతీతంగా స్పందిస్తారో వారిని కర్మయోగులు అంటున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగుల మనసు... సంఘర్షణలకు అతీతంగా స్పందిస్తుంది.

గీతావాక్యం



స్వార్థ ప్రయోజనాల కోసం చేసే కర్మల వల్ల సమాజానికి శ్రేయస్సు కలగదు. అలాంటి కర్మలను దుష్కర్మలుగా చెబుతారు. సామాజిక ప్రయోజనం లక్ష్యంగా చేసే కర్మలను సత్కర్మలుగా పేర్కొన్నారు. జగమంతా భగవంతుడి ఆవిష్కరణే అన్న భావన కలిగినప్పుడే ఎదుటివారిపై సమదృష్టి కలుగుతుంది. ఉద్యోగాలు చేసినా, వ్యాపారాలు చేసినా.. చేసే పనిలో నిబద్ధత, అంకితభావం, శ్రద్ధ, జవాబుదారీతనంతో పనిచేస్తే సంతృప్తితోపాటు సత్ఫలితమూ కలుగుతుంది. ఒకనాడు ఎక్కువ లాభం కలిగినా, తక్కువ లాభం వచ్చినా, నష్టం వచ్చినా.. పొంగిపోకుండా, కుంగిపోకుండా సమంగా మనసు నిలుస్తుంది.

ఒక సంస్థ ప్రక్రియపై దృష్టిపెట్టి పనిచేస్తుంది. మరొక సంస్థ ఫలితాలపై దృష్టిపెడుతుంది. ప్రక్రియపై దృష్టిపెట్టిన సంస్థకు 'ఆశయం' ఉంటుంది. న్యాయంగా, ధర్మంగా వ్యాపారం చేస్తుంది. ఫలితాలు ఎలా వచ్చినా దానిని పట్టించుకోదు. ఫలితాలపై దృష్టి సారించిన సంస్థకు 'ఆశ' ఉంటుంది. దానికి న్యాయాన్యాయాల కన్నా ఆశించిన ఫలితం రావడమే ప్రధానం. ఆశించడం ఘర్షణకు దారితీస్తుంది. ఆశించకుండా ఏది, ఎంత వచ్చినా సంతృప్తినిస్తుంది. జయాపజయాలలో సమస్థితిని పొందుతూ ప్రశాంతంగా ఉండటానికి సాధన అవసరం. సంఘర్షణలో ఘర్షణను కాకుండా ప్రశాంతతను ఆహ్వానించేవారే కర్మయోగులు అవుతారు.

ఒక రాజుకు ఓ సాధువు అడవిలోని పండును ఒకదానిని ప్రతిరోజూ ఇచ్చేవాడు. సాధువు వెళ్లగానే రాజు ఆ పండును బయటకు విసిరివేసేవాడు. ఒకనాడు ఆ పండును ఒక కోతి తీసుకొని కొరికింది. ఆశ్చర్యంగా పండు మధ్యలో ఒక మణి బయటపడింది. రాజుకు ఆశ్చర్యం వేసి తాను పారవేసిన పండ్లన్నీ విప్పి చూశాడు. ప్రతిపండులోనూ ఒకమణి ఉన్నది. అతనికి జ్ఞానోదయమైంది. వెంటనే సాధువు దగ్గరికి వెళ్లి సాష్టాంగపడ్డాడు. సాధువు ఇచ్చింది అడవిలోని పండు అని బాహిరమైన రూపాన్ని చూసి అసహ్యించుకున్నాడే కానీ, అంతరంగంలోనికి చూడగలిగితే లోతైన 'అవగాహన' కుదిరేది. నిజానికి జయాపజయాలు, సుఖదుఃఖాలు సాపేక్షాలే కానీ, రెంటికి అతీతమైన 'మనసే' సత్యాన్వేషణకు దారిచూపుతుంది.

పదాలకు అతీతమైనది భావన. ఆ భావనను అందుకునేందుకు సాధన కావాలి. సాధనలో ద్వంద్వాలకు అంటే లాభనష్టాలకు, సుఖదుఃఖాలకు అతీతమైన మానసిక స్థితి కుదురుతుంది. ఆ స్థితిలో చేసే పనిలో సమగ్రత సంపూర్ణతలు ఆవిష్కృతమవుతాయి. అయాచితంగానే ఫలితాలు అందివస్తాయి. ఆ ఫలితాలను సమాజంతో పంచుకునే విజ్ఞత వెలుగు చూస్తుంది. అసూయ, విభ్రాంతి, మాత్సర్యం లాంటి స్థానంలో ప్రేమ ఆప్యాయతలు చిగురిస్తాయి. రాయిరప్పల లాంటి జడత్వం నుండి చెట్టుచేమల స్థాయికి, అటునుంచి పశుస్థితికి, ఆ తర్వాత మనుష్యస్థితికి, అటుపై దైవత్వానికి పరిణతి చెందడం జరుగుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

స్మరణీయం.. ప్రవక్త జీవనం

నేడు మిలాద్ ఉన్ నబీ

ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పుట్టకముందే తండ్రిని, తొమ్మిదేండ్ల ప్రాయంలో తల్లిని కోల్పోయారు. అనాథగా ప్రారంభమైన ఆయన జీవితం కష్టాల కడలిలో ఎదురీతలాగా సాగింది. ఎంతో సాధన చేసి స్వయంకృషితో ప్రవక్తగా రాణించారు. చక్రవర్తిగా ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ప్రవక్త (స) తుదిశ్వాస వరకూ ఎన్నో ఆదర్శాలను ఆచరించి చూపారు. దేవుడొక్కడే, మనుషులంతా ఒక్కటేనని చాటి చెప్పి అరబ్బు సమాజాన్ని సమూలంగా మార్చేశారు. హిరా గుహలో దైవవాణి ఆదేశం మేరకు ప్రవక్త బాధ్యతను స్వీకరించారు. కత్తితో సాధించలేనిది కరుణతో సాధించారు. మానవాళికి నైతిక జీవిత పాఠాలు బోధించారు. అందుకే ఆయన ఈ లోకం వీడి 1500 సంవత్సరాలైనా ప్రపంచం నలుమూలలా ప్రవక్తను స్మరించుకుంటూనే ఉన్నారు. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘటనలు మనకు మార్గదర్శనం చేస్తాయి.

ప్రేమానురాగాలు ముఖ్యం

ఒకసారి ఒక గ్రామీణుడు ప్రవక్త (స) దర్బారుకు వచ్చాడు. ఆ సమయంలో మహాప్రవక్త (స) తన మనుమడు హసన్ (రజి)ని ముద్దాడుతున్నారు. గ్రామీణుడికి అది ఓ వింతగానూ, పరువు ప్రతిష్ఠలకు విఘాతం కలిగించే విషయంగానూ తోచింది. 'మీరు పిల్లల్ని ముద్దాడుతారా?! నాకు పదిమంది పిల్లలున్నారు. వారిలో ఏ ఒక్కరినీ ఇంతవరకు ముద్దాడలేదు' అని ప్రవక్తతో అన్నాడు. ప్రవక్త (స) ఆ వ్యక్తిని తేరిపార చూసి, 'దయ చూపనివాడు దయకు నోచుకోడు' అని బదులిచ్చారు.

ఆడపిల్లలు స్వర్గానికి మార్గాలు

ఒకసారి హజ్రత్ ఆయిషా సిద్దీఖా దగ్గరకు ఒక నిరుపేద యాచకురాలు వచ్చింది. ఆమె వెంట ఇద్దరు ఆడ పిల్లలున్నారు. ఆ సమయంలో ప్రవక్త (స) కుటీరంలో ఒక్క ఖర్జూరపు పండు తప్ప మరేమీ లేదు. అప్పుడు హజ్రత్ ఆయిషా ఆ ఒక్క ఖర్జూరాన్నే యాచకురాలికి దానం చేశారు. అప్పుడు ఆమె ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలుగా చేసి తన ఇద్దరు పిల్లలకు సమంగా పంచిపెట్టింది. ఆ తల్లి మమకారం హజ్రత్ ఆయిషాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయిషా ఆ ఘటనను ప్రవక్త (స)కు వివరించింది. 'ఆడపిల్లల పట్ల మంచిగా ప్రవర్తిస్తే వాళ్లు నరకాగ్నికి అడ్డు తెరగా నిలుస్తారు' అని ప్రవక్త(స) అన్నారు.

మంచితనమే స్వర్గానికి అర్హత


ప్రవక్త (స) కాలంలో ఇద్దరు మహిళలు విరుద్ధ భావాలు కలిగి ఉండేవారు. వారిలో ఒకామె రాత్రంతా నమాజులో లీనమై ఉండేది. పగటిపూట ఉపవాస వ్రతాలు పాటించేది. విస్తృతంగా దానధర్మాలు చేసేది. కానీ ఆమె తన నోటి దురుసుతనం వల్ల ఇరుగుపొరుగు వారిని ప్రశాంతంగా బతకనిచ్చేది కాదు. రెండో మహిళ కేవలం ఫర్జ్ నమాజులు చేసేది. మాటలు, చేతలతో ఎవరినీ నొప్పించేది కాదు. ఆ ఇద్దరు మహిళల గురించి ప్రవక్త (స) దగ్గర ప్రస్తావించగా.. 'మొదటి మహిళలో మంచితనం లేదు. తన దుష్ప్రవర్తనకు శిక్షను అనుభవిస్తుంది. రెండో మహిళ మంచితనంతో స్వర్గంలో స్థానం సంపాదిస్తుంది' అని అన్నారు.

కఠిన శిక్షలు వద్దు

ఒకసారి ఒకతను దుప్పటి కప్పుకొని నిద్రపోతుండగా, మరో వ్యక్తి వచ్చి నెమ్మదిగా ఆ దుప్పటిని దొంగలించాడు. బాధితుడు న్యాయం కోరుతూ ప్రవక్త (స)కు జరిగిన ఉదంతం వివరించాడు. అప్పుడు ప్రవక్త (స).. దుప్పటి దొంగతనం చేసిన వ్యక్తి చేతులు నరికివేయాలని తీర్పునిచ్చారు. ఆ తీర్పునకు కక్షిదారు హతాశుడయ్యాడు. దొంగపై జాలి కలిగింది. 'కేవలం దుప్పటి కోసం ఒక మనిషి చేతులు నరికివేస్తారా? నేను ఈ దుప్పటిని ఈ దొంగకు అప్పుగా ఇస్తున్నాను. అతడిని వదలిపెట్టండి' అని విన్నవించాడు. 'ఇంతకుముందే ఈ పని ఎందుకు చేయలేదు' అని ప్రవక్త (స) ఫిర్యాదుదారును మందలించారు.

అసలు దరిద్రులెవరో తెలుసా?

ఒకసారి ప్రవక్త (స) తన సహచరులను ఉద్దేశించి 'దరిద్రుడు ఎవరో మీకు తెలుసా?' అని అడిగారు. దానికి వారు 'డబ్బు, ఖరీదైన వస్తువులు లేనివారే దరిద్రులు అని మేము భావిస్తున్నాం' అని అన్నారు. 'వారు కాదు దరిద్రులు. ప్రళయ దినం నాటికి తన ఖాతాలో దుష్కర్మలు కలిగినవారే అసలైన దరిద్రులు' అని ప్రవక్త (స) వారికి బదులిచ్చారు. తర్వాత పహిల్వాన్ ఎవరో మీకు తెలుసా? అంటూ ప్రవక్త (స) తన సహచరులను అడిగారు. 'కుస్తీలో పైచేయి సాధించేవాడే పహిల్వాన్' అన్నారు వారు. 'అసలు పహల్వాన్ అతను కాదు. కోపం, ఆవేశం వచ్చినప్పుడు తనను తాను నిగ్రహించుకున్నవాడే అసలైన పహిల్వాన్' అని ప్రవక్త (స) తెలిపారు.



స్వర్గం ఎవరి కోసం?

ఒకసారి ప్రవక్త (స) స్వర్గం గురించి చెప్తూ దానిలోని భోగభాగ్యాలను వివరించారు. ఒక పల్లెటూరి సహచరుడు ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరై, 'దైవప్రవక్తా, ఇంతకీ ఈ స్వర్గంలో ఎవరికి ప్రవేశం లభిస్తుంది' అని ప్రశ్నించాడు. 'మృదుభాషికి, ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టేవారికి, ఎక్కువగా ఉపవాసాలు పాటించే వారికి, లోకమంతా నిద్రిస్తున్న సమయంలో నమాజులు చేసేవారికి' అని ప్రవక్త సమాధానమిచ్చారు. ఒక మంచి మాట కూడా దానంతో సరి సమానమని మరో సందర్భంలో చెప్పారు.

అతిథి సేవ ముఖ్యం

ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త (స) దగ్గరికి బాగా ఆకలితో వచ్చాడు. ఆ సమయంలో ప్రవక్త కుటీరంలో మంచి నీళ్లు తప్ప మరేమీ లేదు. అందువల్ల ఆయన తన సహచరులను ఉద్దేశించి, ఈ రోజు రాత్రి ఈ వ్యక్తికి ఆతిథ్యమిచ్చే వారిపై అల్లాహ్ దయ చూపుతాడని అన్నారు. అన్సార్ సహాబీ అనే వ్యక్తి ఆ అతిథిని తన ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఇంట్లో పిల్లలకు సరిపడా అన్నం మాత్రమే ఉందని అతని భార్య చెప్పింది. 'పిల్లల్ని ఎలాగో బుజ్జగించి నిద్రపుచ్చు. ఇంట్లోని దీపం ఆర్పివేయి. మనమిద్దరమూ భోజనం చేస్తున్నట్లుగా నటిద్దాం. మనం పస్తులున్న విషయం అతిథికి తెలియకూడదు' అని తన ఇల్లాలికి చెప్పారు. ఆమె భర్త చెప్పినట్లే చేసింది. ఈ విషయం ప్రవక్త (స)కు దైవవాణి ద్వారా తెలిసి ఆ సహచరుడిని ఎంతగానో మెచ్చుకున్నారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076